www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తిండికి మించి తాగుడు!

ఆహారం కన్నా మద్యానికే ఎక్కువ ఖర్చు చేస్తున్న వైనం

సగటున ఆహారానికి రూ.80.. తాగుడుకు రూ.158 ఖర్చు

ప్రతి నలుగురిలో ఒకరికి మందు తాగే అలవాటు 14

కూలీల దినసరి సంపాదనలో మూడో వంతు మద్యానికే

వయసుతో నిమిత్తం లేకుండా పెరిగిన లిక్కర్ వినియోగం

చిత్తవుతున్న యువత భవిత.. డీఎడిక్షన్ కేంద్రాలు అవసరం



మంగళవారం | 18-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 332 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: చవితి రా.10:10 తదుపరి పంచమి, నక్షత్రం: స్వాతి సా.5:52 తదుపరి విశాఖ, వర్జ్యం: రా.12:09-1:57, అమృతఘడియలు: ఉ.7:56-9:44, దుర్ముహూర్తం: ఉ.8:47-9:35, రా.10:18-11:05, రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6:24, సూర్యాస్తమయం: 6:22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చేనేతలకు ఉచిత విద్యుత్

ఇళ్లకు 200 యూనిట్లు.. పవర్‌లూంకు 500 యూనిట్లు

కేబినెట్ ఓకే.. ఎన్నికల హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు

రాజధాని పనుల ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్

ఉపాధ్యాయ బదిలీల ముసాయిదా బిల్లుకు ఆమోదం

బుడమేరు మరమ్మతులకు రూ.18 కోట్లు

వైఎస్సార్ జిల్లా ఇకపై వైఎస్సార్ కడప జిల్లా

తాడిగడప మున్సిపాలిటీలో వైఎస్సార్ పేరు తొలగింపు



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

ఎస్సీ వర్గీకరణకు ఓకే

ఏకసభ్య కమిషన్ నివేదికకు మంత్రివర్గం ఆమోదం

మూడు కేటగిరీలుగా ఎస్సీలు

గ్రూప్-1, 2, 3గా రెల్లి, మాదిగ, మాల ఉపకులాల వర్గీకరణ

ఈ సమావేశాల్లోనే అసెంబ్లీకి నివేదిక

ప్రత్యేక చర్చ అనంతరం కేంద్రానికి

రాష్ట్రం యూనిట్‌గా అమలుకు నిర్ణయం

విభేదిస్తున్న మాల సామాజిక వర్గం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ నివేదికను ఆమోదించారు. దీనిని ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశ పెట్టనున్నారు. అనంతరం, దీనిపై ప్రత్యేక చర్చను చేపట్టి సభ ఆమోదం తీసుకుని.. ఆ వెంటనే కేంద్రానికి పంపించనున్నారు. కాగా.. ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని

మిగతా 12వ పేజీలో...

రాష్ట్రం యూనిట్.. 200 రోస్టర్ పాయింట్లు

రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్‌రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించింది. వీటి ప్రకారం రోస్టర్ పాయింట్లను 200గా నిర్ణయించింది. జిల్లాను యూనిట్‌గా చేసుకుని అమలు చేయాలని కొంత మంది మంత్రులు కోరగా, అలా చేస్తే న్యాయపరమైన సమస్యలు వస్తాయని అధికారులు తెలిపినట్లు సమాచారం. 2026లో జనగణన జరిగాక జిల్లాలవారీగా అమలు చేసే అంశాన్ని పరిశీలిద్దామని, ప్రస్తుతానికి నివేదికను ఉన్నది ఉన్నట్టుగా ఆమోదిద్దామని సీఎం చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది.

వర్గీకరణలో ఎవరికెంత రిజర్వేషన్?

గ్రూప్-1 (రెల్లి కులస్థులు) 1%
సమాజంలో అత్యంత వెనుకబడి ఉండడంతో జనాభా ప్రాతిపదికన వారికి 1 శాతం రిజర్వేషన్ కల్పించాలని కమిషన్ సిఫారసు చేసింది.

గ్రూప్-2 (మాదిగ, ఉపకులాలు) 6.5%
జనాభా దామాషాలో రెండో స్థానంలో ఉండడంతో వీరికి 6.5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కమిషన్ పేర్కొంది.

గ్రూప్-3 (మాల, ఉపకులాలు) 7.5%
జనాభా ఎక్కువగా ఉండడంతో వీరికి 7.5 శాతం రిజర్వేషన్ కల్పించాలని నివేదిక పేర్కొంది.



నియోజకవర్గానికో విజన్ ప్లాన్

ఎమ్మెల్యే చైర్మన్‌గా అమలు పర్యవేక్షణ

జిల్లా స్థాయిలో చైర్మన్‌గా ఇన్‌చార్జ్ మంత్రి

ఇకపై ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యం

పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు


ఐదేళ్లలో ప్రతి కుటుంబానికీ సొంతిల్లు

విద్యార్థులకు యూనిక్ స్కిల్ పాస్‌పోర్టులు

ఉగాది రోజు పీ-4 కార్యక్రమం ప్రారంభం

మే నెలలో తల్లికి వందనం

స్వర్ణాంధ్ర 2047పై అసెంబ్లీలో చంద్రబాబు ప్రసంగం



2004, 2019లో ఓటమికి నేనే కారణం.. నన్ను ఎవరూ ఓడించలేరు: చంద్రబాబు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదేళ్లకు నియోజకవర్గ స్థాయి విజన్ అమలు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. శాసనసభలో విజన్ ప్లాన్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరిస్తూ ఆయన మాట్లాడారు. "మన రాష్ట్రం ప్రస్తుతం ఏ దశలో ఉంది...భవిష్యత్తులో ఎంత అభివృద్ధి జరగాలనే లక్ష్యాలను

మిగతా 13వ పేజీలో...

ఏపీకి బాసటగా గేట్స్ ఫౌండేషన్

ఐదు కీలక రంగాల్లో సహకారం

రేపు ఢిల్లీలో బిల్ గేట్స్, చంద్రబాబు సమక్షంలో ఎంఓయూలు

ఆరోగ్యం, విద్య, పరిపాలన, వ్యవసాయం, ఏఐపై ఒప్పందాలు

మెడ్‌టెక్ జోన్‌తో కలిసి సమర్థంగా టెలీ మెడిసిన్ 12

సాగుకు సాంకేతిక సాయం.. ఉపాధికి టెక్నాలజీ సహకారం

ముఖ్యమైన కార్యక్రమాలతో ముందుకొచ్చిన గేట్స్ ఫౌండేషన్



'ఉపాధి'లో వైసీపీ భారీ అవినీతి 13

ఆడిట్‌తో వెలుగులోకి రూ.250 కోట్ల అక్రమాలు

అవినీతి సొమ్మును రికవరీ చేసే పనిలో ఉన్నాం

బాధ్యుల్ని వదిలేది లేదు: డిప్యూటీ సీఎం పవన్

అయ్యో అమరజీవి!

శిథిలావస్థలో చెన్నైలోని పొట్టి శ్రీరాములు స్మారకం

కమిటీ వేసినా నిధులివ్వని ప్రభుత్వాలు

రోజువారీ నిర్వహణ ఖర్చులను భరిస్తున్న 'సభ్యులు'

సీఎం చంద్రబాబు దృష్టి సారించాలంటూ విజ్ఞప్తులు

(చెన్నై - ఆంధ్రజ్యోతి)

తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన ప్రదేశంలో కొన్నేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్మారక భవనాన్ని నిర్మించింది. ఇప్పుడది శిథిలావస్థకు చేరుకుంది. 2015 నుంచి నిర్వహణకు కమిటీలు వేసినా నెలవారీ నిర్వహణ ఖర్చుల కోసం నిధులు ఇవ్వాలన్న విషయాన్ని మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో దాని బాగోగులు చూస్తున్న కమిటీ సభ్యులే వారి వారి

మిగతా 14వ పేజీలో...



అమరజీవి స్మారక భవనంలో దెబ్బతిన్న పైకప్పు

ఎవరెవరిని ఎక్కడెక్కడ నియమించారు?

తిరుపతి తొక్కిసలాట ఘటనపై కలెక్టర్‌ను ప్రశ్నించిన కమిషన్

నాడు విధుల్లో ఉన్న అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ఇవ్వాలని ఆదేశం

నేడు విచారణకు హాజరు కానున్న ఎస్పీ హర్షవర్ధన్ 3



బాపట్ల జిల్లా గాజుల్లంక ఇసుక రీచ్‌లో నదిలో భారీ యంత్రాలతో లారీల్లోకి ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం మారింది.. ఇసుక విధానమూ మారింది. కానీ అక్రమాలకు అడ్డుకట్ట మాత్రం పడలేదు. అక్రమార్కులు యథేచ్ఛగా, ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వంతో పోల్చుకుంటే 'అంతకు మించి' అన్నట్టు అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కృష్ణమ్మ గర్భశోకం మరింత పెరిగింది.

ఆగని ఇసుక దందా

ఉమ్మడి గుంటూరులో యథేచ్ఛగా దోపిడీ

ప్రభుత్వం మారినా అక్రమాలు షరా మామూలే

కృష్ణా నదిని గుల్ల చేస్తున్న వైనం

రీచ్‌లలో కాంట్రాక్టర్ల ముసుగులో ఇష్టారాజ్యం

వైసీపీ హయాం నాటి అక్రమార్కుల హవా

కూటమి ప్రభుత్వంలోనూ వారి వెనుక ఎవరో?

గాజుల్లంకలో భారీ యంత్రాలతో తవ్వకాలు

రాత్రీపగలూ నదిలో నుంచే లారీల్లో రవాణా

(తెనాలి/బాపట్ల-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రకారం... నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వరాదు. కూలీలతోనే తవ్వకాలు చేపట్టాలి. నదిలో నుంచి నేరుగా లారీల్లో రవాణా చేయరాదు. డంపింగ్ యార్డ్‌కు తరలించి అక్కడ గుట్టలుగా పోసి.. తిరిగి ఎక్స్‌కవేటర్లతో కానీ కూలీలతో కానీ లారీలకు లోడ్ చేయొచ్చు. ఇందుకుగాను ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు కొంత మొత్తం చెల్లిస్తుంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గాజుల్లంక ఇసుక రీచ్‌లో భారీ యంత్రాలు తప్ప కూలీలు కనిపించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌కవేటర్లతో ఇష్టానుసారం ఇసుకను తవ్వి నదిలో నుంచే నేరుగా లారీల్లో తరలిస్తున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో అనధికారిక ఇసుక తవ్వకాలతో కృష్ణా నదిని గుల్ల చేస్తుండగా, ఇక్కడ కాంట్రాక్టు పేరిట దోపిడీకి పాల్పడుతున్నారు. నదిలో భారీగా

మిగతా 11వ పేజీలో...

అరాచక శక్తుల్ని ఉక్కుపాదంతో అణిచేయండి

డీజీపీ గుప్తాకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్యపై సీరియస్

చెప్పి మరీ హత్యలు చేస్తున్నారు 14

వేట కొడవళ్లతో నరికి చంపుతున్నారు

ఇలాంటి వారు బయట ఉండటానికి వీల్లేదు: సీఎం

ఢిల్లీలో పయ్యావుల 11

రూ.68 వేల కోట్ల కొత్త అప్పులకు

కేంద్రం అనుమతి కోసం యత్నాలు



14

అమెరికాలో తోబుట్టువుల బీభత్సం

అన్నదమ్ముల దుర్మరణం

వారి తల్లిది తెనాలి, తండ్రి అమెరికన్

మండిన ఉత్తర కోస్తా

వడగాడ్పులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి

వీరఘట్టంలో 42.8 డిగ్రీలు నమోదు 3

'శంషాబాద్'లో రన్యారావులెందరో!

బంగారం స్మగ్లింగ్‌లో మహిళలదే కీలక పాత్ర

యథేచ్ఛగా దుబాయ్ నుంచి అక్రమ రవాణా

స్మగ్లర్లకు కస్టమ్స్‌లో ఇంటి దొంగల సహకారం

ఒక్క అధికారి సహకరించినా వారికి పండగే

టన్నుల్లో అక్రమ రవాణా.. గ్రాముల్లో పట్టివేత

ఆ కేసుల్లో మూలాలకు వెళ్లని దర్యాప్తు సంస్థలు



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావు అరెస్టు.. రూ.12 కోట్ల విలువైన 14.8 కిలోల బంగారం సీజ్.. 'శంషాబాద్ విమానాశ్రయంలో స్మగ్లింగ్ గుట్టురట్టు.. మలద్వారంలో 3 కిలోల బంగారం గుర్తింపు.. ఒకరి అరెస్టు'.. 'మిక్సర్-గ్రైండర్ మోటార్‌లో మూడు కిలోల బంగారంతో వైండింగ్.. ఇద్దరు మహిళల అరెస్టు'.. 'పౌడర్/పేస్ట్ రూపంలో బంగారం.. 7 కిలోలు సీజ్.. ముగ్గురికి బేడీలు'.. పత్రికల్లో ఇలాంటి వార్తలు రోజూ కనిపిస్తున్నాయి. కేరళలో ఏకంగా సీఎం పినరయి విజయన్‌ను వణికించిన స్వప్న సురేశ్ కేసులోనూ బంగారం అక్రమ రవాణా కోణం ఉన్న విషయం తెలిసిందే.! గోల్డ్ స్మగ్లింగ్‌కు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని 15% నుంచి 6శాతానికి తగ్గించినా.. అక్రమ రవాణా ఎందుకు ఆగడం లేదు? అంతర్జాతీయ విమానాశ్రయాల్లో బంగారం జాడను ఇట్టే పసిగట్టే యంత్రాలున్నా.. అధికారులు స్మగ్లింగ్‌ను పూర్తిస్థాయిలో ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? గోల్డ్ స్మగ్లర్లతో కస్టమ్స్ అధికారులు కుమ్మక్కవుతున్నారా? అస్మదీయుల స్మగ్లింగ్‌ను చూసీచూడనట్లు వదిలేస్తున్నారా?? బంగారం అక్రమ రవాణాకు సంబంధించి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నిత్యం వార్తల్లో ఉంటోంది. ముంబై, బెంగళూరు, న్యూఢిల్లీ

మిగతా 2వ పేజీలో...



వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల సహా

11 మంది యూట్యూబర్లపై కేసు

బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసినందుకే

నిందితుల్లో సెలబ్రిటీలు, టీవీ నటులు

త్వరలో నోటీసులు.. అరెస్టుకు అవకాశం

పంజాగుట్ట/హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలర్ ప్రిడిక్షన్.. నంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్.. ఇలా చైనా కేంద్రంగా పనిచేస్తున్న పలు బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడి.. భారతీయులు రూ.కోట్లు పోగొట్టుకుంటున్నారు. "తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం" అంటూ ఇలాంటి యాప్స్‌పై ఊదరగొడుతూ ప్రచారం చేస్తున్న 11 మంది యూట్యూబర్లు, ఇన్‌స్టా యూజర్లపై పంజాగుట్ట పోలీసులు కొరడా ఝుళిపించారు. హర్షసాయి, విష్ణుప్రియ వంటి యూట్యూబర్లు సహా.. సెలబ్రిటీలు, టీవీ నటులపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల కూడా ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటలోని ఓ సంస్థలో శిక్షణ తరగతులకు హాజరవుతున్న మియాపూర్ వాసి వి.వినయ్.. శిక్షణ కేంద్రాల వద్ద విద్యార్థుల్లో చాలా మంది బెట్టింగ్ యాప్‌లకు బానిసలై.. ఉన్నదంతా పోగొట్టుకుంటున్న విషయాన్ని గుర్తించారు. పలువురు యూట్యూబర్లు ఈ తరహా యాప్‌లకు ప్రచారం చేస్తున్నారంటూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా బెట్టింగ్ యాప్‌లపై ఎక్స్ వేదికగా మండిపడుతున్నారు. దీంతో పంజాగుట్ట పోలీసులు సోమవారం 11 మంది యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై గేమింగ్ యాక్ట్‌లోని సెక్షన్లు 3, 3ఏ, 4.. ఐటీ చట్టంలోని సెక్షన్ 66డీ, భారత న్యాయ సంహితలోని 318(4) సెక్షన్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో శ్యామల(వైసీపీ అధికార ప్రతినిధి),

మిగతా 2వ పేజీలో...

పెళ్లయిన నెల నుంచే విడిగా ఉంటున్నాం



» కోర్టుకు తెలిపిన రన్యా రావు భర్త జతిన్

బెంగళూరు, మార్చి 17: గత ఏడాది నవంబరులో తాము వివాహం చేసుకున్నామని, కానీ కొన్ని కారణాల వల్ల డిసెంబరు నెల నుంచే విడివిడిగా ఉంటున్నామని కన్నడ నటి రన్యారావు భర్త జతిన్ హుక్కేరి కోర్టుకు తెలిపారు. రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో తనకు అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. వారిద్దరూ అనధికారికంగానే విడివిడిగా ఉంటున్నారని హుక్కేరి తరఫు న్యాయవాది ప్రభులింగ్ నవదాగి కోర్టులో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఈనెల 24న తమ అభ్యంతరాలను వెల్లడిస్తామని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తరఫు న్యాయవాది మధురావు కోర్టుకు తెలిపారు. అయితే తదుపరి విచారణ వరకు హుక్కేరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గత మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ ఆదేశాలు 24వ తేదీ వరకు అమలులో ఉండనున్నాయి. కాగా, రన్యారావు శరీరం అంతా బంగారం చుట్టుకుని వచ్చిందని, ఆమెకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయో ఆ సమాచారం మొత్తం సేకరించానని బీజేపీ బీజాపూర్ సిటీ ఎమ్మెల్యే బసన్‌గౌడ పాటిల్ యత్నాల్ విలేకరుల సమావేశంలో చెప్పారు.

బట్టతలపై హేళన.. ఉరేసుకున్న భర్త

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులకు మరో భర్త బలైపోయాడు. ఇప్పటికే భార్యల వేధింపుల వల్ల ఇద్దరు ముగ్గురు ఐటీ ప్రొఫెషనల్స్ వంటి ఉన్నత స్థాయిలో ఉన్న భర్తలు బలైపోయిన ఘటనలు వెలుగు చూడగా, తాజాగా.. బట్ట తల ఉందని భార్య హేళన చేయడం, సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టడంతో పరశివమూర్తి(30) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. కర్ణాటకలోని చామరాజనగర తాలూకా ఉడిగాల గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఆత్మహత్యకు ముందు పరశివమూర్తి సూసైడ్ నోట్ రాశారు. కళకిపుర గ్రామానికి చెందిన మమతతో పరశివమూర్తికి రెండేళ్లక్రితం వివాహమైంది. పెళ్లికి ముందే అతడికి బట్టతల ఉంది. మొదటి నుంచి బంధువులు, బయటివారి ఎదుట భర్తను మమత చులకనగా మాట్లాడేది. విలాసవంతమైన జీవితాన్ని కోరుకునేది. రీల్స్‌లో మునిగితేలేది. నగలు, దుస్తులు కొనివ్వాలని వేధించేది. మానసికంగా, శారీరకంగా హింసపెట్టేది. ఈ క్రమంలో అక్రమ కేసు పెట్టి పరశివమూర్తిని నెలన్నరపాటు జైలులో గడిపేలా చేసింది. ఆమె వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని పరశివమూర్తి పేర్కొన్నారు.

'బీమా'పై జీఎస్టీ రేట్ల సవరణకు జీవోఎం: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై వసూలు చేస్తున్న జీఎస్టీ రేట్ల సవరణకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ చేసిన సిఫార్సు మేరకు దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య బీమా, జీవిత బీమా ప్రీమియంపై వసూలు చేస్తున్న 18% జీఎస్టీపై సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

..శ్యామల సహా 11 మంది యూట్యూబర్లపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

హర్ష సాయి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియ, రీతూ చౌదరి, బండారు శేషయాని సుప్రీత, కిరణ్ గౌడ్, అజయ్, సన్నీ యాదవ్, సుధీర్ పేర్లు ఉన్నాయి. పోలీసులు వీరందరికీ త్వరలో నోటీసులు జారీ చేసి, విచారించనున్నారు. విచారణ సందర్భంగా యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చే వాంగ్మూలాన్ని బట్టి.. అరెస్టులు కూడా ఉంటాయని తెలుస్తోంది.

సజ్జనార్ పోరాటం: ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా ఎక్స్ వేదికగా పోరాటం సాగిస్తున్నారు. "బెట్టింగ్ యాప్‌లకు సెలబ్రిటీలు, యూట్యూబర్లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రచారం కల్పిస్తున్నారు. ఫలితంగా అమాయకులు నష్టపోతున్నారు. సర్వం కోల్పోయి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అంటూ ట్వీట్లు చేస్తున్న విషయం తెలిసిందే..! నిజానికి ఆయన సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా ఉన్న సమయంలో.. ఈ తరహా గేమింగ్ యాప్ నిర్వాహకుల భరతం పట్టారు. యాప్ నిర్వాహకుల మూలాల వరకు వెళ్లారు. ఢిల్లీ, నోయిడా, ఉత్తరప్రదేశ్‌లో ఉంటూ.. యాప్‌లను నిర్వహించే భారతీయులను అరెస్టు చేయగా.. చైనాలో ఉన్న సూత్రధారులపైనా కేసులు నమోదయ్యాయి.

గంజాయి కేసులో శిక్ష.. నేరస్తుడు పరారీ..

» రాజమహేంద్రిలో బేడీలు వేస్తుండగా కలబడి వేగంగా పరుగు

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోర్టు శిక్ష విధించిన ఖైదీ పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయాడు. రాజమహేంద్రవరం కోర్టు బయటు సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా గన్నవరం పంచాయతీ నాచవరానికి చెందిన లావేటి తల్లిబాబును గంజాయి కేసులో డీఆర్ఐ పోలీసులు గతంలో అరెస్టు చేశారు. అప్పటి నుంచీ రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్నాడు. సోమవారం అతని నేరం రుజువు కావడంతో కోర్టు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించింది. కోర్టులో నిందితుడిని హాజరు పరిచే సమయంలో బేడీలు (హ్యాండ్ కఫ్స్) వేయకూడదు. దీంతో నేరస్తుడిని బయటికి తీసుకొచ్చి జైలుకు తరలించేందుకు బేడీలు వేస్తున్న క్రమంలో... తమతో కలబడి వేగంగా పారిపోయాడని ఎస్కార్టుగా వచ్చిన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒక రోజు పోలీస్ కస్టడీకి పోసాని

» గుంటూరు కోర్టు ఆదేశం

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని ఒక రోజు పోలీసు విచారణకు గుంటూరు కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు సీఐడీ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ అయిన ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ స్పందన సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న పోసానిని అధికారులు ఉదయం 10 గంటలకు కస్టడీలోకి తీసుకోనున్నారు. కర్నూలు జిల్లా జైలు నుంచి పోసానిని పీటీ వారెంట్‌పై ఈ నెల 12న సీఐడీ అధికారులు గుంటూరుకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. కాగా, గత ప్రభుత్వంలో టీడీపీ అధినేత చంద్రబాబు పట్ల పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ కార్యకర్త బండారు వంశీకృష్ణ గత ఏడాది అక్టోబరు 9న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోసానిపై సీఐడీ కేసు నమోదు చేసింది.

పదేళ్లలో రూ.16.35 లక్షల కోట్లు

బ్యాంకులు రైటాఫ్ చేసిన మొత్తమిది



» లోక్‌సభలో నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 17: గత పది ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు రూ.16.35 లక్షల కోట్ల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) లేదా మొండి బాకీలను బ్యాంకులు రైటాఫ్ చేసినట్టు కేంద్ర ప్రభుత్వం సోమవారం పార్లమెంట్‌కు తెలియజేసింది. ఇందులో అత్యధికంగా రూ.2,36,265 కోట్లను 2018-19 సంవత్సరంలో.. అత్యల్పంగా రూ.58,786 కోట్లను 2014-15 సంవత్సరంలో రైటాఫ్ చేసినట్టు పేర్కొంది. 2023-24లో రూ.1,70,270 కోట్లు, అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో రూ.2,16,324 కోట్లను బ్యాంకులు రైటాఫ్ చేసినట్టు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం బ్యాంకులు మొండి పద్దులను రైటాఫ్ చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి రైటాఫ్‌ల వల్ల రుణగ్రహీతల రుణాలు మాఫీ కావు కాబట్టి వారికి ప్రయోజనం కలగదని తెలిపారు. బ్యాంకులు వాటికి అందుబాటులో ఉన్న వివిధ రికవరీ యంత్రాంగాల ద్వారా రుణగ్రహీతలపై రికవరీ చర్యలు చేపడతాయని చెప్పారు. సివిల్ కోర్టులు లేదా డెట్ రికవరీ ట్రైబ్యునళ్లు వంటి వాటిలో దావా వేయడంతోపాటు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడం, నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో కేసులను దాఖలు చేయడం వంటివి చేస్తాయన్నారు. ఆర్బీఐ గణాంకాల ప్రకారం.. 2024 డిసెంబరు 31 వరకు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఎన్‌పీఏలుగా వర్గీకరించిన 20 ప్రత్యేక రుణగ్రహీత కంపెనీలున్నాయని, వాటిలో ప్రతి ఒక్కటీ రూ.1,000 కోట్లు అంతకుమించి బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ ఖాతాల మొత్తం బకాయిలు రూ.61,027 కోట్లుగా ఉన్నట్టు తెలిపారు. రుణగ్రహీతలు బకాయి పడిన మొత్తాన్ని రికవరీ చేయడానికి బ్యాంకులు కాల్స్ చేయడంతోపాటు ఈమెయిల్స్/లేఖలు పంపుతాయని పేర్కొన్నారు. డిఫాల్ట్ మొత్తాన్ని బట్టి కార్పొరేట్ రుణగ్రహీతల విషయంలో కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించడానికి గాను బ్యాంకులు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. రుణ ఖాతాను ఎన్‌పీఏగా వర్గీకరించిన సందర్భంలో తమ బ్యాంకు బోర్డు ఆమోదం తెలిపిన విధానం ప్రకారం బ్యాంకులు రికవరీ చర్యలకు ఉపక్రమిస్తాయని చెప్పారు. కాగా ఎనిమిదో వేతన సంఘం (సీపీసీ) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మరో ప్రశ్నకు సమాధానంగా నిర్మలా సీతారామన్ తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి మొబైల్ యాప్

ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 17: యువతకు పారిశ్రామిక నైపుణ్యాన్ని అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకంలో మరిన్ని కంపెనీలు చేరాలని పిలుపునిచ్చారు. అలాగే యువతను ఇందులో చేరేలా ప్రోత్సహించాలని ఎంపీలకు సూచించారు. పరిశ్రమల అంచనాలు, అవసరాల పరంగా సిబ్బంది కొరత ఉందని.. ఆ అంతరాలను తగ్గించడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. కేంద్రమంత్రి హర్ష్ మల్హోత్ర మాట్లాడుతూ.. గతేడాది అక్టోబరు 3న ప్రారంభమైన ఈ పథకం పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో 1.27 లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు దక్కాయన్నారు. రెండో విడతలో 1.18 లక్షల మందికి రెండో విడతలో అవకాశాలు లభించాయని వివరించారు. కాగా, ఈ పథకం కింద నెలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున 12 నెలల పాటు ఆర్థిక సాయంతో పాటు రూ.6 వేల గ్రాంట్ లభిస్తుంది.

లోకం తీరు



సహకారంతోనే ఎదుగుతాం

» మోదీ వ్యాఖ్యలకు చైనా సానుకూలత

» మాది రెండువేల ఏళ్ల బంధమని వ్యాఖ్య

బీజింగ్, మార్చి 17: ఇరుదేశాల మధ్య సంబంధాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను చైనా స్వాగతించింది. పరస్పర సహకారంతోనే ఉభయపక్షాలు ఎదుగుతాయని అభిప్రాయపడింది. 'డ్రాగన్, ఐరావతం కలిసి పాడాల్సిన గీతవిదే.' అంటూ వ్యాఖ్యానించింది. భారత్-చైనా సరిహద్దుల్లో సైనిక ఉద్రిక్తతలు తలెత్తిన గత మూడేళ్ల కాలంలో భారత్, చైనా తొలిసారి బాహాటంగా పరస్పరం సానుకూలతను ప్రకటించాయి. ఇటీవల తాను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో జరిపిన చర్చల తర్వాత సరిహద్దుల్లో సాధారణ స్థితి నెలకొందని అమెరికాకు చెందిన లిక్స్ ఫ్రీడ్‌మన్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మోదీ చెప్పారు. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. 'రెండు వేల సంవత్సరాలకు పైగా భారత్, చైనాలు స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉన్నాయి. మానవ నాగరికతా విజయాలకు, వికాసానికి పరస్పరం తోడ్పడ్డాయి." అని మావో నింగ్ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో చేరిన మోదీ

న్యూఢిల్లీ, మార్చి 17: సామాజిక మాధ్యమం వేదిక అయిన 'ట్రూత్ సోషల్'లో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఖాతా తెరిచారు. ఈ వేదికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలోని ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ నిర్వహిస్తోంది. లెక్స్ ఫ్రీడ్‌మ్యాన్‌తో మోదీ పాల్గొన్న పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దాంతో మోదీ కూడా ట్రూత్ సోషల్‌లో చేరారు. అర్థవంతమైన సంభాషణల కోసం ఎదురు చూస్తున్నానంటూ పోస్టు పెట్టారు. పాడ్‌కాస్ట్‌ను షేర్ చేసినందుకు 'ధ్యాంక్యూ మై ఫ్రెండ్ ప్రెసిడెంట్ ట్రంప్' అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీతో తులసి గబ్బార్డ్ భేటీ

ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీపై చర్చ.. తులసికి త్రివేణి సంగమ జలం ఇచ్చిన మోదీ

» మోదీకి రుద్రాక్ష మాల బహూకరించిన గబ్బార్డ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి17: భారత పర్యటనలో ఉన్న యూఎస్ ఇంటలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ ఆమెకు ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా త్రివేణి సంగమ జలం ఇచ్చారు. ప్రతిగా ఆమె మోదీకి రుద్రాక్ష మాల బహూకరించారు. రెండు నెలల సమయంలో వీరిద్దరూ సమావేశం కావడం ఇది రెండోసారి. ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు తులసితో సమావేశమయ్యారు. అంతకు ముందు ఆమె రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. భారత వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న నిషేధిత ఖలిస్థానీ సంస్థ సిఖ్ ఫర్ జస్టిస్‌పై చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ ఆమెను కోరారు. రక్షణ రంగం, నిఘా సమాచార పంపిణీపై కూడా సమావేశంలో చర్చించారు. అంతకు ముందు ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తులసి గబ్బార్డ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఊచకోతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు అమెరికా యత్నిస్తోందని చెప్పారు. క్లిష్ట సమయాల్లో తనకు భగవద్గీతలోని శ్రీకృష్ణుడి బోధనలు మార్గదర్శకంగా నిలిచాయని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. 3 రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చిన ఆమె నిన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన ప్రపంచ నిఘా విభాగాధిపతుల సదస్సులో పాల్గొన్నారు.



మోదీకి రుద్రాక్ష మాల బహూకరిస్తున్న గబ్బార్డ్

రేపు వేకువజామున భూమికి సునీతా విలియమ్స్!

వాషింగ్టన్, మార్చి 17: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో దాదాపు తొమ్మిది నెలల పాటు చిక్కుకున్న భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మంగళవారం తిరిగి భూమి మీదకు రానున్నారు. ఆమెతో పాటు సహచర వ్యోమగామి బచ్ విల్మోర్ కూడా రానున్నారు. అమెరికాలోని ఫ్లోరిడా కాలమానం ప్రకారం సాయంత్రం 5.57 గంటలకు (భారత కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున 3.37 గంటలకు) వారు ప్రయాణించే క్యాప్సూల్ ఫ్లోరిడా సమీపంలోని సముద్రంలో దిగనుంది. అక్కడి నుంచి ఒక్కొక్కరిని బయటకు తీసుకువస్తారు. వారిని తీసుకురావడానికి వెళ్లిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఆదివారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. దీంట్లో వెళ్లిన నలుగురు వ్యోమగాములు అక్కడి బాధ్యతలను స్వీకరిస్తారు. సునీత, విల్మోర్‌లతో పాటు నాసా వ్యోమగామి నిక్ హ్యేగ్, రష్యా వ్యోమగామి అలెక్సాండర్ గర్బునవ్ కూడా క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో తిరిగి రానున్నారు. వారు కిందకు దిగే కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. క్రూ డ్రాగన్ వ్యోమనౌక ప్రయాణ సన్నాహాలు సోమవారం రాత్రే మొదలయ్యాయి. అమెరికా కాలమానం ప్రకారం రాత్రి 10.45 గంటలకు వ్యోమనౌక హ్యాచ్ మూసివేత ప్రక్రియ మొదలవుతుంది. అర్ధరాత్రి 12.45 గంటలకు అన్‌డాకింగ్ ఆరంభవుతుంది. స్పేస్‌షిప్ విడిపోయిన తరువాత మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. 5.51 గంటలకు భూమి కక్ష్యను దాటుకొని వస్తుంది. సాయంత్రం 5.57 గంటలకు ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగుతుంది. గత ఏడాది జూన్ 5న ప్రయోగించిన స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారా సునీత, విల్మోర్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఎనిమిది రోజులు ఉండాలన్నది అసలు ప్రణాళిక. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారిని తీసుకురాకుండానే భూమికి వచ్చింది. దాంతో వారు ఇనాళ్లూ అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

పుతిన్‌తో ట్రంప్ చర్చలు నేడే

అమెరికా, రష్యా వెల్లడి



» ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికే అవకాశం

వాషింగ్టన్, మార్చి 17: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి చర్చలు జరపనున్నారు. ఈ విషయాన్ని అటు రష్యా, ఇటు అమెరికా కూడా ధ్రువీకరించాయి. ఇప్పటికే ఒకసారి ట్రంప్.. రష్యా అధినేతతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అయితే.. అప్పట్లో అసంపూర్తిగా చర్చలు ముగిశాయి. దీంతో తాజాగా మరోసారి పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. అయితే.. యుద్ధం ముగింపునకు సంబంధించి తమకు బలమైన హామీలు ఇవ్వాలని రష్యా డిమాండ్ చేస్తోంది. నాటో సభ్యత్వం నుంచి ఉక్రెయిన్‌ను మినహాయించాలని పట్టుబడుతోంది. అంతేకాదు, ఉక్రెయిన్ తటస్థంగా ఉండాలని కోరుతోంది. వాస్తవానికి అమెరికా ఇరు దేశాలకు 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించింది. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. కానీ, రష్యా అధినేత పుతిన్ మాత్రం.. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి విరామం ఇచ్చేముందు కీలకమైన షరతులను నెరవేర్చాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రతీకార సుంకాలపై తగ్గేదే లేదన్న ట్రంప్

రంగాలవారీ టారీఫ్‌లతోపాటు ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఏప్రిల్ 2 నుంచి అమలు చేయనున్న ప్రతీకార సుంకాలపై అమెరికా వాణిజ్య భాగస్వాములకు మినహాయింపు ఇచ్చే ఉద్దేశం ఏమీ లేదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రతీకార సుంకాల నుంచి ఏ దేశానికీ మినహాయింపు ఇచ్చే ఉద్దేశం తనకు లేదని పదే పదే చెబుతున్న ట్రంప్ తాజాగా ఆదివారం కూడా అదే విషయాన్ని స్పష్టం చేశారు. మరోవైపు.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పదవీకాలం చివరలో ప్రసాదించిన క్షమాభిక్షలు చెల్లవని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆటో పెన్ ద్వారా సంతకం చేసిన ఆ క్షమాభిక్షలన్నీ బైడెన్ పూర్తి అవగాహన లేకుండా ఆమోదించినవని ట్రంప్ తేల్చిచెప్పారు. అందువల్ల ఆ క్షమాభిక్షలు జారీ చేసిన అధికారులు నేరానికి పాల్పడినట్టేనన్నారు. ప్రత్యేకించి జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి ఘటనను దర్యాప్తు చేసిన హౌస్ కమిటీ సభ్యులకు మంజూరు చేసిన క్షమాభిక్షల చట్టబద్ధతను 'ట్రూత్ సోషల్' పోస్టులో ట్రంప్ తోసిపుచ్చారు. 'నిద్రమత్తులో జో బైడెన్ ఎంపిక కానటువంటి పొలిటికల్ థగ్స్ కమిటీకి, అనేకమంది ఇతరులకు ప్రసాదించిన క్షమాభిక్షలు చెల్లవు. అవి ఇక ఏ మాత్రం అమలులో ఉండబోవని ప్రకటిస్తున్నా. ఎందుకంటే వాటిపై ఆటో పెన్‌తో సంతకం చేశారు. అంటే వాటిపై జో బైడెన్ సంతకం చేయలేదని అర్థం.మరీ ముఖ్యంగా వాటి గురించి బైడెన్‌కు అసలు ఏమీ తెలియదు. ఆ క్షమాభిక్షల గురించి బైడెన్ సరిగా వెల్లడించనే లేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

మోదీ పాడ్‌క్యాస్ట్‌ను షేర్ చేసిన ట్రంప్

అమెరికన్ పాడ్‌క్యాస్టర్ లెక్స్ ఫ్రీడ్‌మన్ షోలో భారత ప్రధాని మోదీ సంభాషణ వీడియోను ట్రంప్ ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. ట్రంప్ నాయకత్వాన్ని ఆ షోలో మోదీ ప్రశంసించారు. ట్రంప్‌తో తాను సమావేశమైన సందర్భాలను చిరస్మరణీయ ఘటనలుగా పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొనసాగుతున్న తమ సంబంధాలనూ ఆ షోలో మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. దాదాపు మూడు గంటలపాటు సాగిన ఆ షో యూ ట్యూబ్ లింక్‌ను తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు.

శంషాబాద్‌లో రన్యారావులెందరో!

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయాల తరహాలో ఇక్కడ భారీ ఎత్తున బంగారం పట్టుబడకున్నా.. అడపాదడపా చెప్పుకోదగ్గ స్థాయిలో.. గ్రాముల నుంచి కిలోల్లో స్వర్ణం సీజ్ అవుతోంది. ఇలా నగరానికి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. పురుషులతో పోలిస్తే.. వీరికి తనిఖీలు పెద్దగా ఉండవు. దాంతో స్మగ్లర్లు అరబ్ దేశాల నుంచి వచ్చే మహిళలను బంగారం అక్రమ రవాణాకు వినియోగించుకుంటున్నారని తెలుస్తోంది. లోదుస్తుల్లో.. పాదరక్షల్లో.. హ్యాండ్ బ్యాగుల్లోని ప్రత్యేక అరల్లో.. చివరకు పౌడర్, పేస్ట్ రూపంలో బంగారాన్ని క్యాప్సుల్స్‌గా మార్చి, మర్మావయవాల్లో, మలద్వారంలో, పొట్టలో దాచుకుని.. తీసుకొస్తున్నారు.

30% అక్రమ బంగారమే..!

దేశంలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో 30% అక్రమ మార్గాల్లో దిగుమతి అయినదేనని ఓ నివేదిక స్పష్టం చేస్తోంది. టన్నుల్లో బంగారం స్మగ్లింగ్ జరుగుతుంటే.. కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు పట్టుకుంటున్నది కేవలం కిలోలు, గ్రాముల్లోనే కావడం గమనార్హం.! అంటే టన్నుల కొద్దీ దొంగ బంగారం చేరాల్సిన చోటికి సేఫ్‌గా చేరిపోతోంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్(డబ్ల్యూజీసీ) అంచనా మేరకు 2022లో దేశంలో గోల్డ్ స్మగ్లింగ్ విపరీతంగా పెరిగింది. అందుక్కారణం.. దిగుమతి సుంకాన్ని సర్కారు 7.5% నుంచి 12.5శాతానికి పెంచడమే..! ఆ తర్వాత ఈ సుంకాన్ని 15శాతానికి పెంచారు. అయితే.. బంగారం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు కేంద్రం తాజా బడ్జెట్‌లో ఈ సుంకాన్ని 6శాతానికి తగ్గించింది. దీంతో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.4 వేల మేర తగ్గాయి. అయినా.. గోల్డ్ స్మగ్లింగ్ తగ్గకపోగా.. రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఏటా భారత్‌కు 700 టన్నుల మేర బంగారం దిగుమతి అవుతుండగా.. అందులో 400 టన్నులు మాత్రమే చట్టబద్ధంగా వస్తోందని, మిగతా 300 టన్నులు స్మగ్లింగేనని కేంద్ర ఆర్థికశాఖ అంచనా వేస్తోంది. దేశంలో ప్రస్తుతం 10 గ్రాముల బంగారం(22 క్యారెట్లు) ధర సుమారు రూ.80,500గా ఉంది. అదే 24 క్యారెట్ల బంగారం అయితే.. రూ.87,820 + 3% జీఎస్టీ చెల్లించాలి. అంటే.. రూ.90,454 వరకు ఖర్చవుతుంది. దుబాయ్ లాంటి దేశాల్లో 24 క్యారెట్ల మేలిమి బంగారం రూ.82,976కే లభిస్తోంది. తేడా సుమారు రూ.7,478. దాన్ని 22 క్యారెట్లుగా మారిస్తే.. 10.91 గ్రాములు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా కిలో బంగారాన్ని అక్రమ మార్గాల్లో దిగుమతి చేసుకుంటే.. రూ.20 లక్షల మేర స్మగ్లర్లకు లాభం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దుబాయ్ ఇతర దేశాల నుంచి రవాణా, అధికారులకు లంచాలు పోను.. కిలోకు రూ.19 లక్షల వరకు మిగులుతుందని అంచనా..! స్మగ్లరు ఒకట్రెండు కిలోలు కాకుండా.. ఒకే విడతలో వేర్వేరు ప్రయాణికులకు 10-20 కిలోల మేర బంగారాన్ని అంటగట్టి పంపుతారని తెలుస్తోంది. దీన్ని బట్టి వారి లాభాలు రూ.1.9 కోట్ల నుంచి రూ.3.8 కోట్ల వరకు ఉంటాయి.

కస్టమ్స్ అధికారుల పాత్ర..

నిజానికి సెంట్రల్ ఎక్సైజ్ పరిధిలో.. కస్టమ్స్ విభాగంలో పనిచేసేవారు నిబద్ధతతో ఉంటారనే పేరుంది. అయితే.. కొందరు అధికారులు మాత్రం తక్కువ సమయంలో ఎక్కువమొత్తం సంపాదించే ఉద్దేశంతో తప్పుదారి పడుతూ.. స్మగ్లర్లకు సహకరిస్తుంటారని సమాచారం. కస్టమ్స్ విభాగాల్లో పనిచేసేవారు రెండేళ్ల వరకు మాత్రమే విమానాశ్రయాల్లో పనిచేస్తారు. ఈ రెండేళ్లలో అందినకాడికి సంపాదించడమే లక్ష్యంగా కొందరు స్మగ్లర్లతో అంటకాగుతున్నారు. కిలో బంగారానికి కస్టమ్స్ అధికారులకు రూ.50 వేల దాకా ముడుతున్నట్లు సమాచారం. దాంతో.. సింహభాగం దొంగ బంగారం యథేచ్ఛగా బయటకు వెళుతుండగా.. 10% లోపు అక్రమ బంగారాన్ని మాత్రం సీజ్ చేస్తూ.. కేసులు నమోదు చేస్తున్నారు. అడపాదడపా కస్టమ్స్/డీఆర్ఐ అధికారులు స్మగ్లింగ్ బంగారాన్ని సీజ్ చేసి, సరఫరాదారును అరెస్టు చేసినా.. మూలాలకు వెళ్లి, సూత్రధారులను అరెస్టు చేసే దాకా దర్యాప్తు సాగడం లేదు.

కఠిన శిక్షలతోనే భయం

విమానాశ్రయంలో కస్టమ్స్ విభాగానికి చెందిన ఒక్క ఉద్యోగి పరిచయమున్నా.. స్మగ్లర్ల పని సులభమవుతుంది. సాధారణ ప్రజలే కాకుండా వీవీపీలు ఎక్కువగా సరుకు అక్రమ రవాణా చేస్తుంటారు. వీవీపీలకు గ్రీన్ చానల్ మార్గం ఉంటుంది. నిబంధనల ప్రకారం గ్రీన్ చానల్‌లో వచ్చే వారిని కూడా తనిఖీ చేయాలి. కానీ, ఈ నిబంధన అమలు కావడం లేదు. ఎవరైనా అధికారి లేదా సిబ్బంది స్మగ్లర్లకు సహకరిస్తే.. వారికి శిక్షలు కఠినంగా ఉన్నప్పుడే.. అక్రమ రవాణా అంటే వారిలో భయం ఉంటుంది.

- సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ సుధాకర్

చట్టాలు ఏం చెబుతున్నాయి?

- పాస్‌పోర్టు చట్టం-1967, కస్టమ్స్ చట్టాల ప్రకారం ప్రయాణికులు నిర్ణీత మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తెచ్చుకోవొచ్చు.
- దుబాయ్ వంటి దేశాల్లో ఆర్నెల్లకంటే ఎక్కువగా ఉన్న వారు పురుషులు 20 గ్రాములు, మహిళలు, 15 ఏళ్ల లోపు పిల్లలు 40 గ్రాముల వరకు బంగారాన్ని తీసుకువస్తే.. ఎలాంటి సుంకాలు ఉండవు.
- ఇంతకు మించి అదనపు బంగారం తీసుకురావాలంటే.. సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. పురుషులకు– 20 నుంచి 50 గ్రాముల అదనపు బంగారానికి 3%, 50-100 గ్రాములకు 6%, 100 గ్రాములకు మించిన బంగారానికి 10% కస్టమ్స్ డ్యూటీ చెల్లించాలి. మహిళలు, పిల్లలకు 40-100 గ్రాములకు 3%, 100-200 గ్రాములకు 6%, 200 గ్రాముల కంటే ఎక్కువైతే 10% మేర కస్టమ్స్ సుంకాన్ని చెల్లించాలి.
- దుబాయ్‌లో ఆర్నెల్లలోపు ఉండి.. తిరిగి వచ్చేవారికి ఎలాంటి మినహాయింపులు ఉండవు. వారు 38.5% మేర కస్టమ్స్ సుంకాలను చెల్లించాల్సిందే.



సీఎంని కలిసిన సిద్ధార్థ్

» ఏఐ సాయంతో గుండె జబ్బు నిర్ధారించే యాప్ రూపకల్పన చేసిన ఎన్ఆర్ఐ విద్యార్థి

» అభినందించిన సీఎం, డిప్యూటీ సీఎం

అమరావతి, గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏడు సెకన్లలోనే గుండె జబ్బును నిర్ధారించే మొబైల్ యాప్‌ను రూపొందించిన ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల అనే 14 ఏళ్ల బాలుడు ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిశాడు. ఏఐ ద్వారా పనిచేసే సిర్కాడియావీ యాప్ సాయంతో సిద్ధార్థ్ గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు గుండె స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించాడు. విషయం తెలుసుకున్న సీఎం.. సోమవారం సిద్ధార్థ్‌ను కలిసేందుకు సచివాలయానికి ఆహ్వానించారు. ఆ బాలుడి ప్రొఫైల్ తెలుసుకుని అభినందించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. సిద్ధార్థ్‌ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా అభినందించారు. అనంతపురానికి చెందిన సిద్ధార్థ కుటుంబం 2010లో అమెరికాలో స్థిరపడింది. సీఎంను కలిసిన వారిలో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, సిద్ధార్థ్ తండ్రి మహేష్ ఉన్నారు.

మండిన ఉత్తర కోస్తా



» వీరఘట్టంలో 42.8 డిగ్రీలు నమోదు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి మధ్య భారతం మీదుగా పొడి గాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో సోమవారం వేడి వాతావరణం కొనసాగింది. ఉత్తరకోస్తాలో ఎండ తీవ్రత పెరిగి వడగాడ్పులు వీస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి వేడిగాలులు రావడంతోప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. విపత్తుల నిర్వహణ సంస్థ బులెటిన్ ప్రకారం.. సోమవారం మన్యం జిల్లా వీరఘట్టంలో 42.8, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 42.6, అనకాపల్లి జిల్లా నాతవరం, రావికమతం, ప్రకాశం జిల్లా పెద్దారవీడు, నంద్యాల జిల్లా గోనవరంలో 42.1, కర్నూలు జిల్లా నన్నూరులో 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 మండలాల్లో తీవ్రంగా, 78 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. రాయలసీమ, దక్షిణ కోస్తాలో పలుచోట్ల గాడ్పుల ప్రభావం కొనసాగింది. మంగళవారం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి జిల్లాల్లోని 29 మండలాల్లో తీవ్రంగా, శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు 99 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రెండు రోజుల తర్వాత గాడ్పుల ప్రభావం స్వల్పంగా తగ్గుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

మంచంపై నుంచే పరీక్షకు..

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ విద్యార్థి మంచంపై ఉండే పదోతరగతి పరీక్ష రాశాడు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ ఆకులవారిపల్లెకు చెందిన లహిత్‌కుమార్‌రెడ్డి పదోతరగతి చదువుతున్నాడు. ఈనెల 14న ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు మదనపల్లెకు తరలించి చికిత్స చేయించారు. మంగళవారం ప్రారంభమైన తెలుగు పరీక్షకు విద్యార్థి హాజరు కావలసి ఉంది. నడవలేని, కూర్చోలేని పరిస్థితిలో ఉన్న అతనిని కుటుంబీకులు కారులో పరీక్షా కేంద్రమైన ఏపీ మోడల్ స్కూల్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడే హాస్టల్‌లోని ఓ మంచం మీద పడుకోబెట్టి నలుగురు మోసుకుంటూ లోనికి తెచ్చారు. ఓ సహాయకుడిని ఏర్పాటు చేసి లహిత్‌కుమార్‌రెడ్డి పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించారు. దీంతో ఆ విద్యార్థి మొదటి పరీక్ష పూర్తి చేశాడు.

- బి.కొత్తకోట, ఆంధ్రజ్యోతి



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో పరీక్ష రాసేందుకు లహిత్‌కుమార్‌రెడ్డిని మంచంపై మోసుకొస్తున్న దృశ్యం



రెడ్‌క్రాస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడలో రెడ్‌క్రాస్ నూతన భవనం

» శంకుస్థాపన చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ (వన్‌టౌన్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయ భవన నిర్మాణం జరగనుంది. గాంధీనగర్ కూడలిలో సుమారు 17వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అంతస్థులతో నిర్మించనున్న ఈ భవనానికి సోమవారం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో ఉగాది వేడుకలు జరపాలి

» శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఉగాది వేడుకగా జరగాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో పార్టీలకు అతీతంగా అందరు కలిసి ఉగాది పూజలు చేయాలి. అందరూ కూర్చుని పంచాంగశ్రవణం చేయడంతో పాటు పచ్చడి ఇచ్చి ఆశీర్వదించాలి' అని పేర్కొన్నారు. నష్టపోయిన రాష్ట్రాన్ని, ప్రజలను ఆశీర్వదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.



శ్రీవారి ఆలయం ముందు అయ్యన్నపాత్రుడు

నేడు శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల జూన్ నెల లక్కీడిప్ కోటాను టీటీడీ ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. డిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు నమోదు చేసుకోవచ్చు. డిప్ ద్వారా టికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించి టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక, 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ టికెట్లను, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవ, వాటి దర్శన టికెట్లను విడుదల చేయనున్నారు. అలాగే 22 ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి టోకెన్లు విడుదల చేస్తారు. 24వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, మధ్యాహ్నం తిరుపతి, తిరుమలలోని గదుల కోటాను విడుదల చేసారు. వీటిని 'టీటీడీదేవస్థానమ్స్‌ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా బుక్ చేసుకోవచ్చు.

కోస్తా రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేయాలి

» లోక్‌సభలో జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'అన్నవరం నుంచి బాపట్ల వరకు ప్రధాన తీరప్రాంత జిల్లాలు, ఓడ రేవులను కలుపుతూ కోస్తా రైల్వే కారిడార్‌ను తక్షణమే అభివృద్ధి చేయాలి' అని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. సోమవారం లోక్‌సభలో రైల్వే డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రానికి ఈ సారి రైల్వే బడ్జెట్‌లో రూ.9,417 కోట్లు కేంద్రం కేటాయించింది. ఈ కేటాయింపులు రాష్ట్ర పురోగతికి కేంద్ర నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. కోస్తా కారిడార్ పూర్తి చేయడానికి 30కి.మీ. కొత్త రైల్వే ట్రాక్, గేట్ వే పోర్టు, కాకినాడ పోర్టుల మధ్య లింక్ అవసరమవుతుంది. రైల్వే మంత్రి వెంటనే ఈ కారిడార్ సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని చేపట్టాలి' అని తంగెళ్ల విజ్ఞప్తి చేశారు.

27న హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 20న నామినేషన్ల తుది జాబితా ప్రచురిస్తారు. 27న ఎన్నికల అనంతరం అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఎం.విజయ్‌కుమార్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

తిరుమలలో సాధువుల ధర్నా

» నిబంధనలు అతిక్రమించి ఆలయం ముందు బైఠాయింపు
» బీసీవైపీ అధ్యక్షుడు ఆర్సీవై కూడా..
» జీవో 24ను రద్దు చేయాలంటూ నినాదాలు
» బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి తరలించిన పోలీసులు

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సాధువులు ధర్నాకు దిగారు. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు నిబంధనలకు వ్యతిరేకంగా సోమవారం శ్రీవారి ఆలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించడంతో పాటు తిరుమల పవిత్రతను దెబ్బతీయడంతో పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు వారిని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, అక్కడి నుంచి తరలించాల్సి వచ్చింది. ఈ క్రమంలో శ్రీవారి ఆలయం ముందు దాదాపు 20 నిమిషాలపాటు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏం జరుగుతోందో తెలియక భక్తులు భయాందోళనకు గురయ్యారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి, ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలని, తిరుమలలో గోశాల ఏర్పాటు చేసి టీటీడీనే సొంతంగా డెయిరీ నిర్వహించి ఆ నెయ్యితోనే ప్రసాదాలు తయారు చేయాలంటూ వారంతా సోమవారం ఉదయం పాదయాత్రగా అలిపిరికి చేరుకున్నారు. తిరుమలలో ధర్నాలు, నిరసనలు, రాజకీయ ప్రసంగాలు చేయకూడదని ముందస్తుగానే తిరుమల పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే, తాము ఆందోళన చేసేందుకు వెళ్లడం లేదని, స్వామిని దర్శించుకుని వినతిపత్రం సమర్పిస్తామని చెప్పడంతో పాదయాత్రకు అనుమతించారు. దీంతో సాధువులు మధ్యాహ్నం నేరుగా అన్నప్రసాద భవనానికి వచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటామని చెప్పినప్పటికీ, ఆలయం ముందున్న అఖిలాండం మెట్ల వద్దకు చేరుకుని ఒక్కసారిగా అందరు నేలపై బైఠాయించారు. 'ముఖ్యమంత్రి మాట తప్పారు. జీవో నెంబరు 24ను వెంటనే రద్దు చేయాలి. సీఎం హామీ ఇచ్చే వరకు ఇక్కడి నుంచి పైకి లేచేదేలేదు. జైశ్రీరాం.. గోవిందా' అంటూ 20 నిమిషాలు నినాదాలు చేశారు. తిరుమలలో నిరసనలు, ధర్నాలు నిషేధమని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో బలవంతంగా వ్యాను, బస్సు, కార్లు ఎక్కించి తిరుపతికి తరలించారు. 'పోలీసుల జులుం నశించాలి' నినాదాలు, పోలీసుల కేకలతో ఆలయ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. చొక్కాలు పట్టుకుని లాక్కెళ్లడంతో ఏం జరుగుతోందో తెలియక భక్తులు హడలిపోయారు. సాధువులకు, రామచంద్రయాదవ్‌కు అలిపిరిలోనే నోటీసులు జారీ చేశామని, తిరుమలలో ధర్నాలు, రాజకీయ ప్రసంగాలు చేయకూడదని వారికి ముందే చెప్పామని డీఎస్పీ విజయ్‌శేఖర్ తెలిపారు. అయితే, శ్రీవారిని దర్శించుకుంటామంటూ వచ్చిన సాధువుల బృందం నిబంధనలకు విరుద్ధంగా ఆలయం వద్ద ధర్నాకు దిగిందని చెప్పారు. ఆందోళన విరమించాలని కోరినా వాగ్వాదానికి దిగడంతోనే తప్పని పరిస్థితుల్లో అరెస్ట్ చేశామన్నారు.



ఆలయం ముందు నిరసన తెలుపుతున్న సాధువులను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు



ఆందోళనకారులను తిరుమల నుంచి వాహనంలో తిరుపతికి తరలిస్తున్న పోలీసులు

తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ గుడ్ న్యూస్

» 24 నుంచి సిఫారసు లేఖలకు అనుమతి
» ఏపీ భక్తులకు సిఫారసు లేఖలపై ఆదివారం కూడా బ్రేక్ దర్శనాలు

తిరుమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. మార్చి 24వ తేదీ నుంచి వారి సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు జారీ చేయనున్నట్టు టీటీడీ సోమవారం ప్రకటించింది. తమ సిఫారసు లేఖలకు కూడా గత తరహాలో దర్శనాలు కల్పించాలంటూ తెలంగాణ ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా ఏపీ సీఎం చంద్రబాబుకు కొద్ది నెలల క్రితం లేఖ పంపారు. దీనిపై చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారు. తొలుత ఫిబ్రవరి నుంచే తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తీసుకుంటామని ప్రకటన చేసినప్పటికీ టీటీడీ మాత్రం తమ లేఖలు తీసుకోవడం లేదంటూ పలువురు తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 24 నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను తీసుకుంటామని టీటీడీ ప్రకటన చేసింది. ఆది, సోమవారాల్లో మాత్రమే (సోమ, మంగళవారాల దర్శనాలకు సంబంధించి) స్వీకరిస్తామని, అలాగే రూ.300 దర్శన టికెట్లకు సంబంధించిన సిఫారసు లేఖలను బుధ, గురువారాల్లో (ఏరోజు కారోజు కేటాయిస్తారు) తీసుకుంటామని టీటీడీ స్పష్టం చేసింది. ఒక సిఫారసు లేఖపై ఆరుగురికి మించకూడదనే నిబంధనను పెట్టారు. కాగా, ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికిగాను ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి స్వీకరిస్తున్న సిఫారసు లేఖలను ఇకపై శనివారం తీసుకుని ఆదివారం దర్శనం చేయించనున్నారు.

ఎవరెవరిని ఎక్కడెక్కడ నియమించారు

» తిరుపతి తొక్కిసలాట ఘటనపై కలెక్టర్‌ను ప్రశ్నించిన కమిషన్
» నేడు విచారణకు హాజరు కానున్న ఎస్పీ

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్ సోమవారం కూడా విచారణ కొనసాగించింది. జనవరి 8న జరిగిన తొక్కిసలాటపై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను 40 నిమిషాలకుపైగా విచారించింది. తిరుపతి కలెక్టరేట్‌లోని కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎదుట కలెక్టర్ విచారణకు హాజరయ్యారు. తిరుపతి బైరాగిపట్టెడలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి కమిషన్ చైర్మన్ ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు మున్సిపల్ హైస్కూలు ఆవరణలో పది కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వివరించారు. కౌంటర్ల వద్ద రెవెన్యూ శాఖ పరంగా ఎవరెవరిని, ఎక్కడెక్కడ నియమించారంటూ కమిషన్ ప్రశ్నించింది. ఆయా అధికారులు, ఉద్యోగుల పేర్లు, వివరాలు, ఫోన్ నంబర్లతోపాటు వారిని విధులకు కేటాయిస్తూ కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను కూడా అందజేయాలని కమిషన్ ఆదేశించింది. ఉదయం 10.50 గంటల నుంచి 11.33 గంటల వరకు కలెక్టర్‌ను ప్రశ్నించి అవసరమైన అంశాలను నమోదు చేసుకుంది. ఇప్పటి వరకూ మృతుల కుటుంబీకులు, క్షతగాత్రులు, బాధితులు 53 మందిని కమిషన్ విచారించింది. కౌంటర్ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ప్రమేయం ఉన్న అధికారులు, ఉద్యోగులు తదితరులు మరో 150 మందిని విచారించే అవకాశముంది. కాగా, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం కమిషన్ ఎదుట విచారణకు హాజరు కానున్నారు. ఈ వారంలోనే టీటీడీ ఈవో, అదనపు ఈవో, సీవీఎస్వో తదితర ముఖ్య అధికారులను కమిషన్ విచారించనుంది.



తిరుపతి 'తొక్కిసలాట' ఘటనపై విచారణకు హాజరవుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహరరావు, అధ్యక్షుడు సతీష్‌శర్మ, కోశాధికారి ప్రసాద్

బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా సతీష్‌శర్మ

» ప్రధాన కార్యదర్శిగా మనోహరరావు
» నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడిగా గుంటూరులోని గోరంట్లకు చెందిన కోనూరు సతీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన హెచ్‌కే మనోహరరావు, కోశాధికారిగా గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన పులిపాక ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని కసాపురం గ్రామంలో సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-27 రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.324 కోట్ల నిధులు కేటాయించటంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సతీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మనోహర్‌రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ముగ్గురు బ్రాహ్మణులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌గా అవకాశం కల్పించటంతోపాటు ప్రభుత్వ సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావును నియమించి బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పెంచారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ వర్గీయుల సంక్షేమం, అభివృద్ధికి సమాఖ్య నిరంతరం అండగా నిలుస్తుందన్నారు. సమాఖ్య ఉపాధ్యక్షులుగా మైసూరు శ్రీనివాస మూర్తి, ఆత్మకూరు శివకుమార్ శర్మ, సురేష్ బాబు, తోటపల్లి లోకనాథ్‌శర్మ, కొడిపి నాగేశ్వరరావు, రాపాక వెంకట ప్రభాకర్, మాచిరాజు రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నార్పల మారుతి, పొన్నపల్లి సోమశేఖర్, ప్రభాకరం, ద్వాదశి వేణు, అధికార ప్రతినిధులుగా నార్పల రమేష్ , తేలికేపల్లి వెంకటేశ్వర్లు, వేల్పూరు సుబ్రహ్మణ్యం, ఉత్తరాంధ్ర రీజియన్ కో ఆర్డినేటర్‌గా ఇనుగంటి రాకేష్ శర్మ ఎన్నికయ్యారు.

డిస్ట్రిక్ట్ గెజిట్‌లో పంచాయతీల ఆస్తులు

ప్రచురణకు చర్యలు తీసుకోండి

» ఆస్తుల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారు?
» వివరాలు మాముందు ఉంచండి
» పంచాయతీరాజ్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల ఆస్తులను గుర్తించి, వాటిని డిస్ట్రిక్ట్ గెజిట్‌లో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆస్తుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను తదుపరి విచారణలో తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామ పంచాయతీకి ఎన్నెన్ని ఆస్తులు ఉన్నాయో గుర్తించి, డిస్ట్రిక్ట్ గెజిట్‌లో ప్రచురించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు పరిరక్షణ సమాఖ్య వేదిక అధ్యక్షుడు ఎస్. వీరవెంకట సత్యనారాయణ రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఏలూరు శేష మహేశ్‌బాబు వాదనలు వినిపిస్తూ.. ఏపీ గ్రామ పంచాయతీ (ఆస్తుల రక్షణ)-2011 నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల ఆస్తులను గుర్తించి డిస్ట్రిక్ట్ గెజిట్‌లో ప్రచురించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులు, జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. చట్టనిబంధనలను కోర్టు ముందు ఉంచారు. పంచాయతీ ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. గెజిట్ ప్రచురణ ద్వారా ఆక్రమణదారుల నుంచి ఆస్తులు కాపాడవచ్చని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ధర్మాసనం ఆస్తుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను తదుపరి విచారణలో తమ ముందు ఉంచాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు స్పష్టం చేసింది.

వైవీ సుబ్బారెడ్డికి మాతృవియోగం

» నేడు అంత్యక్రియలకు హెలికాప్టర్‌లో జగన్



పిచ్చమ్మ(ఫైల్)

మేదరమెట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఒంగోలులోని స్వగృహంలో మృతిచెందారు. పిచ్చమ్మ అంత్యక్రియలు మంగళవారం వారి స్వగ్రామమైన మేదరమెట్లలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన బాబాయి అయిన వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ అంత్యక్రియలకు హాజరుకానున్నారు. అలాగే వైఎస్ విజయమ్మ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా హాజరవుతారని బంధువులు తెలిపారు. మేదరమెట్లలో హెలిప్యాడ్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం వైసీపీ నాయకులు పరిశీలన చేస్తున్నారు.

అన్నవరం సత్యదేవుడి మూలవిరాట్‌ను చిత్రీకరించిన యూట్యూబ్ చానెల్‌పై కేసు

అన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి ఆలయంలో మూలవిరాట్‌ను చిత్రీకరించి, యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసిన ఘటనపై దేవస్థానం ఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. 2023, సెప్టెంబరులో 'మా ఇంటి భాగవతం' పేరుతో ఉన్న యూట్యూబ్ చానల్ నిర్వాహకులు మూలవిరాట్‌ను చిత్రీకరించారు. దీన్ని తొలగించాలని ఆలయ అధికారులు కామెంట్ రూపంలో తెలియజేసినా.. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈవో సుబ్బారావు అన్నవరం ఎస్ఐ హరిబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేశామని, వారి వివరాలు పూర్తిగా తెలుసుకుని విచారణ చేస్తామని తెలిపారు. దేవస్థానం చరిత్రలో ఇప్పటి వరకు మూలవిరాట్‌ను ఎవరూ చిత్రీకరించలేదు. ఇది శాస్త్ర విరుద్ధమని, అపచారమని పండితులు పేర్కొన్నారు. ఇలాంటి వారికి శిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సెస్సుల తిరకాసు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో సోమవారం ఒక ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. అనేక రకాల సెస్సులు, సర్‌చార్జీల పేరిట వసూలు చేసిన సుమారు ఆరులక్షల కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం వినియోగించకుండా వదిలేసిందన్నది ఆ ప్రకటన సారాంశం. 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేసిన 5.70 లక్షలకోట్లు వచ్చే ఏడాది మార్చి మాసాంతం వరకూ వినియోగం కాకుండాపోతాయని కేంద్రం ప్రకటించింది. వసూళ్ళకూ వినియోగానికీ మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఉండటాన్ని ఆర్థికవేత్తలు ఏ పరిభాషలో అభివర్ణిస్తారో తెలియదు కానీ, సామాన్యుడికి మాత్రం కడుపు మండే విషయం ఇది. ముక్కుపిండి వసూలు చేసిన ఇంతటి భారీ మొత్తాన్ని వినియోగించకుండా వదిలివేయడం పన్ను విధానాల్లోనూ, నిర్వహణలోనూ అసమర్థతకు తార్కాణం.

పన్నుల మాదిరిగా కాక, నిర్దేశిత అవసరాలు, ప్రయోజనాల రీత్యా ఈ సెస్సులు, సర్‌చార్జీలు విధిస్తారు కనుక, మరోవిధంగా చెప్పాలంటే, కేంద్ర ప్రభుత్వం ఈ 5.70లక్షలకోట్ల రూపాయలను అవసరాలకంటే అధికంగా వసూలు చేసినట్టు అనుకోవచ్చు. ప్రత్యేకమైన ప్రయోజనాలకు మాత్రమే సదరు మొత్తాన్ని వాడాల్సి ఉన్నందున, అధికమొత్తాలను వసూలు చేయడమెందుకన్నది ప్రశ్న. ఆర్థికమంత్రి ఈ అంశంమీద అద్భుతమైన వివరణలు ఇవ్వగలరు కానీ, రాష్ట్రాలకు మాత్రం మంచి రాజకీయ ఆయుధం దొరికినట్టే. రాష్ట్రాలకు పన్నుల్లో దక్కే వాటా ఎగ్గొట్టడానికి వీలుగా, ఇలా సెస్సులు, అదనపు సెస్సులు, సర్‌చార్జీల వంటి పేర్లతో కేంద్రం అడ్డతోవలో ఆర్జిస్తోందన్న వాదనలు, విమర్శలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఇది వాటికి కొత్త అస్త్రంగా ఉపకరిస్తుంది. రాష్ట్రాలకు వాటా ఇవ్వక్కర్లేదన్న కారణంతోనే కేంద్రం ఈ దారిని ఎంచుకుందనీ, ఆయా మొత్తాలను ఏటా పెంచుతూ, విస్తరిస్తూ పోతున్నదని అవి ఏనాటి నుంచో విమర్శిస్తున్నాయి.

సెస్సులు, సర్‌చార్జీల పేరిట వసూలు చేసిన మొత్తంలో 2019–20 ఆర్థిక సంవత్సరంలో వినియోగించని భాగం 83వేల కోట్లు ఉండగా, అది ఏటా అది పెరుగుతూ వచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇది 1.32లక్షలకోట్లు ఉంటుందట. నిర్దిష్టమైన, స్వల్పకాలిక అవసరాలకు ధనాన్ని సమకూర్చుకోవడమే వీటి లక్ష్యమని ఆర్థికమంత్రి చెబుతున్నారు. అవసరాలు అబద్ధం కాకపోవచ్చునేమోగానీ, అవసరాన్ని మించిన ధనాన్ని ఈ పేర్లతో వసూలు చేసినమాట మాత్రం నిజం. 2023–24 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలో 13రకాల సెస్సులు ఉంటే, మరుసటి ఏడాది కేంద్రం ఏడుకు కుదించింది. సర్‌చార్జీలు మాత్రం ఇప్పటికీ నాలుగున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలికసదుపాయాలతో పాటు అనేకరంగాల్లో, చివరకు స్వచ్ఛ ఇంధనం, స్వచ్ఛభారతం పేరిట కూడా సెస్సుల వసూలు కొనసాగుతోంది. వాటి సంఖ్య తగ్గినా వసూలయ్యే మొత్తం తగ్గలేదు, పైగా పెరిగింది. మోదీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో సెస్సులు, సర్‌చార్జీలపేరుతో కేంద్రం వసూలు చేసింది లక్షకోట్లు ఉంటే, ఇప్పుడది నాలుగులక్షలకోట్లు దాటింది. వినియోగం ఎందుకు లేకపోతున్నది, ఏకంగా నాలుగోవంతు మొత్తం ఎందుకు మిగిలిపోతున్నదన్న ప్రశ్నలను అటుంచితే, సదరు సెస్‌లను ఇంకా అంతేస్థాయిలో వసూలు చేస్తుండటం పట్ల ప్రభుత్వం వివరణ ఇవ్వకతప్పదు. పైగా, కాగ్ ఇప్పటికే పలుమార్లు వసూలవుతున్న మొత్తాలను నిర్దేశిత రిజర్వ్‌ఫండ్స్‌లోకి బదిలీ చేయనందుకు కేంద్రాన్ని తప్పుబట్టింది కూడా. చమురు పరిశ్రమ అభివృద్ధి కోసమంటూ వసూలు చేసిన రెండు లక్షలకోట్ల క్రూడ్ ఆయిల్ సెస్ అందుకు వాడకపోవడం వంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

కేంద్రప్రభుత్వం పన్నురూపేణా వసూలు చేసే ప్రతీ వందరూపాయల్లోనూ 11రూపాయలు సెస్, సర్‌చార్జీలే. కేంద్రం ఆదాయంలో సెస్‌ల వాటా పెరుగుతూ, పన్నుల వాటా తగ్గుతూండటంతో రాష్ట్రాలకు దక్కాల్సినదానిలో కోతబడటం మొదలైంది. పన్నుల్లో అరవైశాతం కేంద్రానిది, నలభైశాతం రాష్ట్రాలకు అని ఆర్థికసంఘం హితవు చెబుతూంటే, సర్‌చార్జీలు, సెస్‌ల ఆదాయం తోడై కేంద్రానికి 68శాతం దక్కుతున్నదని, అంతిమంగా రాష్ట్రాలకు 32శాతమే మిగులుతోందని ఆర్థికవేత్తల అంచనా. 15వ ఆర్థికసంఘం రాష్ట్రాలకు 41శాతం అని చెప్పినా 31శాతమే వస్తున్నదని కొందరు లెక్కలు విప్పుతున్నారు. కేంద్రపన్నుల్లో అధికవాటా కోసం పోరాటాలు చేస్తున్న రాష్ట్రాలకు, ఇప్పుడు వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీలను కేంద్రం సదరు అవసరాలకు వినియోగించడం లేదన్న వార్త మరింత ఆగ్రహం కలిగించకమానదు.

మన నిశ్శబ్ద విప్లవం తీరే వేరు!





■ రాహుల్ కుమార్

ఉత్తర భారతదేశంలో నిశ్శబ్ద విప్లవం ఒకటి జరిగి తీవ్ర సామాజిక మార్పులకు దారితీసిందంటే ఒకపట్టాన నమ్మలేం! ఒకనాటి ఉత్తరాది గురించి అంబేడ్కర్ 1955లో అన్న మాటలను గుర్తుచేసుకుంటే ఆ విప్లవం ఇంకా విచిత్రంగా కనపడుతుంది. "ఉత్తర, దక్షిణాది మధ్య తేడా చాలా ఉంది. ఉత్తరాది సంప్రదాయశీలమైంది. దక్షిణాది పురోగమనభరితమైంది. ఉత్తరాది మూఢనమ్మకాలతో ఉంటే దక్షిణాది హేతుబద్ధంగా ఉంటుంది. విద్యలో దక్షిణాది ముందడుగు వేసింది. ఉత్తరాది వెనుకబడింది. దక్షిణాది సంస్కృతి ఆధునికమైంది. ఉత్తరాది సంస్కృతి ప్రాచీనమైంది" అంటూ ఎన్నో తేడాలను ప్రస్తావించిన అంబేడ్కర్ ఉత్తరాది పాలనను దక్షిణాది ఎలా సహించగలదు? అన్న ప్రశ్నను కూడా లేవనెత్తారు. ఉత్తర–దక్షిణాదుల మధ్య తేడాల గురించి అంబేడ్కర్‌కే గాక ఇప్పటికీ చాలా మంది మేధావులకు ఇలాంటి అభిప్రాయాలే ఉన్నాయి. దక్షిణాది నేతలు సైతం మూఢనమ్మకాలను పోత్సహిస్తున్నా రాజకీయ విమర్శలు చేసేటప్పుడు మాత్రం 'ప్రగతిశీల దక్షిణాది' అంటూ మాట్లాడుతూనే ఉన్నారు. రాజకీయ అంశంగా దక్షిణాది ప్రగతిశీలత మారినంత మాత్రాన ఆ భావనకు ఎంతోకొంత వాస్తవిక పునాది లేదని చెప్పలేం.

రాజకీయాలపరంగా 1980ల నుంచి ఉత్తరాదిలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. అగ్రకులాల రాజకీయ ఆధిపత్యాన్ని తోసిపుచ్చే జైత్రయాత్రను అక్కడి బీసీలు ఆరంభించారని పేర్కొంటూ దాన్నొక నిశ్శబ్ద విప్లవంగా సూత్రీకరిస్తూ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు క్రిస్టఫ్ జఫలాట్ 2003లో 500 పేజీల పుస్తకాన్నే రాశారు. దాని పేరు భారతీయ నిశ్శబ్ద విప్లవం. జఫలాట్ విశ్లేషణంతా ప్రధానంగా ఉత్తరాదికే పరిమితమైంది. బీసీలకు రిజర్వేషన్ల కల్పనలో దక్షిణాది ఎలా ముందుందో తగినంత లోతుగానే వివరించినా ఉత్తరాదిలో రాజకీయ మార్పులను వెల్లడించటమే ప్రధానంగా అందులో కనపడుతుంది.

దక్షిణాదిలో రిజర్వేషన్లకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. దేశంలో రిజర్వేషన్లు విస్తృతస్థాయిలో అమలవ్వటానికి దక్షిణాది ప్రయోగాలే ప్రేరణ. ఎగుడుదిగుడులు ఎదుర్కొన్నప్పటికీ ఉత్తరాదితో పోల్చితే చాలా ముందుగా దక్షిణాదిలో బీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. అవెన్నో మార్పులనూ తీసుకొచ్చాయి. దక్షిణాదిన ఉద్యోగాల్లో బీసీల శాతం నిర్దేశించిన కోటాలను దాటటమూ ఆ మార్పుల్లో భాగమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985 నాటికే ఉద్యోగుల్లో బీసీలు 28 శాతం ఉన్నారన్న విషయాన్ని జఫలాట్ ప్రస్తావించారు. ఓపెన్ కేటగిరీ పోస్టులకు సంబంధించి అగ్రకులాలతో పోటీ పడటం బీసీలకు సాధారణమైంది. యాభైశాతానికి కాస్త అటూఇటూగా ఉద్యోగాలనూ విద్యారంగంలో సీట్లనూ దక్కించుకునే ప్రక్రియా మొదలైంది. మెడికల్, ఇంజనీరింగ్ సీట్ల విషయంలో ఇది స్పష్టంగా కనపడుతోంది. ఇటీవల తెలంగాణ గ్రూప్–1 ఉద్యోగాల మెయిన్ పరీక్ష ఫలితాలను చూసినా ఇదే అర్థమవుతుంది. అత్యధిక మార్కులు సాధించిన 500 మందిలో 228 మంది బీసీ అభ్యర్థులే ఉన్నారు. అంటే 45.6శాతం మంది. ఇక ఎస్సీ (50), ఎస్టీ (38) అభ్యర్థులను కూడా కలుపుకొంటే మూడు వర్గాల వారు 63.2శాతం మంది అవుతారు. అధిక మార్కులు సాధించిన వందమంది జాబితానే తీసుకుంటే బీసీ అభ్యర్థులు 48శాతం ఉన్నారు. ఇక్కడే మరో విషయాన్ని కూడా స్పష్టంగా చూడొచ్చు. జనాభా శాతానికి అనుగుణంగా బీసీలు లక్ష్యానికి చేరువవుతుంటే ఎస్సీ, ఎస్టీల్లో ఇంకా దూరంలోనే ఉన్నట్లుగా గ్రూప్–1 ఫలితాలను చూస్తే అర్థం అవుతుంది. అధిక మార్కులు పొందిన 100 మందిలో ఎస్సీలు ముగ్గురు, ఎస్టీలు అయిదుగురు ఉండటమే దీనికి నిదర్శనం. అధిక మార్కులు వచ్చిన 500 ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటే ఎస్సీ, ఎస్టీ శాతాలు కొంత పెరిగినా నిర్దేశించిన వాటా కంటే తక్కువే ఉన్నారు.

రిజర్వేషన్ల కోటాకు మించి బీసీలు ప్రగతి సాధిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ సోమవారం శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టింది. ఇదో విచిత్రమైన సన్నివేశం. అందుబాటులోని కొన్ని గణాంకాలను చూస్తే ఇప్పటికే 42 శాతం దరిదాపుల దాకా బీసీల ప్రాతినిధ్యం చేరినట్లు కనపడుతుంది! పోటీ పరీక్షల ఫలితాల విశ్లేషణా దీన్నే సూచిస్తోంది. ఇది పక్కాగా నిర్ధారణ కావాలంటే అధికారిక సమాచారం ఉండాలి. అటువంటి సమాచారాన్ని ప్రభుత్వం మాత్రమే వెల్లడించాలి. కులగణన సర్వేలో లభ్యమైన సమాచారాన్నీ ఇంతవరకూ బహిరంగపర్చలేదు. బిహార్ ప్రభుత్వం తాను చేపట్టిన కులగణన సమాచారాన్ని ధైర్యంగానే వెల్లడించింది. ఉద్యోగాల్లో ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో తెలిపింది. తెలంగాణలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. బిల్లు లక్ష్యాలను వివరించే అనుబంధంలో స్థూలంగా కూడా అటువంటి సమాచారాన్ని పొందుపరచలేదు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని బుసాని వెంకటేశ్వర రావు నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ తేల్చిందని ప్రభుత్వం పేర్కొందే తప్ప సమగ్ర సమాచారాన్ని త్వరలో సభ ముందు ఉంచుతామనీ కూడా ప్రకటించ లేదు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగ విషయాల్లో రిజర్వేషన్లను పెంచేందుకు సిఫార్సులను చేసే పనినీ బుసాని కమిషన్‌కే అప్పగించారు. ఒకే వ్యక్తితో రెండు కమిషన్లు ఏర్పాటయ్యాయన్న మాట!

విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యంలేదని గణాంకాలతో నిరూపిస్తేనే న్యాయ సమీక్షముందు నిలబడే అవకాశం ఉంటుంది. ఉద్యోగులకు సంబంధించి కులాల లెక్కలను తీయటం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కులం వెనుకబాటు ఆధారంగా కల్పించే రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని ఎందుకు దాటాల్సి వస్తోందో వాదించటానికి గణాంకాలే ఆధారం. న్యాయస్థానాలకు వాటిని సమర్పిస్తేనే 50 శాతం పరిధిని పునఃపరిశీలించే అవకాశం కొంతైనా ఉంటుంది. మండల్ కమిషన్ నివేదికలో బీసీలకు సంబంధించి అటువంటి సమాచారాన్ని పొందుపరచారు కాబట్టే 27 శాతం రిజర్వేషన్లు గట్టెక్కగలిగాయి. 1980ల నాటికి కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం ఎస్సీల కంటే తక్కువగా ఉందనే విషయాన్ని మండల్ కమిషన్ పేర్కొంది. ఆ అంశమే అప్పుడు కీలకంగా మారింది. ఏకసభ్య కమిషన్ అలా చేసి ఉంటే కులాలవారీ ఉద్యోగుల, విద్యార్థుల సమాచారాన్ని సేకరించి మదింపుచేసి ఉండాలి.

జఫలాట్ విశ్లేషించినట్లుగా నిశ్శబ్ద విప్లవం ఉత్తరాది రాజకీయ రంగంలో కులాల బలబలాలను మార్చివేస్తున్నా కేంద్ర ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం ఇంకా ఆశించినంతగా పెరగటం లేదు. 27 శాతం రిజర్వేషన్లను ఇప్పటికీ బీసీలు ఉపయోగించుకోలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రచురించిన సామాజిక సంక్షేమ గణాంకాల నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. 2022 జనవరి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 21.98శాతం మాత్రమే బీసీలు ఉన్నారు. అదే ఎస్సీ (16.82శాతం), ఎస్టీ (7.33 శాతం)లైతే వారికి నిర్దేశించిన రిజర్వేషన్లకు సమానంగానే ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం లభించింది.

రాష్ట్రపతి ఆమోదాన్ని పొంది, కేసులేమైనా పడితే వాటినీ ఎదుర్కొని అనుకున్నట్లుగా 42శాతం రిజర్వేషన్లు తెలంగాణలో అమలైన పక్షంలో ఉద్యోగ, విద్యాముఖ చిత్రం బాగా మారుతుంది. విద్య, ఉద్యోగాల్లో జనాభాని మించి ప్రాతినిధ్యం బీసీలకు భవిష్యత్తులో లభించే అవకాశాన్నీ కొట్టేయలేం. ఆ పరిణామం ఎలాంటి మార్పులకు, ప్రతిస్పందనలకు దారితీస్తుందో ఇప్పుడే చెప్పలేం. కులాల వర్గీకరణను మరింత విస్తృతపరచాలనే డిమాండ్లు తలెత్తవచ్చు. సంపన్నశ్రేణిపై వివాదాలూ పెరగొచ్చు.

విద్యా, ఉద్యోగ విషయాల్లో పరిణామాలన్నీ దక్షిణాదిన ఒకే రీతిలో జరుగుతూ బీసీల ప్రాతినిధ్యం జనాభా శాతానికి మించి పెరిగితే దాన్నొక నిశ్శబ్ద విప్లవంగానూ భావించొచ్చు! తమిళనాడులో లాగా రాజకీయాధికారం కూడా అగ్రకులాల చేజారితే సామాజిక పరివర్తన సంపూర్ణమవుతుంది! ఈ సామాజిక పరిణామంతో సమస్యలన్నీ తీరతాయా? దాన్నొక నిజమైన సామాజిక విప్లవంగా భావించొచ్చా? అన్నది అప్పటికీ పెద్ద ప్రశ్నగానే ఉంటుంది. ఉద్యోగాల్లో ప్రాతినిధ్యాన్ని, రాజకీయ అధికారంలో మార్పులను కులదృష్టితో చూస్తే తమిళ సమాజమే ఆదర్శం అవుతుంది. కానీ ఆర్థిక అసమానతలతో పాటు అనేక సామాజిక సమస్యలు అక్కడ ఇంకా ప్రబలంగానే ఉన్నాయి. కొన్ని కులాలకు అనుచిత ఆధిపత్యమూ ఉంది. సత్తనాథన్ బీసీ కమిషన్ ఆ విషయాన్ని 1970ల్లోనే స్పష్టంచేసింది. మానవాభివృద్ధి సూచికలో కొంత మెరుగుగానే ఉన్నా మొత్తంగా తమిళనాడును అద్భుత ఆదర్శ నమూనాగా భావించే పరిస్థితి లేదు. ఆర్థిక అసమానతల వల్ల ఒకే కులంలో అనేక వర్గాలు పుట్టుకొచ్చాయి. అందుకే ఒక కులం మొత్తాన్ని ఒక వర్గంగా భావించే పరిస్థితి వేగంగా కనుమరుగైపోతోంది.

ఉత్తర–దక్షిణాది తేడాలకు సంబంధించి మరొక విషయాన్ని కూడా ప్రస్తావించుకోవచ్చు. ఉత్తరాదిన రాజకీయాల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవం ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెద్దగా పెంచలేదు. దక్షిణాదిన మాత్రం మహిళల ప్రాతినిధ్యం గణనీయంగానే పెరుగుతోంది. తెలంగాణ గ్రూప్–1 మెయిన్ పరీక్షలో అత్యధిక మార్కులు పొందిన 100 మందిలో 41 మంది మహిళలు ఉన్నారు. 500 ర్యాంకుల వరకూ తీసుకుంటే 204 మంది మహిళలకు చోటు లభించింది. ఇవేమీ చిన్న విషయాలు కావు. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో వెల్లడించిన 111 గ్రూప్–1 పోస్టుల ఫలితాల్లో 51 మంది మహిళలకు చోటు దక్కింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఎమ్మెల్యేల సంఖ్యను చూస్తే ఉత్తర–దక్షిణాది తేడాలు స్పష్టంగా కనపడతాయి. తెలంగాణలో బీసీ ఎమ్మెల్యేలు 19 మంది ఉన్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారి సంఖ్య 20కి మించలేదు. అంటే అసెంబ్లీలో బీసీల ప్రాతినిధ్యం 16 శాతం మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక శాతం అటూఇటూగా పరిస్థితి అంతే ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 1972కు ముందైతే అది 15 శాతం దాటలేదు. బిహార్‌లో అయితే 1995 అసెంబ్లీ ఎన్నికల నాటికే బీసీ ఎమ్మెల్యేల సంఖ్య దాదాపుగా 50 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత శాతాల్లో కొంత మార్పు వచ్చినా తెలుగు రాష్ట్రాలంత తక్కువ స్థాయిలో ఎప్పుడూ లేదు. ఉత్తరప్రదేశ్‌లో కూడా బీసీలకు ప్రస్తుత అసెంబ్లీలో 38శాతం ప్రాతినిధ్యం ఉంది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ ఒకటి స్పష్టంగా కనపడుతోంది. రాజకీయ పదవుల విషయంలో బీసీలు వెనుకబడి ఉన్నా విద్యా ఉద్యోగ రంగాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అగ్రకులాలతో పోటాపోటీగా ముందడుగులు వేస్తున్నారు. రాజకీయ పదవుల్లో అధిక ప్రాతినిధ్యం ఉంటేనే సామాజిక, ఆర్థికంగా ముందడుగు వేయటం సాధ్యమవుతుందనే సూత్రీకరణను అన్ని సందర్భాల్లో చేయలేం. ఉత్తరాది–దక్షిణాదిలో బీసీల ప్రాతినిధ్యాల చరిత్ర చెప్పే సారం అదే! దేశమంతటికీ వర్తించే సాధారణ సూత్రీకరణలను భారత్‌లో రూపొందించటం అంత తేలికకాదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ ఒకటి స్పష్టంగా కనపడుతోంది. రాజకీయ పదవుల విషయంలో బీసీలు వెనుకబడి ఉన్నా... విద్యా ఉద్యోగ రంగాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అగ్రకులాలతో పోటాపోటీగా ముందడుగులు వేస్తున్నారు. రాజకీయ పదవుల్లో అధిక ప్రాతినిధ్యం ఉంటేనే సామాజిక, ఆర్థికంగా ముందడుగు వేయటం సాధ్యమవుతుందనే సూత్రీకరణను అన్ని సందర్భాల్లో చేయలేం. ఉత్తరాది–దక్షిణాదిలో బీసీల ప్రాతినిధ్యాల చరిత్ర చెప్పే సారం అదే! దేశమంతటికీ వర్తించే సాధారణ సూత్రీకరణలను భారత్‌లో రూపొందించటం అంత తేలికకాదు!

> జఫలాట్ విశ్లేషించినట్లుగా నిశ్శబ్ద విప్లవం ఉత్తరాది రాజకీయ రంగంలో కులాల బలబలాలను మార్చి వేస్తున్నా కేంద్ర ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం ఇంకా ఆశించినంతగా పెరగటం లేదు. 27 శాతం రిజర్వేషన్లను ఇప్పటికీ బీసీలు ఉపయోగించుకోలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రచురించిన సామాజిక సంక్షేమ గణాంకాల నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది.

ద్రవిడవాదానికి అనుగుణంగానే హిందీపై విషం!

'హిందీ ఆధిపత్యం దేశ భవితవ్యానికి చేటు' అంటూ మార్చి 4వ తేదీన వీర్ సంఘ్వి రాసిన వ్యాసం అసంబద్ధంగా ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హిందీ భాషపై విషం కక్కుతూ– హిందీ భాష భారతదేశంలోని 19 స్థానిక భాషలను మింగేసిందనీ, తమిళనాడులో హిందీ భాష పెత్తనాన్ని అడ్డుకుంటామనీ, అందుకు భారతదేశంలోని ప్రజలందరూ సహకరించాలనీ సామాజిక మధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ గురించి వీర్ సంఘ్వి అతిశయోక్తులతో స్పందించారు.

దేశీయ భాష అయిన హిందీని వ్యతిరేకించడం ద్రవిడ రాజకీయాల్లో ఒక భాగం. రాజకీయాలపై తమ పార్టీలకు పట్టు తప్పుతుందనే అనుమానం వచ్చిన వెంటనే హిందీ భాష పెత్తనం, ఉత్తరాది ప్రభావం, సనాతన భారతీయ సంస్కృతి మౌఢ్యం అంటూ కట్టుకథలతో తమిళ ప్రజలలో భాషా ఉన్మాదాన్ని రెచ్చగొడుతుంటారు. హిందీ భాషపై ద్వేషం ఆ రాష్ట్రంలో 1937 నుండి జరుగుతున్న తంతే! 1965లో హిందీ భాషపై వ్యతిరేక ఉద్యమం హింసాత్మకంగా మారటంతో, కేంద్ర ప్రభుత్వం పారా మిలిటరీ దళాలను దింపి ఉద్యమాన్ని అణచివేసే ప్రక్రియలో, 700 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. ఈ విషయాన్ని దాచిపెట్టడం ఎందుకు? ఉద్యమాన్ని లేవదీసిన రామస్వామి పెరియార్, ఆయన శిష్యులైన కరుణానిధి, అన్నా దొరై తమిళ రాజకీయాలలో తిరుగులేని నాయకులైనారు. బలిదానం సామాన్య ప్రజలది.



> దేశీయ భాష అయిన హిందీని వ్యతిరేకించడం ద్రవిడ రాజకీయాల్లో ఒక భాగం. రాజకీయాలపై తమ పార్టీలకు పట్టు తప్పుతుందనే అనుమానం వచ్చిన వెంటనే హిందీ భాష పెత్తనం, ఉత్తరాది ప్రభావం, సనాతన భారతీయ సంస్కృతి మౌఢ్యం అంటూ కట్టుకథలతో తమిళ ప్రజలలో భాషా ఉన్మాదాన్ని రెచ్చగొడుతుంటారు.

బ్రిటిష్ పాలకులు భారతదేశంలో తమ పరిపాలనను స్థిరీకరించుకోవడం కోసం భారతీయులను కులాల వారీగా, భాషల వారీగా, ప్రాంతాల వారీగా విభజించడంలో భాగంగా ఉత్తర భారతీయులు ఆర్య జాతికి చెందిన వారని, దక్షిణ భారతదేశం లోని ప్రజలు, ముఖ్యంగా తమిళులు, ద్రావిడ సంస్కృతికి చెందిన వారనీ, వీరు భారతీయ సంస్కృతిలో భాగం కాదనీ, హిందీ ఆర్యుల భాష ఐన సంస్కృతం నుండి పుట్టిందనీ ఒక కట్టుకథల సిద్ధాంతాన్ని అల్లి, దానిని భారతీయుల మనసుల్లోకి బలంగా ఎక్కించారు. ఆర్య ద్రావిడ సిద్ధాంత భావజాలాన్ని తమిళనాడులోని జస్టిస్ పార్టీ బాగా ప్రచారం చేసింది. కాంగ్రెస్ సంస్థ నడిపే స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఈ పార్టీ వ్యతిరేకించిన విషయం నేటి యువకుల్లో చాలామందికి తెలియదు. జస్టిస్ పార్టీ మరో రూపమే ద్రవిడ మున్నేట్ర కగజం. తమిళుల విఘటన వాదాన్ని తమిళనాడులోని జాతీయవాద నాయకులు వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ విషయం వ్యాసకర్తకు తెలియదేమో!

లోక్‌సభ స్థానాల పునర్విభజన విషయంలో తమిళనాడుకు అన్యాయం జరిగిపోతుందన్న స్టాలిన్, మోదీ ప్రభుత్వ వ్యతిరేకుల వాదనలలో పసలేదు. ప్రస్తుతం తమిళనాడుకి 39 లోక్‌సభ సీట్లు ఉంటే ఉత్తరప్రదేశ్‌కు 80సీట్లు ఉన్నాయి. ఈ సీట్ల కేటాయింపు బీజేపీ ప్రభుత్వం చేసింది కాదు. ఇక ఉత్తరాది వారు జనాభాను కంట్రోల్ చేయలేదనీ, దక్షిణాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేసినందుకు శిక్షకు గురి అవుతున్నాయనీ చేసే వాదనలు అర్థరహితం. ఈ వాదనలన్నీ బీజేపీ అధికార ప్రాబల్యాన్ని దెబ్బిపొడవడానికే!

ఈ దేశంలోని మెజార్టీ ప్రజలు మాట్లాడే హిందీ భాషను ఒక కొత్త భాష అని పేర్కొనడం, హిందీని సంస్కృతమయం చేశారని చెప్పడంలో వ్యాసకర్త గందరగోళానికి గురయ్యాడు. ఈయన ఆర్య ద్రావిడ వాదాన్ని బాగా తలకెక్కించుకున్నట్లు స్పష్టమైంది. హిందీ భాషను దక్షిణాది వారిపై రుద్దడానికి ప్రయత్నిస్తున్న వారి గురించి వాపోతూనే, కొంత మంది ఉత్తరాది వారి సంకుచిత భావజాలాల వల్ల హిందీ భాష దేశ ప్రజల దగ్గరికి చేరలేదని వాదన చేయడంలో ఔచిత్యం ఏమిటి? హిందీ భాషకు సంబంధించిన విషయాన్ని ప్రస్తావించడానికి స్వాతంత్ర సమరయోధుడు వీర సావర్కర్ ప్రస్తావన ఎందుకు?

ఈ దేశ ప్రజలను ప్రాంతాల వారీగా, మతాల వారీగా, భాషల వారీగా, వర్గాల వారీగా విభజించి అధికారంలో కొనసాగాలనే దురాలోచన ఎక్కువ ప్రాంతీయ పార్టీల నాయకులకు ఉంటుంది. దేశ ప్రజలను సమైక్యంగా ఉంచాలన్న విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆలోచనలలో పెద్ద తేడా లేదు. 1937 నుండి 1967 వరకు ద్రావిడ వాద రాజకీయ నాయకులు కాంగ్రెస్‌ను ఆడి పోసుకుని, ఆ రాష్ట్రంలో ఆ పార్టీకి ఉనికి లేకుండా చేశారు. 2024 ఎన్నికలలో తమిళనాడులో బీజేపీ 16శాతం ఓట్లను సాధించింది. ఈ విషయం తమిళ భాషా వాద రాజకీయ నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. అందుకే బీజేపీకి వ్యతిరేకంగా భాషోద్యమాన్ని లేవదీస్తున్నారు.

1986లో దేశమంతా నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తే తమిళనాడులో ద్రావిడ వాద రాజకీయ నాయకులు వాటి ఏర్పాటును అడ్డుకున్నారు. దేశంలో ఈ విద్యాలయాలు లేని రాష్ట్రం ఒక్క తమిళనాడే. భాష పేరుతో ప్రజలను రాజకీయాల చుట్టూ తిప్పుకోవడం తమిళ నాయకులకు అలవాటే! దేశ సమైక్యత సమగ్రతల విషయంలో ఏకాభిప్రాయంతో ఉండే ప్రజలు తమిళనాడులో సైతం ఉన్నారు. ఈ ప్రజా సమూహమే ఈ ద్రవిడవాద రాజకీయ నాయకుల దుర్నీతికి అడ్డుకట్ట వేస్తుంది.

• ఉల్లి బాలరంగయ్య

ప్రభుత్వ బడికే 'వందనం'!

సామాజిక సమానత్వ సాధనకు సంక్షేమ పథకాలు ఉపకరించే మాట నిజమే. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి ఎన్నికలలో గెలవడానికి భారీ సంక్షేమ పథకాలు ప్రకటించి, వాటి అమలుకు పిల్లిమొగ్గలు వేస్తున్నాయి రాజకీయ పార్టీలు. గత వైసీపీ ప్రభుత్వం 'అమ్మఒడి' పథకాన్ని ప్రభుత్వ బడికి పోయే పిల్లలకే కాకుండా కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకూ వర్తింపజేసింది. ఆర్థిక లోటుతో, నిధుల లేమితో ప్రకటించిన ఆ 15 వేలల్లో కోతలతో, షరతులతో, వాయిదాలతో, పాఠశాలల ముందు తల్లుల ధర్నాలతో అది సక్రమంగా నడవలేదు. పేదరికంతో తమ పిల్లలను బడికి పంపించకుండా కొందరు తల్లిదండ్రులు వారిని వ్యవసాయ కూలీలుగా, బాల కార్మికులుగా మారుస్తున్నారు. అలాంటి వారికి ఇటువంటి పథకాన్ని వర్తింపచేయడంలో అర్థం ఉంది. కానీ ఆర్థిక పుష్టి కలిగి, ప్రైవేటు పాఠశాలలకు పంపే తల్లులకు, పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేయడం నిరర్థకం. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. దీనికి కారణం నాటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం, జీవో 117తో పాటు, ప్రైవేటు పాఠశాలలకు అమ్మఒడి అమలుపరచడం. ఇలా ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారికి ఈ పథకం వర్తింపజేయడం వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింతగా క్షీణించింది. యోగ్యత, అయోగ్యతలను విస్మరించి సంక్షేమాన్ని అమలుచేస్తే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతుంది. ఏ సంక్షేమమైనా బడుగులకు గొడుగు పట్టేదిగా ఉండాలి కానీ, కలవాడికి కండపట్టేలా ఉండకూడదు.

కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' అమలుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పేదరికమే ఈ పథకానికి అర్హతగా ఉండాలి. అంటే ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపే తల్లులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపచేయాలి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రభుత్వ ఉద్యోగం కల సాకారమవుతుంది. రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని నివారించడమే కాకుండా, రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుంది.

– అంగలకుదురు వీరాస్వామి

కార్పొరేట్లకు ఘనస్వాగతంగా 'ఆపరేషన్ కగార్'!

కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా, మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోసినా, మావోయిస్టుల ఏరివేత కోసం ఇప్పుడు కేంద్రం 'ఆపరేషన్ కగార్' అంటూ పిలుపునిచ్చినా దీనంతటికీ ఒక్కటే కారణం– అక్కడి ప్రజలకు జీవనాధారమైన ఆవరణల నుంచి వారిని తరిమేయడం, అక్కడ నిక్షిప్తమైన సకల సంపదల్ని కార్పొరేట్లకు దోచిపెట్టడం. 2000వ దశకం నుంచి మధ్య భారతంలోని వివిధ రాష్ట్రాల్లో అడవులపై అక్కడ నిక్షిప్తమైన వివిధ రకాలైన సంపదలపై కార్పొరేట్ శక్తుల కన్ను పడింది. అప్పటికే దేశంలో పాలకులు ప్రవేశపెట్టిన ప్రైవేటీకరణ విధానాల రూపంలో వారికి ఆ సంపదల్ని సులభంగా కొల్లగొట్టుకుపోయే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇదే అదనుగా ఆదివాసీలకు రక్షణగా నిలుస్తున్న అనేక చట్టాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ వచ్చింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు మోదీ ప్రభుత్వం తలపెట్టిన 'ఆపరేషన్ కగార్' దండకారణ్యంలో నెత్తుటేర్లు పారిస్తోంది.

మావోయిస్టుల ఏరివేత అంటూ ప్రారంభించిన ఈ ఆపరేషన్ కగార్ వెనుక అటవీ సంపదల్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉన్నది. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లోకి చేరిన కేంద్ర ప్రభుత్వాలు వారి అడుగులకు మడుగులొత్తే క్రమంలో 2005లోనే సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ చేపట్టాయి. దానికి కొనసాగింపుగానే ఇప్పుడు ఆపరేషన్ కగార్ మొదలైంది. ఈ పేరుతో దండకారణ్యంలో బహుళ జాతి కార్పొరేట్ కంపెనీల రాజ్యం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒరిస్సాల్లో విస్తరించిన దండకారణ్యంలో వజ్రాలు, ఇనుము, సున్నపురాయి, బాక్సైట్, డోలమైట్ సహా 28 రకాల విలువైన ఖనిజాలున్నాయి. ఇండియన్ మినరల్స్ ఇయర్ బుక్–2021 అందించిన వివరాల మేరకు దేశంలోని మొత్తం తగరం నిల్వల్లో సుమారు 36 శాతం ఇక్కడే ఉన్నది. 20 శాతం ఇనుము, 20 శాతం బాక్సైట్, 18 శాతం బొగ్గు, 11 శాతం డోలమైట్, 4 శాతం వజ్రాలు, 4 శాతం సున్నపు రాయి ఉన్నట్టు తేలింది. దండకారణ్యంలోని ఈ ఖనిజ సంపదల్ని మొత్తం తవ్వుకునేందుకు కార్పొరేట్ శక్తులు చాలా కాలం నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కార్పొరేట్ శక్తుల అండదండల కోసం పరితపిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సంపదల తరలింపునకు అక్కడి ప్రజలు అడ్డం తగులుతున్నారనే బాధతో మావోయిస్టులను అంతం చేస్తామన్న పేరుతో ఆపరేషన్ కగార్ ప్రారంభించారనే వాదన బలం పుంజుకున్నది.

> దండకారణ్యంలోని ఈ ఖనిజ సంపదల్ని మొత్తం తవ్వుకునేందుకు కార్పొరేట్ శక్తులు చాలా కాలం నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కార్పొరేట్ శక్తుల అండదండల కోసం పరితపిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సంపదల తరలింపునకు అక్కడి ప్రజలు అడ్డం తగులుతున్నారనే బాధతో మావోయిస్టులను అంతం చేస్తామన్న పేరుతో ఆపరేషన్ కగార్ ప్రారంభించారనే వాదన బలం పుంజుకున్నది.



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో చేస్తున్న అభివృద్ధి పని ఏదయినా ఉన్నదంటే అది రోడ్లు వేయడం తప్ప మరొకటి కనిపించదు. పాఠశాలల నిర్మాణం, ఆరోగ్య కేంద్రాలు, అడవి బిడ్డలకు నివాసాలు... ఇతర కనీస వసతుల ఏర్పాటు వంటివి అస్సలు ప్రభుత్వాల దృష్టిలోనే లేవు. ఆదివాసీల ఆర్థిక, సామాజిక వెనుకబాటును రూపుమాపే ఏ చర్యలూ తీసుకోవడం లేదు. ఆకలి తీర్చడం, కనీస అక్షరాస్యత, పోషకాహార లోపానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు ఉన్నా అవేవీ పాలకులకు పట్టడం లేదు. కానీ జన సంచారం పెద్దగా లేని మారుమూల ప్రాంతాలకు కూడా ఆరు లైన్ల రహదారులు వేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున రోడ్లు వేయడం, దీన్ని అభివృద్ధి కార్యక్రమం కింద చూపడం వెనుక పర్యావరణ విధ్వంసంతో పాటు అటవీ సందలను సులభంగా వేగంగా తరలించుకుపోవడమనే ఎజెండా ఉన్నదని సులభంగానే అర్థమవుతున్నది.

ఇదే తరుణంలో దండకారణ్యంలో వందలకొద్దీ పోలీసు క్యాంపులు ఏర్పాటవడంతో ఆదివాసుల్లో భయోత్పాతం ఏర్పడింది. పారామిలటరీ దళాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్), జిల్లా రిజర్వ్ గార్డులు (డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్‌కి చెందిన కోబ్రా (సిఒబిఆర్ఎ) వంటి వివిధ దళాలు అడవిలో తిష్టవేసి ఆదివాసీలకు భారత రాజ్యాంగం కల్పించిన రక్షణను దూరం చేస్తున్నాయి. దండకారణ్యాన్ని మావోయిస్టుల బారి నుండి విముక్తి చేయడం, అక్కడి ప్రజల్లో విశ్వాసాన్ని నింపడం, ఆ ప్రాంతాలకు భద్రత కల్పించడం కోసమే పోలీసు క్యాంపుల ఏర్పాటు అని ప్రభుత్వ పెద్దలు అంటున్నా అందులోని నిజం నేతి బీరకాయలోని నెయ్యి తీరునే ఉంది. భద్రత కల్పిస్తామంటూ ఏర్పాటైన క్యాంపులలోని సాయుధ బలగాలు ఆదివాసులను మావోయిస్టుల పేరుతో, వారి సానుభూతిపరులన్న పేరుతో నిత్యం వేధిస్తున్నారు. ఇన్ఫార్మర్లు పేరిట సామాన్యులను ఎన్‌కౌంటర్ చేస్తున్న, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దండకారణ్యంలో ప్రతి తొమ్మిది మంది ఆదివాసులకు ఒక సైనికుడి నిష్పత్తిలో మోహరింపు ఉన్నట్టు తెలుస్తోంది. కార్పొరేట్ వర్గాల దోపిడీకి రెడ్ కార్పెట్ వేయడం ఆపరేషన్ ముసుగులో జరుగుతున్న ఈ తతంగాన్ని మొత్తం పౌర సమాజంలో చర్చనీయాంశంగా మార్చి ఆదివాసీల హక్కులను పరిరక్షించే ఉద్యమాలకు ప్రజల నుంచి మద్దతును కూడగట్టవలసిన బాధ్యత బుద్ధిజీవులపైనే ఉన్నది.


■ డాక్టర్ సి.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి

(భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ విశాఖపట్నంలో నేడు సదస్సు నిర్వహిస్తున్నది)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



● మంచుటెండ

నగరంలో సరికొత్త వాతావరణం

- ఉదయమంతా దట్టమైన పొగమంచు
- మధ్యాహ్నం అయితే భానుడి సెగలు
- నేడు, రేపు పెరగనున్న ఎండ తీవ్రత
- 40 డిగ్రీలు దాటే అవకాశం

ఇబ్రహీంపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉదయమంతా దట్టమైన మంచు.. మధ్యాహ్నానికి ఎండ సెగలు.. ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పుల కారణంగా నగర, జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగైదు రోజులతో పోల్చుకుంటే, సోమవారం ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. విజయవాడలో సోమవారం 37.5 డిగ్రీలు ఉన్నప్పటికీ మంగళవారం 39.5 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మార్చి మూడో వారంలో ఎండలు మరింత పెరగనున్నాయి. సోమవారం 7 గంటల వరకు మంచు తొలగనేలేదు. 9 గంటలు దాటాక మాత్రం భానుడు ఉగ్రరూపం దాల్చాడు. రానున్న రెండ్రోజుల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖ సోమవారం హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలోని ఎ.కొండూరు, చందర్లపాడు, జి.కొండూరు, గంపలగూడెం, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, నందిగామ, పెనుగంచిప్రోలు, రెడ్డిగూడెం, తిరువూరు, వత్సవాయి, వీరులపాడు, విస్సన్నపేటతో పాటు విజయవాడ రూరల్, అర్బన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. కంచికచర్లలో 40 డిగ్రీలు, విజయవాడ రూరల్, అర్బన్‌తో పాటు ఇబ్రహీంపట్నంలో 39.7, 39.5 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉంది.







పటమట జెడ్పీ హైస్కూల్లో విద్యార్థి చెప్పులు చెక్ చేసి పరీక్షా హాల్లోకి అనుమతిస్తున్న దృశ్యం



పది పరీక్షలు ప్రారంభం

జిల్లాలో 99.03 శాతం హాజరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 99.03 శాతం హాజరు నమోదైంది. రెగ్యులర్ విద్యార్థులు 27,711 మందికి గాను 27,443 మంది హాజరయ్యారు. ప్రైవేటుగా పరీక్ష రాసే విద్యార్థులు 44 మందికి గాను 39 మంది హాజరయ్యారు. కాగా, జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ, విద్యాశాఖాధికారి సుబ్బారావు తనిఖీ చేశారు. సమస్యాత్మకంగా ఉన్న ఆరు కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు.

ఆటాడేస్తాం..

నేటి నుంచి ప్రజాప్రతినిధుల ఆటల పోటీలు

ముస్తాబైన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం

చట్టసభల్లో ఫైళ్లు చేతపట్టుకుని, మైక్ ముందు గుక్క తిప్పుకోకుండా మాట్లాడే ప్రజాప్రతినిధులు.. గ్రౌండ్‌లో బాల్, బ్యాట్ పట్టుకుని బౌండరీలు కొట్టేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ప్రజాప్రతినిధుల ఆటల పోటీలకు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ముస్తాబు కాగా, వివిధ పోటీల్లో సత్తా చాటేందుకు ప్రజాప్రతినిధులు సంసిద్ధులవుతున్నారు.

- నేటి మధ్యాహ్నం 3 గంటలకు స్పీకర్‌తో ప్రారంభం
- పోటీల నిర్వహణకు 200 మంది నియామకం
- పలు విభాగాల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల పేర్ల నమోదు
- 140 మంది ఎమ్మెల్యేలు, 13 మంది ఎమ్మెల్సీల రిజిస్ట్రేషన్
- చివరి రోజు మ్యాచ్‌లో సీఎం పాల్గొనే అవకాశం

ముస్తాబైన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాలకు సమయం ఆసన్నమైంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోటీలను ప్రారంభిస్తారు. ఇందుకోసం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియాన్ని సిద్ధం చేశారు. అథ్లెటిక్స్ క్రికెట్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ క్రీడలు ఇక్కడే జరుగుతాయి. షటిల్ బ్యాడ్మింటన్‌ను డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ క్రీడల నిర్వహణకు రిఫరీలు, అంపైర్లు, సహాయకులుగా మొత్తం 200 మంది శాప్ సిబ్బందిని నియమించారు. మంగళవారం నుంచి గురువారం వరకు మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. గురువారం ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు.

క్రీడలు ఇవీ..

అసెంబ్లీలో 175 మంది ఎమ్మెల్యేలుగా ఉండగా, పోటీల్లో పాల్గొనడానికి 140 మంది పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మండలిలో మొత్తం 58 మంది ఎమ్మెల్సీలు ఉండగా, 13 మంది మాత్రమే పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శాప్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయి. ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. రోజూ అసెంబ్లీ, మండలి సమావేశాలు ముగిశాక స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయి. స్టేడియంలో ఏర్పాట్లను కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, గన్నబాబు, ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, పంచుమర్తి అనురాధ శాప్ ఛైర్మన్ రవినాయుడు సోమవారం సాయంత్రం పరిశీలించారు. మొత్తం 13 కీడ్రల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రికెట్, పరుగు పందెం, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, టెన్నిస్, వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్స్ ఆటలో పోటీలు ఉంటాయి. మ్యూజికల్ ఛైర్స్‌లో కేవలం మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. టగ్ ఆఫ్ వార్‌ను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. పురుషులకు, మహిళా ఎమ్మెల్యేలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయి.

విసిరేస్తాం..

13 క్రీడల్లో జరిగే పోటీల్లో పాల్గొనడానికి ప్రజాప్రతినిధులు సోమవారం రాత్రి వరకు పేర్లను నమోదు చేసుకుంటూనే ఉన్నారు. మహిళా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి షాట్‌పుట్‌లో పేర్లను నమోదు చేసుకున్నారు. పురుషుల షాట్‌పుట్‌లో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేరును నమోదు చేసుకున్నారు.

పరుగులు తీస్తాం..

మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేరును నమోదు చేసుకున్నారు. పురుషుల 100 మీటర్ల పరుగులో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, తూమాటి మాధవరావు, వంకా రవీంద్రనాథ్

మిగతా 6లో..

హరిత బెర్మ్‌పార్క్ ముస్తాబు

- మొత్తం 20 సూట్ రూమ్‌లు సిద్ధం
- 17 సూట్ రూమ్‌లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు
- మిగిలినవి సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్‌కు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆటల పోటీల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చేందుకు హరిత బెర్మ్‌పార్క్ ముస్తాబవుతోంది. మొత్తం 20 సూట్‌లను ఏపీటీడీసీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 17 సూట్‌లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు కేటాయించారు. మరో మూడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి కేటాయించారు. బస వరకు ఏపీటీడీసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజాప్రతినిధులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, సాయంత్రం స్నాక్స్ వంటివి ప్రభుత్వ స్థాయిలోనే కల్పించనున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా బెర్మ్‌పార్క్‌ను ముస్తాబు చేస్తున్నారు. ఈ పనులను ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ సమీక్షిస్తున్నారు.

నున్నను కలపండి

జక్కంపూడి కారిడార్‌ను పరిగణనలోకి తీసుకోండి

- మెట్రో రైల్ ప్రతిపాదనలపై వెస్ట్, సెంట్రల్ ప్రజల వినతులు
- స్థానిక ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు చేస్తున్న కార్మికులు
- ఏపీఎంఆర్సీ ఎండీతో చర్చించాలని భావిస్తున్న ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రో ప్రాజెక్టు మొదటి దశ పనుల్లో నున్న ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని జక్కంపూడి కారిడార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు. నున్న, సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల నుంచి వివిధ పనులు, ఉద్యోగాల నిమిత్తం నగరంలోకి వచ్చేవారికి ఈ కారిడార్ అనువుగా ఉంటుందంటున్నారు. మెట్రో ప్రాజెక్టు మొదటి దశలో గన్నవరం నుంచి పీఎన్‌బీఎస్, పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్‌కు రెండు కారిడార్లనే ఎంపిక చేశారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో పేదలు నివసిస్తున్నారని, వీరిలో ఎక్కువగా కార్మికులే ఉంటారని, రోజూ వేలమంది నగరంలో ఉపాధి పొందటానికి, ఆటోనగర్‌లో పనిచేయటానికి వస్తుంటారని, ఇలాంటి సమయంలో జక్కంపూడి కారిడార్‌ను కొనసాగించాలనే డిమాండ్ వస్తోంది. ఈ మేరకు పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతులు అధికంగా వస్తున్నాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గంతో పోల్చుకుంటే పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో జనాభా ఎక్కువ. ఈ ప్రాంతాల్లో కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో ఉంటారు. కాగా, ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు కూడా త్వరలో ఏపీఎంఆర్సీ ఎండీ ఎన్వీ రామకృష్ణారెడ్డిని కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

వినతులు స్వీకరించేనా..?

మొత్తం ఐదు కారిడార్‌లకు ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ప్రతిపాదించింది. తొలిదశలో గన్నవరం బస్‌స్టేషన్ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఎయిర్ పోర్టుకు అనుసంధానమై, తిరిగి ఎన్‌హెచ్-16 నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌కు మొదటి కారిడార్‌ను ప్రతిపాదించింది. పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లేది రెండో కారిడార్. ఈ దశలో పీఎన్‌బీఎస్ నుంచి రాజధానిలోని లింగాయపాలెం వరకు, పీఎన్‌బీఎస్ నుంచి రైల్వేస్టేషన్‌ను అనుసంధానిస్తూ జక్కంపూడి వరకు రాక, పోక రెండు వేర్వేరు కారిడార్లకు ప్రతిపాదించింది. ప్రయాణికుల సామర్థ్యం ఎక్కువగా ఉంటుందన్న కారణంతో మొదటి దశకు ఆ ప్రాధాన్యమిచ్చామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. మరి ప్రజాప్రతినిధులు వినతుల మేరకు మెట్రో అధికారులు ఏం ఆలోచనలు చేస్తారో చూడాలి.

కిడ్నీ వ్యాధితో యువకుడి మృతి



మృతుడు లక్ష్మణ్ (ఫైల్)

ఎ.కొండూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాలో మరో కిడ్నీవ్యాధి మరణం నమోదైంది. ఫ్లోరైడ్, సిలికా వల్ల నీరు కలుషితమై ఎ.కొండూరులోని చైతన్యనగర్ తండాకు చెందిన భూక్యా లక్ష్మణ్ (26) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత ఎక్కువై డాక్టర్ల సలహా మేరకు ఆరు నెలల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో ఆదివారం చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఎ.కొండూరు తండాకు కృష్ణానది జలాలు అందించేందుకు రూ.50 కోట్ల వ్యయంతో ప్రారంభించిన జలజీవన్ మిషన్ పైపులైన్ పనులు నత్తనడకన నాణ్యతాలోపాలతో సాగుతున్నాయి.

‘బుడమేరు’కు రూ.39.05 కోట్లు

పరిపాలన ఆమోదం తెలిపిన సర్కార్

విజయవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది ఆగస్టులో విజయవాడను అల్లకల్లోలం చేసిన బుడమేరు అభివృద్ధికి ప్రభుత్వం పరిపాలనా ఆమోదాన్ని తెలిపింది. బుడమేరు మరమ్మతుల కోసం మొత్తం రూ.39.05 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. బుడమేరు డైవర్షన్ చానల్ మెకానికల్, విద్యుత్ పరికరాల మరమ్మతులకు రూ.1.08 కోట్లు కేటాయించారు. 3.840 కిలోమీటర్ నుంచి 4.340 కిలోమీటరుకు కుడి, ఎడమ వైపున వరద రక్షణ నిర్మాణానికి రూ.37.97 కోట్లు కేటాయించింది. మొత్తంగా బుడమేరు మరమ్మతుల కోసం రూ.39.05 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ పనులకు త్వరలో టెండర్లను పిలిచి పనులు ఖరారు చేయనున్నారు.





● పుట్టింటి పసుపు కుంకుమ

- తిరుపతమ్మ చిన్న తిరునాళ్లలో కీలక ఘట్టం

6లో

పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి పుట్టినిల్లయిన అనిగండ్లపాడు నుంచి పసుపు కుంకుమలు, పూలు, పళ్లు, పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. వేలాది మంది భక్తుల జయజయధ్వానాలతో పసుపు కుంకుమ వాహనాలకు స్వాగతం పలికారు.



దేదీప్యమానం

- భవానీద్వీపంలో లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటేన్
- ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు నిర్వాహకులు రెడీ
- రూ.12 కోట్లతో గత టీడీపీ హయాంలోనే ఏర్పాటు

6లో



కేబుళ్లతో కళావిహీనం

- విద్యుత్ స్తంభాలకు చుట్టలుగా వేలాడుతున్న వైర్లు
- ప్రమాదభరితంగా మారి మెడకు చుట్టుకుంటున్న వైనం
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న అధికారులు

8లో

దేదీప్యమానం..



భవానీ ద్వీపంలో లేజర్ షో అండ్ మ్యూజికల్ ఫౌంటేన్ పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. ఇన్సూరెన్స్‌ను క్లెయిమ్ చేసుకోవటానికి అవకాశం కల్పించాలని, దెబ్బ తిన్న మెషినరీని పరిశీలించటానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా పూర్వ నిర్వాహకుడు భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కి లేఖ రాశాడు. దీంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న లేజర్ షో-మ్యూజికల్ ఫౌంటేన్ వెలుగు జిలుగులకు అడుగులు పడినట్టయింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

- త్వరలో భవానీ ద్వీపంలో.. లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటేన్
- ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు నిర్వాహకులు రెడీ
- రూ.12 కోట్ల వ్యయంతో గత టీడీపీ హయాంలో ఏర్పాటు
- కృష్ణా వరదలకు మెషినరీ మొత్తం డ్యామేజీ
- ఇన్సూరెన్స్ క్లెయిమ్ పట్టని వైసీపీ పాలకులు
- ఐదేళ్ల పాటు నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- కూటమి ప్రభుత్వంలో తిరిగి పునరుద్ధరణకు అడుగులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 12 కోట్ల వ్యయంతో భవానీ ద్వీపానికి అభిముఖంగా కృష్ణానదిపై లేజర్ షో అండ్ మ్యూజికల్ ఫౌంటెయిన్‌కు సంబంధించి మెషినరీని ఏర్పాటు చేశారు. భవానీ ద్వీపం నుంచి లేజర్‌షోను తిలకించేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా కృష్ణానదిపై ఏర్పాటు చేసిన మెషినరీ మొత్తం ధ్వంసమైంది. వాటికి ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ క్లెయిమ్ చేయించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడమే కాకుండా కృష్ణానదిలోని భవానీద్వీపంలో కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడతారా.. అంటూ అప్పటి పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు వాఖ్యానించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇలాంటి దీవులు ఉంటే వాటి రక్షణకు చర్యలు తీసుకుని పర్యాటకాభివృద్ధి చేపడతారు. దీవులతో పర్యాటకాభివృద్ధి చెందుతుందన్న విషయం నాటి మంత్రికి అవగాహన లేదన్న విమర్శలను సైతం లెక్కచేయక వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పర్యాటకాన్ని గాలికొదిలేశారు. ఐదేళ్లూ భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) అచేతనంగా ఉండిపోవడం.. తర్వాత కృష్ణానదికి వచ్చిన రికార్డు స్థాయి వరదల కారణంగా భవానీద్వీపం మరింతగా దెబ్బతింది.



వరదల విధ్వంసానికి పాడైపోయిన సామగ్రి

కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పర్యాటకంపై ఆశలు చిగురించాయి. భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. బీఐటీసీ నేతృత్వంలో ద్వీపం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈడీగా పనిచేసిన సత్యనారాయణను ప్రభుత్వం తిరిగి నియమించింది. భవానీ ద్వీపం అభివృద్ధికి అడుగులు పడుతున్న తరుణంలో.. లేజర్ షో-మ్యూజికల్ ఫౌంటైన్ నిర్వాహకులు మూలన పడిన ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ముందుకు వచ్చారు. ధ్వంసమైన మెషినరీకి ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు కంపెనీ సానుకూలంగా ఉండటంతో ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు మార్గం సుగమమైంది. కృష్ణానదిలో ఏర్పాటు చేసిన లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటైన్ ఆసియాలోనే అతి పెద్దది. అభివృద్ధి చెందిన సింగపూర్, మలేషియాలలో కూడా ఇంత పెద్దది లేకపోవడం గమనార్హం. ప్రాజెక్టులో భాగంగా లేజర్ షోతో పాటు కృష్ణానదిలో నీటి తెరలను ఆవిష్కరిస్తే.. వెండితెర వెలుగులు విరజిమ్మినట్టుగా థీమ్ ప్రదర్శితమౌతుంది. కారుచీకట్లలో దేదీప్య వెలుగులు చూసేందుకు రెండు కళ్లు చాలవని పర్యాటక ప్రేమికులు అంటున్నారు. ఈ ప్రాజెక్టు కారణంగా భవానీ ద్వీపం కొత్త శోభను సంతరించుకోనుంది.



గత టీడీపీ హయాంలో లేజర్ షో వెలుగులు (ఫైల్)



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంలో జిల్లాను అగ్రగామిగా నిలపండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అర్జీల పరిష్కారంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు నిబద్ధతతో కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు మొత్తం 133 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తిచెందేలా గడువులోగా పరిష్కరించాలన్నారు. డివిజన్, మండలస్థాయిలోనూ గ్రీవెన్స్‌డేను సమర్థవంతంగా నిర్వహించాలని, అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ఇందుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.



సీవీఆర్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పది పరీక్షా కేంద్రాల తనిఖీ

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ జి.లక్ష్మీశ సందర్శించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ కోర్టుల సమీపంలోని సీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు ఏర్పాట్లు పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. భద్రతతో పాటు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

పరిటాలలో మల్టీ కార్గో టెర్మినల్

- స్వాగతించిన ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని పరిటాలలో మల్టీమోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటును ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతించారు. అమరావతి రాజధానిని ప్రధాన నగరాలు, ఓడరేవులతో అనుసంధానించటం ద్వారా ఆర్థికవృద్ధిని సాధించటంలో అమరావతి రైల్వే లైను కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ కింద రైల్వేల ప్రగతిపై లోక్‌సభలో ఎంపీ ప్రస్తావించారు. ఎన్డీయే హయాంలో రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2019-20లో 68వేల కోట్లు ఉంటే, 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రెండు లక్షల కోట్లు ఉండటం అభినందనీయమన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌ను అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ సమీపంలోని పరిటాలలో మల్టీ మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు, అమరావతి రైల్వేలైన్‌ను ఆయన స్వాగతించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద గత మూడేళ్లుగా స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని ఈ సందర్భంగా కేంద్రం దృష్టికి తెచ్చారు. విజయవాడ గుణదల-బెజవాడ క్రాసింగ్ వద్ద ఆరోబీ నిర్మాణానికి సర్వే ఇప్పటికే పూర్తయిందని, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను త్వరగా పరిష్కరించాలన్నారు.

రాష్ట్రపతి అల్పాహార విందుకు ఎంపీ శివనాథ్

వన్‌టౌన్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన అల్పాహార విందు కార్యక్రమంలో సోమవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, స్పీకర్ ఓం బిర్లా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎంపీ జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, సహచర ఎంపీలతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. అల్పాహార విందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఎంపీలను రాష్ట్రపతి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీలను నియోజకవర్గ విశేషాలను రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు.



ఎంపీలను పలకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మద్దతు ధరతో నష్టపోతున్నాం

- మార్కెటింగ్ అధికారుల ఎదుట అన్నదాతల ఆవేదన

కంచికచర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయిస్తే నష్టం తప్పితే మిగిలేదేమీ లేదు.. పంట కోతలు, నూర్పిళ్ల సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటం వల్ల మార్కెట్లో ధర నిలకడగా ఉండటం లేదు.. వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అమ్ముకోవాల్సి వస్తుంది.. అని పలువురు రైతులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. వివిధ పంటలకు మార్కెట్లో లభిస్తున్న ధరలు, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత సోమవారం సాయంత్రం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చారు. యార్డు ఆవరణలో ఆరబోసిన మొక్కజొన్న, శనగలు, కందులను పరిశీలించారు. ఆయా పంటలకు అయ్యే పెట్టుబడి, లభిస్తున్న ధరల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాగంటి వెంకట్రావు, కొండేటి నారాయణ, దేవిరెడ్డి గోపాలరావు, మాగంటి రమేష్‌లు మాట్లాడుతూ, శనగ విత్తనాలు రాయితీ పోగా క్వింటా రూ. 7,030లకు కొన్నామని, మద్దతు ధర రూ. 5,650లు ఏవిధంగా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. మొక్కజొన్న మద్దతు ధర రూ. 2,250లు ఉండగా, మార్కెట్లో రూ.2,150లకు కొంటున్నారని చెప్పారు. గతేడాది కందులను క్వింటా రూ. 11,900లకు విక్రయించగా, ప్రస్తుతం రూ. 6,500 నుంచి రూ. 7,000లోపు ధర ఉందన్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత ధర పడిపోవటం సాధారణమైందని వాపోయారు. ఖరీఫ్‌లో పెసలు కొనకపోవటం వల్ల ఎక్కువ మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. శనగలకు రూ. 8వేలు, కందులకు రూ. 10పది వేల వంతున గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, డీడీ లావణ్య, ఏడీ మంగమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం మల్లిక, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. రైతుల సూచనలను మంత్రుల కమిటీకి నివేదించనున్నట్టు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత పేర్కొన్నారు.



కందులను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత

స్టాల్ ఇన్ మాల్‌తో ఆర్థిక ప్రయోజనం

- నాబార్డు జీఎం కేవీఎస్ ప్రసాద్

కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో 'స్టాల్ ఇన్ మాల్స్' ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు నాబార్డ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పీవీపీ మాల్‌లో నిర్వహించిన ప్రదర్శన, అమ్మకాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, నాబార్డ్ ద్వారా స్వయంసహాయక సంఘాల మహిళలు, యువతకు హస్తకళా ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. హస్తకళాకారులు అత్యంత నైపుణ్యంతో తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వినియోగదారుల అభిరుచుల మేరకు చేనేత, కలంకారీ వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటివి ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, ఒడిసా, తెలంగాణా రాష్ట్రాల నుంచి స్వయం సహాయక బృందాల మహిళలు, నిరుద్యోగ యువత ప్రదర్శనలో పాల్గొన్నారని, వీరికి ఉచిత రవాణా, వసతి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. 'నేస్తం' సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ, గ్రామీణ హస్తకళారూపాలను తయారీ ధరలకే వినియోగదారులకు అందించడంతో అధికంగా అమ్మకాలు నిర్వహించి కళాకారులకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు. అనంతరం హస్తకళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరక్టర్ కె.నందిని, పీవీపీ మాల్ అసిస్టెంట్ మేనేజర్ రాచేటి అనిల్‌కుమార్, నేస్తం సంస్థ ప్రతినిధులు, స్వయం సహాయక బృందాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న నాబార్డు జీఎం ప్రసాద్, నేస్తం సీఈవో సురేష్

వైభవంగా పసుపు కుంకుమల మహోత్సవం

పెనుగంచిప్రోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు తిరుపతమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమల మహోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అనిగండ్లపాడులోని అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఇంటి కుటుంబ సభ్యులు పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలు, పండ్లు, పూలు, గాజులను భక్తిశ్రద్ధలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఎక్కించారు. వాహనాన్ని విద్యుత్ దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి జయజయధ్వానాలు చెబుతూ స్వాగతం పలికారు. దేవస్థానం వద్దకు వాహనం చేరుకోగానే ఈవో కిషోర్‌కుమార్ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, అధికారులు రాజగోపురం వద్ద ఘన స్వాగతం పలికి పుట్టింటి పసుపు కుంకుమలను ఆలయంలోకి తీసుకువెళ్లి అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు శ్రీరామ్ చిన్నబాబు, చింతల వెంకట సీతారామయ్య, పొందూరి సుధాకర్, అత్తునూరి అచ్యుతరావు, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పుర ప్రముఖులు పాల్గొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, గూడపాటి శ్రీనివాసరావు, గింజుపల్లి నరసయ్య, మాదల వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా విజయవాడ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు స్వీయ పర్యవేక్షణలో ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం.ఎస్.కే అర్జునలు బందోబస్తు నిర్వహించారు.



పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

వైభవంగా చంద్రమ్మ పసుపు కుంకుమ ఉత్సవం

తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం తిరుపతమ్మ అమ్మవారి తోడి కోడలు చంద్రమ్మ అమ్మవారి పుట్టిళ్లు పెనుగంచిప్రోలులోని కన్నెటి వెంకట రమణ ఇంటి నుంచి అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో చంద్రమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

మా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి

- కలెక్టర్ డీకే బాలాజీకి నడకుదురు దేవాలయ అర్చకుల వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తమ భూముల ను కౌలుదారులు అనుభవిస్తూ, తమకు కాకుండా చేస్తున్నారని వారి నుంచి భూములను పరిరక్షించాలని నడకుదురు దేవాలయానికి చెందిన అర్చకుడు కంఠంరాజు సాయిశర్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమ భూముల సమస్యలను కలెక్టర్ బాలాజీకి వారు వివరించారు. తమ సమస్యను దేవదాయశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న తమ భూములను కౌలుదారులు అన్యాక్రాంతం చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఆటాడేస్తాం..

(5వ పేజీ తరువాయి)

పేర్లను నమోదు చేసుకున్నారు.

'గురి' తప్పదు..

క్యారమ్స్ పోటీల్లో పాల్గొనడానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేరు నమోదు చేయించుకున్నారు. అలాగే, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కాయిన్స్‌ను గురి తప్పనివ్వబోమంటున్నారు. పురుషుల విభాగంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేరు రాయించుకున్నారు.

క్రికెట్‌లో కీలకమైన టీమ్‌లు

క్రికెట్ ఆడటానికి మొత్తం 40 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిని నాలుగు జట్లుగా విభజించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే రెండు జట్లను ఖరారు చేశారు. సీఎం 11 వెర్సస్ స్పీకర్ 11 జట్లుగా వీటికి నామకరణం చేశారు. చివరి రోజు జరిగే మ్యాచ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొనే అవకాశాలు ఉన్నాయని శాప్ వర్గాలు తెలిపాయి. మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు కొలికలపూడి శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా తదితరులు పేర్లు నమోదు చేసుకున్నారు.

నేడు ఫొటోషూట్

ప్రజాప్రతినిధులతోసీఎం ఫొటోషూట్ ఉంటుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటులో మాత్రమే ఉండే సంప్రదాయాన్ని ఇక నుంచి అసెంబ్లీలో అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ ఫొటో షూట్ ప్రతి ఏడాది ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు మంగళవారం అసెంబ్లీలో ఫొటో దిగుతారని తెలిపారు.



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాలు

సమ్మెను జయప్రదం చేయండి

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 24, 25 తేదీల్లో జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యుఎఫ్‌బియు) నేతలు పిలుపునిచ్చారు. యూనియన్ నేతలు సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీఈఎఫ్ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్.అజయ్‌కుమార్, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ (అమరావతి సర్కిల్) డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీఎస్ఆర్ శేఖర్‌లు మాట్లాడుతూ, ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ప్రధాన సమస్య అన్ని కేడర్లలో తగినంత నియామకాలు జరగాల్సి ఉందన్నారు. 5 రోజుల పనిదినాలను అమలు చేయాలని, టెంపరరీ, క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలు నిలువరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌సీబీఈ కౌన్సిల్ సభ్యుడు వీఎన్ఆర్ శ్రీధర్, ఏబీవోసీ నేత ఎండీ ఆజాం బాషా, ఏఐబీఓఏ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జె.అవినాష్, ఎన్‌ఓబీడబ్ల్యు ఉపాధ్యక్షుడు టి.రఘురామ్ పాల్గొన్నారు.



పూటీ లాగుతున్న ఎడ్లజత

ముగిసిన ఎడ్ల పోటీలు

గంపలగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ విభాగంలో పూటీ లాగుడు ఎడ్ల పోటీలు సోమవారంతో ముగిశాయి. 1.50 క్వింటాళ్ల ఎనిమిది నిమిషాల పోటీలో బాపట్ల జిల్లా కొత్తగుండ్ల పాలెం మండలం ఆవుల దొడ్డి గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి దీపక్‌చౌదరి ఎడ్లజత ప్రథమస్థానం, చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన కొప్పు మహేశ్వర్‌రెడ్డి ఎడ్లజతకు ద్వితీయస్థానం, ముత్తాయిపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల మోహన్ మణికంఠ ఎడ్లజత తృతీయస్థానం సాధించగా.. వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన పి.మొగలాయి ఎడ్లజతకు నాలుగోవస్థానం, చీరాలకు చెందిన గుంజి హేమంత్ ఎడ్లజతకు ఐదో స్థానం లభించాయి. ఎడ్ల పోటీలను తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు ప్రారంభించారు.

నేడు నాగాయలంకలో మాక్‌డ్రిల్

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వరదల నిర్వహణపై కృష్ణా జిల్లా నాగాయలంకలో కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రం వద్ద మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానికులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని ఆయన సూచించారు. మాక్‌డ్రిల్ నిర్వహణపై సోమవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయం నుంచి కృష్ణాజిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. విపత్తు ముందు, తర్వాత జరిగే నష్టాన్ని తగ్గించుకునేందుకు ఈ మాక్ డ్రిల్ దోహదపడుతుందని ఆయన వివరించారు.



బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్, మృతుడు తమ్మిశెట్టి రవి(సర్కిల్)

బైక్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

- కొడుకు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు

జి.కొండూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ ట్యాంకర్ మోటార్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో కుమారుడు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కట్టుబడిపాలెం సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన తమ్మిశెట్టి నరసింహారావు అతని పెద్ద కుమారుడు తమ్మిశెట్టి రవి కలిసి మోటార్ బైక్‌పై సోమవారం మైలవరం మండలం గణపవరం గ్రామంలోని ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. వారు కట్టుబడిపాలెం సమీపంలోకి రాగానే ఆయిల్ ట్యాంకర్ సడెన్‌గా యూటర్న్ తీసుకొని ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. రవి మీదుగా ట్యాంకర్ టైర్లు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా రవి (42) మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90,97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

తోటవారి వీధిలో చైన్ స్నాచింగ్

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్‌లోని తోట వారి వీధిలో మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు చైన్ తెంపుకెళ్లిన ఘటన సోమవారం జరిగింది. ఆలపాటి గీతా భవాని స్థానిక తోట వారి వీధి ఏడవ లైన్‌లో చిల్లరకొట్టు నడుపుతుంది. సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి థమ్సప్ ఇమ్మని రూ. 20 ఫోన్‌పే చేశాడు. తిరిగి మళ్లీ పది నిముషాల తర్వాత వచ్చి సరుకులు కావాలని చీటి ఇచ్చాడు. సరుకుల లిస్ట్ ఆధారంగా మహిళ దుకాణంలో సరుకులు ఇస్తుండగా దుండగుడు ఆమె మెడలోని బంగారపు చైన్ లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ పరీక్షలు ప్రారంభం



నిర్మల కాన్వెంట్ కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పటమటలంకలోని శ్రీ కొమ్మా సీతారామయ్య జడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు, పటమట రైతుబజార్ వద్ద ఉన్న కేబీసీ జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద పరీక్షకు వెళ్లడానికి ముందు టిఫిన్ తింటున్న విద్యార్థి

కూటమి పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం 3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టనున్న రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో త్వరిత గతిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఒక వైపు రాజధాని నిర్మాణం పనులు, రోడ్ల నిర్మాణం, అంతర్గత రహదారుల పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గద్దె రామ్మోహన్

జరుగుతున్నాయన్నారు. నగరాన్ని సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఒక్క తూర్పులో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తూమాటి ప్రేమ్‌నాథ్, జనసేన నాయకులు గుత్తి కొండ కృష్ణమోహన్, తాడి బాబూరావు, గద్దె రమేష్, జయశేఖర్, గుల్లపల్లి శంకర్, గోవిందరాజు, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో కమిషనర్ పరిశీలన

లబ్బీపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

సోమవారం రాణిగారితోట 18 వ డివిజన్‌లోని అన్న క్యాంటీన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ అన్న క్యాంటీన్లను పరిశీలించాలని, ఏ మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

31 ఫిర్యాదులు

కార్పొరేషన్: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 31 ఫిర్యాదులు వచ్చాయి.



సీఆర్డీఏ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబూరావు తదితరులు

రాజధానిలో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబూరావు, రాజధాని నేతలు

బెంజిసర్కిల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాల్లో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబూరావు, రాజధాని నేతలు సోమవారం సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఇస్తున్న రూ. 12వేల వేతనాన్ని రూ.21వేలకు పెంచాలని, కార్మికులు సంఖ్య పెంచాలని, కార్మికులకు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఆ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నేతలు ఎం. రవి, ఎం. భాగ్యరాజు, బుజ్జి, శ్రీలత, చిట్టిబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వ రరావు డిమాండ్ చేశారు. మండలంలోని ముస్తాబాద రిలయన్స్ గోదాములో పనిచేసే కార్మికులను తొలగించటంతో గత నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నారు. సోమవారం సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమాచారం లేకుండా తొలగించటం దుర్మార్గమన్నారు. రాంబాబు, స్వరూప రాణి, నాగరాజు, రంగారెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

చిట్టినగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కేఎల్‌రావు నగర్ నాలుగో లైన్‌కు చెందిన ఎం.రాము(25) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. రాము పాల ఫ్యాక్టరీలో, అతడి భార్య నాగజ్యోతి ఓ హోటల్‌లో రిసెప్షనిస్టుగా ఉద్యోగం చేస్తోంది. రాము మద్యానికి అలవాటుపడి అప్పులు చేశాడు. ఆదివారం రాత్రి నాగజ్యోతి హోటల్ నుంచి పోరంకిలో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం రాము భార్యకు ఫోన్ చేసి అప్పులు గురించి ప్రస్తావించి బాధపడ్డాడు. తర్వాత ఆమె ఫోన్ చేసినప్పటికీ అతడి నుంచి స్పందన రాలేదు. సోమవారం ఉదయం స్నేహితులు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో తలుపులను పగలుగొట్టి చూడగా రాము ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కత్తి వెంకటేశ్వర్లుకు ఎఫ్-టామ్ అవార్డు

వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అధికార భాషా కమిషన్ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లును ఎఫ్-టామ్ ఏపీ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఇదే సమయంలో సాహిత్య రంగంలో ఆయన చేసిన విశిష్ట కృషికి ఎఫ్-టామ్ ఎక్సలెన్సీ 2025 అవార్డును అందచేశారు. తుమ్మల పల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు అందచేశారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో

రూ.100 కోట్ల స్క్రాప్ అమ్మకాలు

రైల్వేస్టేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.101.65 కోట్ల మేరకు స్క్రాప్ అమ్మకాలు జరిగాయని డివిజన్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత పెద్ద మొత్తం ఒకే ఆర్థిక సంవత్సరంలో రావటం పట్ల ఇది ఒక చరిత్రగా అభివర్ణించారు. కిందటేడాది డిసెంబరులో రైల్వే ప్రధాన కార్యాలయం నిర్దేశించిన లక్ష్యాన్ని డివిజన్ సాధించిందని రూ.79 కోట్ల లక్ష్యాన్ని సాధించి రికార్డు నెలకొల్పిందని వారు తెలిపారు. ఈ వేలం ద్వారా 18,908 మెట్రిక్ టన్నుల స్క్రాప్‌ను విక్రయించిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో మూడు నెలల సమయం ఉండగానే రూ.100 కోట్ల మార్క్‌ను దాటటం విశేషమని పేర్కొన్నారు. సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్ కె.బి.తిరుపతయ్య స్క్రాప్ విషయంలో తీసుకున్న చర్యలను డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందించారు. రైల్వేకు ఆదాయం సమకూర్చటంలో, పచ్చదనం, పరిశుభ్రత విషయంలో స్క్రాప్ రహిత డివిజన్‌గా తీర్చిదిద్దటంలో చేసిన కృషిని ఆయన అభినందించారు.

చెట్టు కొమ్మలను తొలగించండి



పటమట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 13వ డివిజన్ డొంక రోడ్డులో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి పడేశారు. బందరురోడ్డు నుంచి యలమలకు దురు చిన్న వంతెన వరకు చెట్ల కొమ్మలను నరికి ఇలానే వదిలేశారు. వారం రోజులుగా ఇలానే చెట్ల కొమ్మలను ఉంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ(స్పోర్ట్స్),మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జే ఆధ్వర్యంలో మ్యాజిక్ యూత్ నిర్వహించిన జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రాండ్ మాస్టర్స్ ఉమన్, నూతక్కి ప్రియాంక మాట్లాడుతూ యువ ఆటగాళ్ళు తమ నైపుణ్యాలను పదును పెట్టడానికి మరిన్ని ఆటలు ఆడటంపై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఆంధ్రా లయోలా సంస్థల రెక్టర్ ఫాదర్ పి.ఆర్ జాన్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొన్న పిల్లలకు మద్దతు ఇచ్చిన తల్లిదండ్రులను అభినందిస్తున్నానని, వ్యూహాత్మక ఆలోచనను పెంపొందించడానికి మరిన్ని టోర్నమెంట్‌లలో క్రీడాకారులు పాల్గొనాలని అన్నారు. అనంతరం విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జే వ్యవస్థాపకుడు అండ్ డైరెక్టర్ ఫాదర్ బాల బొల్లినేని తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

క్రీడలతోనే మానసిక ప్రశాంతత



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు

సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఎన్టీఆర్ సిద్ధార్థ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఫేజ్-2 పురుషుల 26వ ఇంటర్ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తప్పనిసరిగా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివ ర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

గత మూడు రోజులుగా జరిగిన క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జీఎస్ఎల్ మెడికల్ కళాశాల కైవసం చేసుకుంది. అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు, పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. బ్యాడ్మింటన్ విన్నర్ రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్ ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల, టేబుల్ టెన్నిస్ విన్నర్ శ్రీకాకుళం గ్రేట్ జీఈ మెడికల్ కళాశాల, రన్నర్ అనంతపూర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల, టెన్నిస్ విన్నర్ గుంటూరు కాటూరి మెడికల్ కళాశాల, రన్నర్ రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, ఫుట్‌బాల్ విన్నర్ రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్ నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల విద్యార్థులు రాణించారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేత సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు



విజేతగా నిలిచిన సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు

లబ్బీపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో సిద్ధార్థ మహిళా కళాశాల విజేతగా నిలవగా రెండో స్థానంలో వైవీఎన్ఆర్ అండ్ జీడీ కళాశాల కైకలూరు ద్వితీయ స్థానం, శ్రీ పద్మావతి మహిళ హిందు డిగ్రీ కళాశాల మచిలీపట్నం మూడో స్థానం, డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ అండ్ జీడీ కళాశాల నాల్గో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయటంతో పాటు క్రీడాకారులను అభినం దించారు. సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి ఎం.ఉమామహేశ్వరి, పి.భువనేశ్వరి, కె.సరస్వతి, ఎ.శ్రీ రాజినిలు ఈ నెల 29 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు చెన్నైలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యునివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ ఎస్.కల్పన తెలిపారు.

తలుపులు లేని మరుగుదొడ్లు..మహిళల అవస్థలు

● మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు ● కొరవడిన పర్యవేక్షణ ● అధికారులు తీరుపై తీవ్ర ఆగ్రహం

ప్రభుత్వాసుపత్రి,మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో అన్నింటికెల్లా అతి పెద్దదిగా పిలువబడే విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అనేక సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు, సహాయకులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు సదుపాయాలు కూడా కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. రోగులు ఇబ్బందులు, అధికారులు గమనించకపోవడం పట్ల పలు విమర్శలకు తావిస్తోంది. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో మరుగుదొడ్లు కూడా ముఖ్యమే

కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని పేద బడుగు, బలహీన వర్గాలకు నగరంలోని ప్రభుత్వాసుపత్రే దిక్కు. రోగులకు వైద్యం ఏమాత్రం అందుతుందో లేదో తెలియదు కాని వారికి సదుపాయాల కల్పనలో మాత్రం అధికారులు వైఫల్యం రోగులకు శాపంగా మారుతోంది. ముఖ్యంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయి నెలలు గడుస్తున్నా తలుపులకు మరమ్మతుల చేయించే విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై రోగులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ కొరవడటంతో ఆసుపత్రి అధికారులు మనకెం దుకులే అన్నట్లు వ్యవ హ రిస్తున్నారనే విమర్శలు న్నాయి. రోగులకు యూరిన్ టెస్టుతో పాటు అనేక టెస్టులు చేయాల్సి ఉంది. వచ్చిన రిపోర్టు ఆధారంగా మందులు ఇస్తుంటారు. అలాంటి పరిస్థి తుల్లో రోగులకు అదనంగా మరుగు దొడ్లు లేకపోవడంతో మరింత ఇబ్బందిగా మారు తోంది. రక్త పరీక్షా కేంద్రం వద్ద ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉండడటంతో మహిళలు, పురుషులు ఒకే మరుగుదొడ్డి వాడుకోవాల్సి వస్తుందంటే అధికారుల పని తీరు ఎలా ఉందో గ్రహించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో తలుపులేని మహిళల మరుగుదొడ్డి, పక్కన పెట్టిన మరుగుదొడ్డి తలుపు

బైపాస్‌ల అనుసంధానానికి కృషి

నున్న రైతులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ

విజయవాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ బైపాస్, లోకల్ బైపాస్‌లను అనుసంధానించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నున్న గ్రామ రైతులకు హామీ ఇచ్చారు. విజయవాడ గురు నానాక్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నున్న గ్రామ రైతులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నున్న గ్రామ అభివృద్ధికిగాను నేషనల్, లోకల్ బైపాస్‌లను అనుసంధానం చేయాలని రైతులు ఎమ్మె ల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామ సాయిబాబా గుడి రోడ్డుతో పాటుగా రూరల్ గ్రామాల రోడ్లు అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసిన వారిలో పంచాయితీ వార్డు సభ్యుడు గంపా శ్రీనివాస్, బూరుగుల చెరువ సాగునీటి సంఘం అధ్యక్షుడు ముళగుళ్ల సుబ్బారెడ్డి, రైతులు గుంటక సుబ్బారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.

కేబుళ్లతో కళావిహీనం

విద్యుత్ స్తంభాలకు చుట్టలుగా వేలాడుతున్న వైర్లు

ప్రమాదభరితంగా మారి మెడకు చుట్టుకుంటున్న వైనం

ప్రేక్షకపాత్ర పోషిస్తున్న అధికారులు



ఆంధ్రజ్యోతి పరిశీలన

బెంజిసర్కిల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో గోడలకు అందమైన పెయింటింగ్స్ వేయిస్తూ సుందరంగా ఉండేలా తీర్చిదిద్దటం ఎంతో బాగుంది! నగర సందర్శనకు వచ్చేవారికివి చక్కటి ఆహ్లాదాన్ని పంచుతాయి. గోడలపై పెయింట్స్ అందంగా కనిపిస్తున్నా వీటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల సంగతేంటి? వాటికి చుట్టలుగా ఉన్న కేబుల్స్ మాటేమిటి? ఈ కేబుల్ చుట్టలు స్తంభాలకు వేలాడుతూ చూసేందుకు కళావిహీనంగా ఉన్నాయి. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలంటే పెయింటింగ్స్ వేయించటం ఒక్కటే కాదు. ఇలా స్తంభాలపై కనిపిస్తున్న కేబుల్ చుట్టలను కూడా సంస్కరించాలి. పెయింటింగ్స్‌పై పెడుతున్న శ్రద్ధ నగరంలోని విద్యుత్ స్తంభాలపైనా పెట్టాలి. ఒక సుందరమైన నగరానికి, ప్రణాళికాబద్ధంగా ఉన్న నగరానికి ఇలాంటివి బాగోవు. ఇతర దేశాల్లోని చిన్న టౌన్లలో కూడా రోడ్లపై ఎక్కడా కేబుళ్లతో కూడిన విద్యుత్ స్తంభాలు కనిపించవు. దీంతో ఆయా ప్రాంతాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. కానీ మన నగరంలో స్తంభాలపైనే కేబుళ్లుంటాయి. భూగర్భ కేబుళ్లు వేయాలంటే ఆర్థికభారం తప్పదు. కానీ, ఉన్న వాటినైనా చక్కగా ఉంచాలి కదా! టెలిఫోన్, ఇంటర్నెట్, ఎంఎస్‌వో ఆపరేటర్ల కేబుల్స్ అన్నీ చుట్టలుగా చుట్టి స్తంభాలకు తగిలించటంతో ఎంతో జుగుప్సాకరంగా ఉన్నాయి. నగరానికి వచ్చే సందర్శకులకు ఇవి ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో రాజధాని అమరావతి పనులు కూడా మొదలవుతున్నాయి. అమరావతిని చూడాలంటే ముందుగా విజయవాడే రావాలి. ఆ సమయంలో ఇలాంటి దృశ్యాలు ఎంతమాత్రం బాగోవు. నగరంలో ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 65, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, 5వ నెంబర్ రోడ్డు ఇలా ఏ రోడ్డు చూసినా విద్యుత్ స్తంభాలకు కేబుల్ చుట్టలు కనిపిస్తున్నాయి. ఇక అంతర్గత రోడ్ల సంగతైతే చెప్పనక్కరలేదు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు నగర అందాలను మెరుగుపర్చేందుకు గోడలపై పేయింటింగ్స్‌తో పాటు అనేక రకాల బొమ్మలను వేయిస్తున్నారు. వీటితో నగరం అందాలు వికసిస్తాయనే భావన ఉన్నా దాన్ని చిత్తుచేసేలా ఈ కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు వేలాడుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులు, వీధుల్లోని కరెంట్ స్తంభాలనూ వదలకుండా కేబుల్‌వైర్లు చుడుతున్నారు. అలాగే రోడ్డుమధ్యలో పైభాగం మీదుగా కేబులు వైర్లు వేస్తున్నారు. దీంతో ప్రమాదాలతోపాటు అస్తవ్యస్తమైన వాతావరణం నెలకొంది. అనుకోకుండా విద్యుత్‌వైర్ల నుంచి కరెంట్ విద్యుత్ ఐరన్ స్తంభానికి అంటుకున్నా ప్రమాదమే. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అమలుచేస్తే ప్రమాదాల నివారణతోపాటు నగరం సుందరీకరణంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలి.



పటమటలంక మెయిన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు చుట్టలు చుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు జీవో 1 అమలు చేయాలి

● ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ

బస్టేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు సంబంధించి 2019లో జారీ అయిన జీవో 1ను కిందిస్థాయి అధికారు లు అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలని, అసోసియేషన్ల అభిప్రాయాలు తీసుకోవాలని, ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ గౌ రవాధ్యక్షుడు ఎస్కే జిలానీ బాషా, అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి సోమవారం ఈ మేరకు ఆర్టీసీ క మిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. జీవో 1ను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని అన్నిచోట్ల కార్మికులు ఆందోళన చేస్తున్నారని, కొన్ని చోట్ల అసోసియేషన్ల ప్రమేయం లేకుండానే నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. దీనిపై అసోసియేషన్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయం తీసుకోవాలని కోరామన్నారు. 2019లో వచ్చిన జీవో నెం.1తో ఉద్యోగులు, కార్మికులు ఎంతో సంతోషించారని, కానీ 2020 జనవరి 1 నుంచి ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక 2019 జీవో 1కు సంబంధించి రాతపూర్వకమైన ఆదేశాలేమీ లేకుండానే అమలును నిలిపివేశారన్నారు. దీంతో వందలాది మంది ఉద్యోగ, కార్మికులు అక్రమ సస్పెన్షన్లకు ఇతరత్రా ఉద్యోగ ఇబ్బందులకు గురయ్యారని, ఇంక్రిమెంట్లకు కోత వేశారని, దీంతో ఉద్యోగులు వేసే కేసులు కూడా పెరిగాయని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి 2019 జీవో 1ను కచ్చితంగా అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలని, కార్మిక వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక అంశాలున్న జీవో నెం.70లో కాండక్ట్ రెగ్యులేషన్స్‌పై సవరణలు చేయాలని కోరారు.

రాజమండ్రి - విశాఖపట్నం డెము రైలు పునరుద్ధరణ

రైల్వే స్టేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 67285 రాజమండ్రి - విశాఖపట్నం, 67286 విశాఖపట్నం - రాజమండ్రి డెము రైళ్లను సోమవారం (ఈనెల 17) నుంచి పునరుద్ధరించినట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపా రు. గతంలో ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించామని, తాజాగా పునరుద్ధరించామని, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.



కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్

గ్రామీణ నేపథ్యంలో ‘కాలగమనం’

● ట్రైలర్ రిలీజ్‌లో హీరో రాజా

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నేపథ్యంలో తీసిన కాలగమనం చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కాలగమనం చిత్రం హీరో రాజా కోరారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం దర్శక, నిర్మాత బుర్రి సుధాకర్ నిర్మించిన కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్ అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. సినిమాకు సంబంధించిన ఒక పాటను ఆవిష్కరించగా చిత్ర హీరో రాజా, హీరోయిన్ లావణ్య రామారావు జంటగా స్టెప్స్‌వేసి అభిమానుల్ని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్ మాట్లాడుతూ కాలగమనం చిత్రాన్ని కుటుంబ సమేతంగా వీక్షించవచ్చని తెలిపారు. దర్శక, నిర్మాత బుర్రి సుధాకర్ మాట్లాడుతూ చిత్రంలో ప్రేమ, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని, కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చని తెలిపారు. ఏప్రిల్ నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. చిత్ర యూనిట్‌తో పాటు ఏపీ ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు మధుమోహన్, వేగ జువెలరీ అధినేత వనమా సుధాకర్, కాపా శ్రీనివాసరావు హాజరై చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



బీసీ ఐక్యవేదిక నగర కమిటీ సభ్యులను అభినందిస్తున్న సుమన్

బీసీల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

● సినీ నటుడు సుమన్

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీలు శ్రమజీవులని, వారి సమస్యల పరిష్కారానికి బీసీ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ కోరారు. సోమవారం నగరానికి వచ్చిన సుమన్ సీతారామపురంలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తొలి తెలుగు శాసనకర్త ఎరి (కల్) ముత్తరాజు ధనంజయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర బీసీ ఐక్యవేదిక నూతన కమిటీని అభినందించారు. బీసీ ఐక్యవేదిక నగరాధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటైన నగర నూతన కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. వేదిక అధ్యక్షుడు ఎన్వీ రావు, బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హీరో సుమన్.. రాజు స్వగృహానికి వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. ఏపీ ఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ ఏ విద్యాసాగర్, ప్రొఫెసర్ వెలగా జోషి, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుళ్లపల్లి నారాయణరావు, వివిధ సంఘాల నేతలు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

అమరావతిపై కేబినెట్ కీలక నిర్ణయాలు

విజయవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రూ.22,607.11 కోట్ల విలువైన 22 పనులకు ఎల్1గా నిలిచిన బిడ్డర్లను ఆమోదిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ బిడ్డర్లకు పనులు అప్పగించటానికి వీలుగా అగ్రిమెంట్ లేఖలు (ఎల్‌వోఏ)లను జారీచేసే అధికారాన్ని సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఇచ్చారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థల నుంచి తీసుకుంటున్న అ ప్పుతో చేపట్టే రూ.15,905.02 కోట్ల విలువైన 37 ప్యాకేజీల పనులకు ఇటీవల సీఆర్‌డీఏ అథారిటీ తీసుకున్న నిర్ణయాన్ని అమలుకు వీలు గా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏడీసీఎల్ సీఎండీకు అధికారాలను కల్పిస్తూ మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు మరో ముఖ్యమైన శాసనసభ, హైకోర్టు, సచివాలయం హెచ్‌వోడీ టవర్ల నిర్మాణపు కాంట్రాక్టులను ముందుకు తీసుకెళ్లడానికి కరెన్సీ సీలింగ్ నిబంధనలను సవరించటానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. రాజధాని ప్రధాన రాజమార్గాలకు సంబంధించి 41వ ప్యాకేజీ కింద రూ.307.59 కోట్లతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణం, వరదనీటి కాల్వ, మంగళగిరి జాతీయ రహదారి వరకు ఈ-15 రోడ్డు విస్తరణకు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ (డీఎల్‌పీ)తో పరిపాలనా అనుమతి కోసం ఏడీసీఎల్ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. రాజధానిలో రూ.390.06 కోట్లతో ఏపీ ట్రాన్స్‌కో నేతృత్వంలో 400 కేవీ డీసీ లైన్ (18 కిలోమీటర్లు), రూ.1082.44 కోట్ల అంచనాతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) 400 కేవీ డీసీ లైన్లు (20 కిలోమీటర్లు), రీ రూటింగ్ బ్యాలెన్స్ పనులకు సంబంధించి పీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కె.రామచంద్రరావు ట్రాన్స్‌మిషన్ అండ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు సంయుక్తంగా 8.9 శాతం ఎక్సెస్ రేటుకు అప్పగించేందుకు వీలుగా ఏడీసీఎల్ నుంచి వచ్చిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అలాగే, సీఆర్‌డీఏ ప్రాంతంలో వివిధ సంస్థలకు జరిపిన భూ కేటాయింపులను కూడా మంత్రి మండలి సమీక్షించింది.

తాడిగడప మునిసిపాలిటీ పేరు మార్పు

మచిలీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ పేరును తాడిగడప మునిసిపాలిటీగా మార్పుచేస్తూ రాష్ట్ర కేబినెట్ సో మవారం తీర్మానం చేసింది. వైసీపీ ప్ర భుత్వం అధికారంలో ఉండగా తాడిగడప పంచాయతీని వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ పేరుతో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్‌చట్టం 1945 షెడ్యూలు 10, కాలం-2లోని 1వ నెంబరులో పేర్కొన్న సూచనల ఆధారంగా తాడిగడప మునిసిపాలిటీగా మారు స్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

కత్తులతో యువకుల వీరంగం

వైన్ షాపులో ఘర్షణ.. బీర్ సీసాలతో దాడి!

విజయవాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వైన్‌షాపు వద్ద సోమవారం యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. మద్యం మత్తులో వారు బీర్‌సీసాలతో తలలు పగలగొట్టుకుని కత్తులతో వీరంగం సృష్టించారు. పంచాయతీ పరిధిలోని లచన్ వైన్‌షాపు అజిత్‌సింగ్‌నగర్ ఫైపులరోడ్డుకు సమీపంలో ఉంది. ఇక్కడ మద్యం అమ్మకాలతో పాటుగా అనుమతులు లేకుండా అనధికార పరిమిట్ రూమ్ నడుస్తుండడంతో సోమవారం స్థానిక శాంతినగర్‌కు చెందిన కొందరు యువకులు మద్యం సే వించేందుకు వచ్చారు. మొత్తం నలుగు రు యువకులు వచ్చి వారిలో వారే ఘ ర్షణ పడ్డారు. పూటుగా మద్యం సేవించిన ఓ యువకుడు బీర్ సీసాలను వై న్‌షాపు గోడకు కొట్టడమే కాక స్వ యంగా తలపై మోదుకున్నాడు. రక్తస్రావం అవుతున్నా సరే పట్టించుకోకుం డా తనతో వచ్చిన మరో యువకుడితో వాగ్వాదానికి దిగాదు. ఇంతలో మరో యువకుడు తన ద్విచక్రవాహనం నుం చి కత్తిని తీసి అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో బెం బేలెత్తిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొంతసేపటికి కొత్తపే ట పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వారు అక్కడి నుంచి పరారవ గా ఘర్షణ పడిన యువకులు ఎవరనే విషయమై పోలీసులు ఆరాతీస్తున్నారు.

నూతన సమగ్ర కౌలు చట్టాన్ని తీసుకురావాలి

బెంజిసర్కిల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల రక్షణ, సంక్షేమా నికి నూతన సమగ్ర కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామసభలు నిర్వహించి కౌలురైతు గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందరావు, ఎన్టీఆర్ జిల్లా కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ వద్ద సంఘం ప్రతినిధులు ఆందోళన చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● అత్యంత పారదర్శకంగా మైనింగ్ కార్యకలాపాలు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ కార్యకలాపాలు జరిగేలా పటిష్ట పర్యవేక్షణతో నిరంతర అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక లేదా మట్టి రవాణాపై వచ్చే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదికల సమర్పణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. జి.కొండూరు మండలం, కోడూరు గ్రామ కొత్త చెరువుతో పాటు నందిగామ మండలం, చిన నందిగామ వద్ద డంప్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు వచ్చిన ఆరోపణలపై ఏపీఎస్ఎంసీ లిమిటెడ్ డీఎం, మైన్స్ డీడీ, విజయవాడ తూర్పు తహసీల్దార్, మైలవరం మండల సర్వేయర్, సంబంధిత వీఆర్‌వోలతో కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే జగ్గయ్యపేట మండలం, కొంగర మల్లయ్యగట్టు వద్ద అక్రమ క్వారీయింగ్ ఆరోపణలపైనా కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిర్దేశిత ప్రాంతాల్లో పటిష్ట నిఘాకు ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ తవ్వకాలు లేదా రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనగల (బెంగాల్ గ్రామ్) కొనుగోళ్లకు జిల్లాలో ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో 12 ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ (పీఏసీఎస్), 30 రైతు సేవా కేంద్రాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొన్న ప్రతి రైతు తమకు కేటాయించిన తేదీ ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి పంటను విక్రయించుకోవచ్చన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా శనగలు (బెంగాల్ గ్రామ్) రూ.5650కు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

నాణ్యతా ప్రమాణాల వివరాలు

వ్యర్థ పదార్థాలు 2శాతం, దెబ్బతిన్న పప్పుదినుసులు గింజలు 3శాతం, కొద్దిగా దెబ్బతిన్న, రంగులేని పప్పు దినుసు గింజల 4 శాతం, పక్వానికి రాని, ముడత/కుచించుకుపోయిన పప్పు దినుసులు గింజలు 3 శాతం, ఇతర పప్పు దినుసు గింజలు 3 శాతం, పురుగు పట్టిన పప్పుదినుసు గింజలు 4శాతం, తేమ శాతం 14శాతం, రైతుల వద్ద నుంచి మాత్రమే మద్దతు ధరపై కొనుగోళ్లు, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాల్ను శనగల (బెంగాల్ గ్రామ్) మాత్రమే కొనుగోళ్లు చేయడం జరుగుతుందన్నారు. నగదును రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా చెల్లిస్తామన్నారు. వివరాలకు డీఎం మార్క్ ఫెడ్ 8978381836, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 9652095861లను సంప్రదించవచ్చన్నారు.



కూలిన నిర్మాణాల పరిశీలన, రెస్క్యూ కార్యకలాపాల ప్రదర్శిస్తున్న దళ సభ్యులు

సీఎస్ఎస్ఆర్ ప్రాంతీయ పోటీలు

వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, 10వ బెటాలియన్ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం సంయుక్తంగా కూలిపోయిన నిర్మాణాల శోధన, రెస్క్యూ కార్యకలాపాలపై (సీఎస్ఎస్ఆర్) ప్రాంతీయ స్థాయి పోటీలను సోమవారం ప్రారంభించారు. గన్నవరం మండలంలోని కొండ పా వులూరు సర్వే నెంబర్ 6 పరిధిలోని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు మంగళవారం కూడా జరుగుతాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఒక్కో బృందం, కేరళలోని అగ్నిమాపక శాఖ నుంచి మరో బృందం పాల్గొంటున్నాయి. ప్రతి జోన్ నుంచి విజేత, రన్నరప్ జట్లను ఎంపిక చేసి జాతీయ పోటీలకు పంపుతారు. 8వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఘజియాబాద్ (ఉత్తరప్రదేశ్)లో జరిగే జాతీయ పోటీల్లో విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50వేల నగదు బహుమతులు అందచేయనున్నారు.

‘యాదాద్రి మహోద్భవం - భక్తిరస ప్రధానం’



విజయవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సురభి నాటక మహోత్సవంలో మూడో రోజు శ్రీ ఆవేటి మనోహర్ సురభి కళామందిరం బృందం ప్రదర్శించిన ‘శ్రీ యాదాద్రి మహోద్భవమ్’ నాటకం భక్తి, రస, అభినయంతో అలరించింది. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ స్థల పురాణాన్ని ఆధారంగా ఈ నాటకం రూపొందించబడింది. నారదుడితో ప్రారంభమైన కథ హిరణ్యకశిపుడి దురహంకారాన్ని, ప్రహ్లాదుని భక్తిని, నరసింహస్వామి అవతరణ ఘట్టాలను హృద్యంగా ఆవిష్కరించింది. నరసింహస్వామి రోషం, జ్వాలా నరసింహ స్వరూప భంగిమలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. పాత్రధారులు అద్భుతమైన అభినయంతో రంగస్థలాన్ని కదిలించారు సంగీత ఎం.నాగరాజు, కథ-దర్శకత్వం ఎస్.ఎ.రఘునాథ్ అందించగా, రంగస్థల నిర్వహణను ఆర్.కోదండరావు సమర్థంగా చేపట్టారు. ప్రేక్షకులు ఈ నాటకాన్ని ఆద్యంతం ఆసక్తిగా వీక్షించి, నటీనటుల ప్రతిభను హర్షధ్వానాలతో ప్రశంసించారు.

రూ.21వేల కనీస వేతనాలు ఇవ్వకుంటే సమ్మె

● పంచాయతీ కార్మికుల డిమాండ్ ● నగరంలో ధర్నా



ధర్నాలో నినాదాలు చేస్తున్న కార్మికులు

ధర్నాచౌక్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతామని గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమకు బానిస చాకిరీ నుంచి విముక్తి కల్పించాలని, పోరాడి సాధించుకున్న జీవోలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పును బేఖాతరు చేస్తున్న అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, టెండర్లు లేకుండా కార్మికులను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీకి దిగుతున్నాయని ధ్వజమెత్తారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు డి.వెంకట్రామయ్య, కె.ఉమామహేశ్వరరావు ప్రసంగించారు.



ఏపీ జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన విద్యాసాగర్‌ను అభినందిస్తున్న సభ్యులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పట్టించుకోవాలి

● లేదంటే ఏప్రిల్‌లో కార్యాచరణ ● ఏపీ జేఏసీ రాష్ట్ర నేతలు

● జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా విద్యాసాగర్ ఎన్నిక

గాంధీనగర్,. మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వానికి తొమ్మిది నెలలు సహకరించామని, ఇంకా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఏప్రిల్‌లో కార్యాచరణకు సిద్ధపడతామని పేర్కొన్నారు. 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, పీఆర్సీ అమలయ్యేలోగా 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు తదితర పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎ.విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శివారెడ్డి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను సీఎం చంద్రబాబు, సీఎస్ దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి వరకు వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. గతంతో ఎన్నడు లేని విధంగా గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 29 వేల కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. ప్రభుత్వం మారినా ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపులు జరగలేదన్నారు. హెల్త్ కార్డులపై చికిత్స అందడం లేదన్నారు. కేవలం రూ. 700 కోట్ల జీపీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు మాత్రమే ఈ ప్రభుత్వం చేసిందన్నారు. బకాయిల చెల్లింపుపై రోడ్డు మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ జనరల్ సెక్రటరీ కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న మూడు డీఏల్లో ఒక్క డీఏ కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నుంచి ఉద్యోగ సంఘాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు.



యువత గుండె ఆగిపోతోందా?

ఉరకలేసే వయసులో చురుగ్గా పని చేయవలసిన గుండెలు అకస్మాత్తుగా ఆగిపోతున్నాయి. కొన్ని క్షణాల ముందు వరకూ చలాకీగా, హుషారుగా కనిపించిన యువత హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్న సంఘటనలు చూస్తున్నాం. ఈ సమస్య వెనకున్న కారణాలు, నివారణోపాయాల గురించి ప్రముఖ హృద్రోగ వైద్యులు స్టార్ హాస్పటల్స్ జాయింట్ ఎం.డీ. డాక్టర్ రమేష్ గూడపాటి వివరిస్తున్నారు.



గత మూడు నాలుగు దశాబ్దాలుగా భారతీయుల్లో గుండెపోటు ముప్పు బాగా పెరిగింది. అంతే కాకుండా గుండెపోటు వచ్చే వయసు కూడా బాగా తగ్గింది. మునుపు 60 ఏళ్ల పైబడిన వాళ్లలో ఈ సమస్యను చూసేవాళ్లం. కానీ ఇటీవలి కాలంలో 30 అంతకంటే తక్కువ వయస్కులు గుండెపోటుకు లోనవుతున్న సంఘటనలను చూస్తున్నాం. ఇందుకు కారణాలు లేకపోలేదు. అమెరికన్లు, యూరోపియన్లు, చైనీయులు, జపనీయులతో పోలిస్తే, భారతీయులు జన్యుపరంగా గుండె జబ్బులకూ, గుండె పోట్లకూ లోనయ్యే అవకాశాలు ఎక్కువ. ఇక్కడున్న భారతీయులే కాదు, విదేశాల్లోనే పుట్టి పెరిగి, ఆయా జీవనశైలులను అనుసరించే భారతీయులు సైతం, గుండె జబ్బుల బారిన పడుతూ ఉండడాన్ని బట్టి, మన భారతీయులకు జన్యుపరమైన గుండె జబ్బుల ముప్పు విదేశీయుల కంటే విదేశీయుల కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. అయితే మనకు జన్యుపరమైన గుండెజబ్బుల ముప్పు ముందు నుంచే పొంచి ఉండడానికి కొన్ని కారణాలున్నాయి. అవేంటంటే...

- **పొట్ట కొవ్వు :** మనకు పొట్ట దగ్గర కొవ్వు ఎక్కువగా పేరుకుంటూ ఉంటుంది. లావు పొట్ట కలిగి ఉన్న వాళ్లలో, అంతర్గత అవయవాల్లో కూడా కొవ్వు పేరుకుని ఉంటుంది. ఈ కొవ్వు శరీరానికి హాని కారకమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి మధుమేహం బారిన పడడం, మంచి కొలెస్ట్రాల్ తక్కువగా, చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే జన్యుపరంగానే మనలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉంటాయి.

- **చెడు కొలెస్ట్రాల్ :** మూడింట ఒక వంతు కొలెస్ట్రాల్ మనకు మన జీవనశైలి నుంచే అందుతుంది. మనం తినే ఆహారం, చేసే వ్యాయామం మీదే ఈ కొలెస్ట్రాల్ మోతాదు ఆధారపడి ఉంటుంది. రెండింట మూడో వంతు కొలెస్ట్రాల్ మన శరీరంలోనే తయారవుతుంది. ఈ కొలెస్ట్రాల్ మోతాదును మన జన్యువులు నిర్ధారిస్తాయి. అయితే ఈ మొత్తం కొలెస్ట్రాల్‌లో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం, అది ఎక్కువ హానికారకమైన కోవకు చెంది ఉండడం వల్ల సహజంగానే గుండెకు జరిగే చేటు ఎక్కువ.

- **మధుమేహం :** మనకు మధుమేహం ముప్పు కూడా ఎక్కువే! విదేశీయులతో పోలిస్తే, వాళ్ల కంటే మనకు మధుమేహం వచ్చే అవకాశాలు 20% ఎక్కువ.

ముప్పు పెరిగిందిలా...

గుండె జబ్బుల ముప్పును పెంచే ఈ కారణాలు ఇప్పుడు కొత్తగా మనలో చోటుచేసుకున్నవి కావు. ఇవన్నీ ప్రారంభం నుంచీ ఉన్నవే! అయినా ఇటీవలి కాలంలో, మరీ ముఖ్యంగా యువతలో గుండెపోటు ముప్పు పెరగడానికి కారణం మన జీవనశైలి మార్పులే! మారుతున్న మన జీవనశైలి గుండెపోటు ముప్పును మరింత పెంచుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చి చూసుకుంటే పట్టణాల్లో నివసించే వారిలో ఈ ముప్పు ఎక్కువగా ఉండడాన్ని బట్టి పట్టణ జీవనశైలి కూడా గుండెపోట్లకు కారణమవుతోందని నిర్ధారించుకోవచ్చు. శారీరక వ్యాయామం లోపించడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే మన ఆహారశైలి కూడా బాగా మారిపోతోంది. స్విగ్గీలు, జొమాటోలతో బయటి ఆహారం చిటికెలో చేతికందుతోంది. అలాగే రుచిగా ఉండే పదార్థాలన్నీ ఎక్కువ చక్కెరలు, నూనెలతో తయారవుతూ ఉంటాయి. కాబట్టి వాటినే మనం ఎక్కువగా ఎంచుకుంటూ ఉంటాం. ఊబకాయం, మధుమేహాల పెరుగుదలకు ఇలాంటి ఆహారశైలే కారణం. అలాగే ప్రస్తుతం పోటీతత్వం విపరీతంగా పెరిగింది. వృత్తిలో, చదువులో ముందుండడం కోసం పెట్టే ఈ పరుగులో మనకు తెలియకుండానే ఒత్తిడి పెరుగుతోంది. వీటితో పాటు మద్యపానం, ధూమపానం లాంటి అలవాట్లు కూడా గుండెజబ్బుల ముప్పుకు తోడవుతున్నాయి. కంటికి కనిపించని మరొక భూతం, వాతావరణ కాలుష్యం. అయితే పెరిగే వయసు (60 ఏళ్ల దాటిన తర్వాత గుండెపోటుకు గురయ్యే ముప్పు పెరుగుతుంది), గుండెజబ్బుల కుటుంబ చరిత్ర కలిగి ఉండడం (60 ఏళ్ల లోపు గుండెపోటుకు గురవడం) లాంటి సరిదిద్దే వీలు లేని కారణాలను మినహాయించి, ధూమపానం, మధుమేహం, అధిక రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్, అధిక బరువు, శారీరక వ్యాయామం లోపించడం లాంటి సరిదిద్దే వీలున్న వాటి మీద దృష్టి పెట్టగలిగితే కచ్చితంగా గుండెపోట్లను నివారించుకోగలుగుతాం!



అపోహలు

- లక్షణాలేవీ లేవు కాబట్టి నాకు గుండె సమస్య ఉండదు అనుకోవడం అపోహ మాత్రమే!
- ఫిట్‌గా ఉన్నంత మాత్రాన, ఆరోగ్యకరమైన ఆహారశైలిని అనుసరిస్తున్నంత మాత్రాన గుండె సమస్యలు రావనుకోవడం కూడా అపోహే!
- మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ సమస్యలు లేవు కాబట్టి గుండె జబ్బులు రావు అనుకోవడం కూడా అపోహే!
- కొవిడ్ తర్వాత గుండెజబ్బులు పెరిగాయి అన్నది కూడా అపోహే! కొవిడ్‌తో, కొవిడ్ వ్యాక్సిన్‌తో ముడిపడిన గుండెపోట్లు ఆ కాలానికే పరిమితం. ఆ ప్రభావం ఇప్పటివరకూ కొనసాగే వీలు లేదు.

నివారణ మన చేతుల్లోనే...

యువతలో గుండెపోటుకు వేర్వేరు కారణాలుంటాయి. గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో క్రమేపీ అడ్డంకులు ఏర్పడడం వల్ల ప్రధానంగా గుండెపోటు వస్తుంది. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్న కొందర్లో అకస్మాత్తుగా గుండెపోటు తలెత్తే అవకాశాలు కూడా ఉంటాయి. జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయే వాళ్లు ఈ కోవకు చెందుతారు. కొందర్లో వ్యాయామం చేసే సమయంలో గుండె రక్తనాళాలు చిట్లి, వాటిలో రక్తపు గడ్డలు ఏర్పడి గుండెపోటు రావచ్చు. కొందర్లో ముందు నుంచే గుండె కండరాల బలహీనత లాంటి సమస్యలు ఉండడం వల్ల గుండె పోటు తలెత్త వచ్చు. అయితే ఈ ముప్పులను నివారించడం కోసం పుట్టుకతోనే సంక్రమించుకున్న జన్యువులను మార్చుకోలేం కాబట్టి కనీసం జీవనశైలినైనా మార్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. అదెలాగంటే...

- ఏం తింటున్నామో గమనించుకోవాలి. ఆరోగ్యాన్ని అందించే ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి
- వారంలో ఐదు రోజులు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి
- ప్రతి రోజూ వ్యాయామానికి సమయాన్ని కేటాయించలేని వాళ్లు వారం మొత్తంలో రెండు, మూడు విడతల్లో రెండున్నర గంటల వ్యాయామాన్ని పూర్తి చేయాలి
- శరీరాన్ని చురుగ్గా ఉంచే ఏరోబిక్ వ్యాయామం (నడక, క్రీడలు, పరుగు)తో పాటు, బరువులెత్తే వ్యాయామాలు కూడా చేయాలి

నిద్ర అత్యవసరం

ఆరు గంటల నిద్ర ఆరోగ్యానికి అవసరం. నిద్రలేమి వల్ల ఒత్తిడి పెరుగుతుంది. జీవనశైలి దెబ్బతింటుంది. ఈ పరిస్థితి గుండెపోటుకు దారితీస్తుంది. కాబట్టి నిద్ర విషయంలో రాజీ పడకూడదు. అలాగే ఒత్తిడిని కూడా అదుపులో పెట్టుకుంటూ ఉండాలి. కుటుంబసభ్యులు, స్నేహితులతో కాలక్షేపం చేయడం, పని ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం కొన్ని పనులను కింది స్థాయి ఉద్యోగులతో పంచుకోవడం చేయాలి. అలాగే వాస్తవిక అంచనాలతో లక్ష్యాలను ఏర్పరుచుకోవడం అలవాటు చేసుకోవాలి. సాధారణంగా ఒత్తిడిలో ఉన్నప్పుడు, ఒత్తిడిలో ఉన్నాను కాబట్టి వ్యాయామం చేయలేను అనే వాళ్లుంటారు. కానీ నిజానికి వ్యాయామంతో విడుదలయ్యే ఫీల్ గుడ్ హార్మోన్లతో ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించే సాధనంగా వ్యాయామాన్ని ఉపయోగించుకోవాలి. అలాగే తాజా పండ్లు, కూరగాయలు లాంటి ఆరోగ్యకరమైన ఆహారం కూడా ఒత్తిడిని తగ్గిస్తుంది.

పరీక్షలు క్రమం తప్పకుండా...

గుండె పోటుకు దారితీసే ముప్పును ముందుగానే పసిగట్టాలంటే పరీక్షలు చేయించుకోవాలి. 25 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఏడాదికి ఒకసారైనా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఆ పరీక్షల్లో కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహం ముప్పులు కనిపిస్తే, అప్పటి నుంచి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలను కొనసాగిస్తూ ఉండాలి. ముప్పు లేని వాళ్లు ఐదేళ్లకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. 50 ఏళ్లు దాటిన వాళ్లు, మధుమేహం, అధికరక్తపోటు ఉన్న వాళ్లు, ఊబకాయులు, ధూమపానం అలవాటున్నవాళ్లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అలాగే 60 ఏళ్లలోపు గుండె జబ్బుల కుటుంబ చరిత్ర కలిగి ఉన్నవాళ్లు కూడా పాతికేళ్ల వయసు నుంచి, ఏడాదికోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఇలా పరీక్షలు చేయించుకుంటూ ఉండడం వల్ల ముందస్తుగానే ఆరోగ్య సమస్యలను కనిపెట్టగలుగుతాం! గుండెజబ్బులను ప్రారంభ దశల్లోనే గుర్తించగలుగుతాం!

బీజాలు బాల్యంలోనే....

గుండెపోటు బీజాలు బాల్యంలోనే నాటుకుంటాయి. రెండు, మూడేళ్ల వయసు పిల్లల్లో కొలెస్ట్రాల్ నిల్వలు పేరుకుపోవడం మొదలుపెట్టి, వయసు పెరిగేకొద్దీ తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతో ఒరిగే ప్రయోజనాల గురించి వివరించాలి. వీడియోగేమ్స్, ఫోన్లు, టివిల కాలక్షేపానికి బదులుగా ఆరుబయట ఆటలకు పిల్లలను ప్రోత్సహించాలి. ఇలా ఆరోగ్యకరమైన ఆహారాన్నీ, వ్యాయామాన్నీ జీవనశైలిలో భాగం చేయగలిగితే, పెరిగి పెద్దయ్యాక కూడా అదే జీవనశైలిని కొనసాగించగలుగుతారు. ఫలితంగా గుండెపోట్ల ముప్పు నుంచి తప్పించుకోగలుగుతారు.



మద్యం పరిమితంగానే...

మద్యపానం కచ్చితంగా ఆరోగ్యానికి ఎంతో కొంత నష్టం చేకూరుస్తుంది. అయితే ఆ అలవాటున్న వాళ్లు గుండెకు చేటు కలగకుండా ఉండడం కోసం, మద్యాన్ని పరిమితంగా తీసుకోవడం ఉత్తమం. వేర్వేరు మద్యాల్లో ఆల్కహాల్ మోతాదులు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఆల్కహాల్ మోతాదు ఆధారంగా మద్యం పరిమితిని నిర్దేశించుకోవాలి. విస్కీ, రమ్, బ్రాండీల్లో ఆల్కహాల్ మోతాదు 40% మేరకు ఉంటుంది కాబట్టి వీటిని రోజుకు 90 మిల్లీ లీటర్లకే పరిమితం చేయాలి. బీర్ (7% - 9%), వైన్ (20%) లాంటివి వాటిలోని ఆల్కహాల్ మోతాదును బట్టి 180 మిల్లీలీటర్లకు మించకుండా చూసుకోవాలి. మహిళలు దీన్లో సగం మాత్రమే తీసుకోవాలి. అయితే మితిమీరిన మద్యం ప్రమాదకరం అనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

కాఫీ తాగొచ్చా?

అదనపు కాఫీతో ఇనుము శోషణ, ఎముకల సాంద్రతలు తగ్గడంతో పాటు నిద్రలేమి కూడా వేధిస్తుంది. అయితే కొందరికి కాఫీతో ఇంతకు మించిన చేటు కూడా జరుగుతుంది. ఆ కోవకు చెందిన వాళ్లు ఎవరంటే...

- ఆందోళన, నిద్రలేమిలతో బాధపడుతున్న వాళ్లలో కాఫీతో ఆ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. కాబట్టి ఈ సమస్యలున్న వాళ్లు కాఫీని రోజుకు రెండు కప్పులకే పరిమితం చేయాలి
- కాఫీ తాత్కాలికంగా రక్తపోటును పెంచుతుంది. కాబట్టి అధిక రక్తపోటు సమస్య ఉన్నవాళ్లు కాఫీకి దూరంగా ఉండడమే మేలు
- మితిమీరిన కాఫీ, గర్భంలో పెరిగే పిండం ఎదుగుదలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి గర్భిణులు కాఫీ తాగడం తగ్గించడం మంచిది
- హృద్రోగుల్లో కాఫీలోని కెఫీన్ వల్ల గుండె లయలో హెచ్చుతగ్గులు, గుండెదడ లాంటి లక్షణాలు పెరుగుతాయి. కాబట్టి ఈ కోవకు చెందినవారు కాఫీని వీలైనంతగా తగ్గించాలి
- జీర్ణ సమస్యలను ఎదుర్కొంటున్నవాళ్లు కాఫీ జోలికి వెళ్లకపోవడమే మేలు.

ఏ కాఫీ మేలు?



కొందరు బ్లాక్ కాఫీ ఇష్టపడతారు. ఇంకొందరు పాలు, చక్కెర కలిపి తయారుచేసిన కాఫీని ఇష్టంగా తాగుతారు. ఈ రెండింట్లో ఏది ఎక్కువ ఆరోగ్యకరం? బ్లాక్ కాఫీలో క్యాలరీలు తక్కువ, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి బరువు అదుపులో ఉంచుకోవాలనుకునేవారు బ్లాక్ కాఫీని ఎంచుకోవడం మంచిది. పాలతో తయారుచేసిన కాఫీలో క్యాల్షియం, ప్రొటీన్ అదనంగా ఉంటాయి. అలాగే కాఫీ అసిడిటీ నుంచి రక్షణ పొందాలంటే పాలు కలిపిన కాఫీనే ఎంచుకోవాలి. ఉదయం 9:30 నుంచి 11:30 మధ్య కాఫీ తాగాలి. కాఫీ తాగడానికి అనువైన సమయమిది. కార్టిసాల్ హార్మోన్ మోతాదులు తగ్గే ఈ సమయంలో కాఫీతో కొంత శక్తిని పుంజుకోవచ్చు. నిద్రలేమి సమస్య వేధించకుండా ఉండాలంటే మధ్యాహ్నం 3 గంటల నుంచి కాఫీ జోలికి వెళ్లకూడదు.

నడకలో నలతలు



నడిచేటప్పుడు కొన్ని మధుమేహ లక్షణాలు బయల్పడుతూ ఉంటాయి. వాటిని కనిపెట్టి, వెంటనే అప్రమత్తం కాగలిగితే మధుమేహ చికిత్స ఆలస్యమవకుండా ఉంటుంది. ఆ లక్షణాలు ఏవంటే...

- **అరచేతులు, పాదాల్లో తిమ్మిర్లు:** అధిక చక్కెర రక్తప్రసరణను ప్రభావితం చేసి, నాడులను దెబ్బతీస్తుంది. దాంతో అరచేతులు, పాదాల్లో నొప్పి, తిమ్మిర్లు వేధిస్తాయి. దీన్నే న్యూరోపతీ అంటారు. ఈ లక్షణాలతో పాటు సూదులు గుచ్చినట్టు కూడా అనిపించవచ్చు

- **నొప్పులు:** కాళ్లలో నొప్పులు వేధిస్తాయి. ఇది కూడా నాడీ నష్టానికి సూచనే! దీర్ఘకాలికంగా అత్యధిక చక్కెరలను కలిగి ఉన్నప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. కాళ్లలోని రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు కూడా కాళ్ల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కాబట్టి నొప్పులకు కారణాన్ని తెలుసుకోవాలి

- **అలసట:** క్రమం తప్పక నడక అలవాటు ఉన్నప్పటికీ, కొత్తగా అలసట మొదలైనా, కొద్ది దూరానికే ఓపిక నశిస్తున్నా వెంటనే అప్రమత్తం కావాలి. చక్కెర పెరిగినా, తగ్గినా అలసట, నిస్సత్తువలు వేధిస్తాయి. నిరంతరం అలసట వేధిస్తున్నా, సరిపడా విశ్రాంతి తీసుకున్నప్పటికీ నిస్సత్తువగా ఉంటున్నా, శరీరం చక్కెరను సమర్థవంతంగా నిర్వహించడం లేదని అర్థం.

- **పాదాల్లో వాపులు:** నడక ముగించుకున్న తర్వాత పాదాలు, కాలి గిలకలూ వాస్తుంటే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్టు అర్థం చేసుకోవాలి. మధుమేహం మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా శరీరంలో నీటి నిల్వ పెరిగి, పాదాలు, కాలి గిలకల్లో వాపులు మొదలవుతాయి.

వేసవి వెతలు

చమట పొక్కులకు చెక్

వేసవిలో పిల్లలను వేధించే ప్రధాన సమస్య... చమట పొక్కులు. ఈ సమస్య నుంచి పిల్లలకు ఉపశమనం కలగడం కోసం కొన్ని చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే...

శరీరంపై చమట ఆరిపోవడం లేదా, చర్మపు ముడతల్లో చమట, మట్టి పేరుకుపోవడం మూలంగా చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఈ కాలంలో ఇబ్బంది పెడతాయి. సాధారణంగా మామిడి పండ్లు తినడం వల్ల వేడిచేసి సెగ గడ్డలు మొదలయ్యాయని అందరూ అనుకుంటూ ఉంటారు. కానీ సెగ గడ్డలకు కారణం చర్మం మీద చమట ఇంకిపోయి, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, ఇన్‌ఫెక్షన్ తలెత్తడమే!



చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, సెగ గడ్డలు పిల్లలను వేధించకుండా ఉండాలంటే రోజుకు రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి. వీటికి తోడు ఈ అదనపు జాగ్రత్తలు కూడా పాటించాలి.

- **చల్లని వాతావరణం:** చల్లనీటి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గి, ఉపశమనం కలుగుతుంది. అలాగే పిల్లలు గాలి ధారాళంగా చొరబడే వీలున్న చల్లని గదుల్లోనే ఉండాలి
- **దుస్తులు:** తేలికగా, చమటను పీల్చుకునే, గాలి చొరబడే వీలున్న మెత్తని దుస్తులనే పిల్లలకు వేయాలి
- **ఉపశమనం:** పొక్కిన ప్రదేశంలో దురద, మంటలను తొలగించడం కోసం చల్లని తడి వస్త్రాన్ని కప్పి ఉంచవచ్చు. లేదా వస్త్రంలో మంచు ముక్కలను ఉంచి, కాపడం పెట్టుకోవచ్చు
- **ఆయింట్‌మెంట్లు:** జిడ్డుగా ఉండే తైలాలు, ఆయింట్‌మెంట్లు పూయకూడదు
- **గోకకూడదు:** చమట పొక్కులు వచ్చిన ప్రదేశాల్లో దురద సహజం. కాబట్టి పిల్లలు అదే పనిగా గోక్కునే ప్రయత్నం చేస్తారు. దాంతో పుండ్లు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఉపశమనం దక్కడం కోసం ఆయా ప్రదేశాల్లో సున్నితంగా రుద్దాలి
- **ఓట్‌మీల్:** చర్మం మంట తగ్గడం కోసం స్నానం నీళ్లకు ఓట్‌మీల్ జోడించాలి
- **సోడా ఉప్పు:** చర్మరంధ్రాలు తెరుచుకుని, ఇన్‌ఫ్లమేషన్ తగ్గడం కోసం రెండు స్పూన్ల సోడా ఉప్పును స్నానం చేసే నీళ్లలో కలుపుకోవాలి

నియంత్రణ ఇలా...

- **నీళ్లు:** శరీరంలో నీరు తరిగిపోకుండా చూసుకుంటే చమట పొక్కుల సమస్య తలెత్తకుండా ఉంటుంది. కాబట్టి పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో గమనించుకుంటూ ఉండాలి
- **అలసట:** ఎండలో ఎక్కువసేపు ఆడుతూ చమటలు పట్టకుండా చూసుకోవాలి
- **పౌడర్:** అదనపు చమటను పీల్చుకునేలా చమట పట్టే వీలున్న ప్రదేశాల్లో టాల్కమ్ పౌడర్ చల్లాలి. అయితే అవసరానికి మించి పౌడర్ చల్లితే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి చమటపొక్కులు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి పౌడర్‌ను పరిమితంగా వాడుకుంటూ, రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి

వైద్యులను ఎప్పుడు కలవాలి?

- మూడు రోజులు దాటినా చమట పొక్కులు తగ్గనప్పుడు
- చమట పొక్కుల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్నప్పుడు
- చమట పొక్కులు చీము పట్టినప్పుడు
- చమట పొక్కులకు జ్వరం తోడైనప్పుడు

అధ్యయనం

స్లీప్ ఆప్నియా సమస్యతో బాధపడేవారికి పార్కిన్సన్స్ డిసీజ్ ముప్పు పొంచి ఉంటుందనీ, ఈ సమస్యను నిర్ధారించిన రెండేళ్లలోపు సిపాప్ చికిత్స మొదలుపెడితే పార్కిన్సన్స్ జబ్బు నుంచి రక్షణ పొందవచ్చనీ తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ వివరాల్లోకి వెళితే...

నిద్రాభంగంతో పార్కిన్సన్స్



నిద్రలో గొంతులోని కండరాలు రిలాక్స్ అవుతూ, శ్వాస మార్గానికి అడ్డుపడి, శ్వాస పీల్చుకోడానికి వీలుగా తరచూ నిద్ర మెలకువ అవుతూ ఉండే సమస్యే, అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా. ఈ అంతరాయం శరీరంలో ఆక్సిజన్ మోతాదులను తగ్గించి, మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా సిపాప్ థెరపీ అందుబాటులోకొచ్చింది. మాస్క్ ద్వారా గాలి శ్వాసమార్గంలోకి ప్రవహిస్తూ, శ్వాసమార్గాన్ని తెరిచి ఉండే ఈ పరికరం వల్ల నిద్రాభంగం కలగకుండా కంటి నిండా నిద్రపోయే వీలుంటుంది. అయితే స్లీప్ ఆప్నియా సమస్యతో బాధపడేవారు, ఈ సమస్యను సకాలంలో గుర్తించలేక చికిత్సను ఆలస్యం చేస్తూ ఉంటారు. ఫలితంగా దీర్ఘ కాలంలో కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన పార్కిన్సన్స్ రుగ్మత బారిన పడే ప్రమాదం ఉందని తాజా అధ్యయనాల్లో తేలింది. ఇందుకోసం పరిశోధక బృందం, స్లీప్ ఆప్నియాను కలిగిన ఉన్న 15 లక్షల మందికి చెందిన వైద్య నివేదికలను, ఆ సమస్య లేని వ్యక్తుల వైద్య నివేదికలతో సరిపోల్చినప్పుడు, స్లీప్ ఆప్నియాతో బాధపడుతూ సిపాప్ పరికరాన్ని ఉపయోగించని వ్యక్తులు అంతిమంగా పార్కిన్సన్స్ రుగ్మతకు గురవుతున్నట్టు తేలింది.

పరిశోధన



రక్తదానంతో క్యాన్సర్ రక్ష

రక్తదానం ప్రాణదానం అంటారు. రక్తదానం వల్ల ప్రత్యేకించి దాతకు లుకేమియా (రక్త క్యాన్సర్) నుంచి రక్షణ దక్కుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే....

వయసు పైబడేకొద్దీ రక్తాన్ని ఉత్పత్తి చేసే మూల కణాల్లో సహజసిద్ధ ఉత్పరివర్తనాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. వాటిలో కొన్ని ఉత్పరివర్తనాలు లుకేమియా ముప్పును పెంచుతాయి. అయితే క్రమం తప్పకుండా రక్తదానం చేసేవారిలో ఈ ఉత్పరివర్తనాలు క్యాన్సర్‌కు దారి తీయకుండా ఉంటాయని లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ యూనివర్శిటీ పరిశోధకులు కనిపెట్టారు. క్రమం తప్పకుండా రక్తదానం చేసేవారి శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతూ మూల కణాలు మరింత సమర్థంగా మారిపోతూ ఉంటాయనీ, వీరిలో ఆరోగ్యకరమైన, మరింత ప్రభావవంతమైన రక్తకణాలు తయారవుతూ ఉంటాయనీ పరిశోధకులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యంలో రక్తం చిక్కదనం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. చిక్కని రక్తం, రక్త ప్రవాహాన్ని కొంతమేరకు కుంటు పరిచి, అధిక రక్తపోటుకూ, అంతిమంగా గుండెజబ్బులకూ దారి తీస్తుంది. కానీ క్రమం తప్పక రక్తదానం చేసేవారిలో రక్తపోటు స్థిరంగా ఉంటూ, గుండెజబ్బులు, గుండెపోట్ల ముప్పు తగ్గుతుందని కూడా పరిశోధకులు వివరిస్తున్నారు.

బిజినెస్

విజయవాడ ● మంగళవారం 18 మార్చి 2025

ఖజానాకు కాసుల గలగల



ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.21.26 లక్షల కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 13% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (మార్చి 16 నాటికి) ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 13.13 శాతం వృద్ధితో రూ.21.26 లక్షల కోట్లకు చేరాయి. ముందస్తు పన్ను చెల్లింపులు పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు వాయిదాల్లో ముందస్తు పన్ను వసూళ్లు రూ.10.44 లక్షల కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో వసూలైన రూ.9.11 లక్షల కోట్లతో పోలిస్తే 14.62 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 చివరి విడత ముందస్తు పన్ను చెల్లింపుల గడువు శనివారం నాటితో ముగిసింది. ఈ సారి కార్పొరేట్ కంపెనీల ముందస్తు పన్ను చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 12.54 శాతం వృద్ధితో రూ.7.57 లక్షల కోట్లకు, కార్పొరేటేతర ముందస్తు పన్ను చెల్లింపులు 20.47 శాతం వృద్ధితో రూ.2.87 లక్షల కోట్లకు పెరిగాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 208 ప్రకారం.. సంబంధిత ఆర్థిక సంవత్సరానికి రూ.10,000కు పైగా పన్ను చెల్లించాల్సి ఉన్న వ్యక్తులు (వేతనజీవులు సహా) కూడా ముందుస్తుగానే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఆదివారం నాటి (తేదీ 16) వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను సహా మొత్తం కార్పొరేటేతర పన్నుల నికర ఆదాయం 17 శాతం పెరిగి రూ.11.01 లక్షల కోట్లకు చేరింది. కార్పొరేట్ పన్ను నికర రాబడి మాత్రం 7 శాతం వృద్ధితో రూ.9.69 లక్షల కోట్లకు పరిమితమైంది. సెక్యూరిటీ లావాదేవీ పన్నుల నికర ఆదాయం 56 శాతం పెరిగి రూ.53,095 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.4.60 లక్షల కోట్ల రిఫండ్స్ జారీ చేయడం జరిగింది. కాగా, స్థూల పన్ను వసూళ్లు 16.15 శాతం వృద్ధితో రూ.25.86 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.22.37 లక్షల కోట్లు సమకూరవచ్చని కేంద్రం అంచనా.

4.68 లక్షల మంది వార్షికాదాయం రూ.కోటి పైనే..

అందులో 43,000 మంది ఆదాయం రూ.10 కోట్ల పైమాటే..

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖ తాజా డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 28 వరకు 9.11 కోట్ల మంది ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించారు. అందులో 8.56 కోట్ల రిటర్నుల ఈ-వెరిఫికేషన్ పూర్తయిందని.. రూ.3.92 లక్షల కోట్ల రిఫండ్లు జారీ చేయడం జరిగిందని ఐటీ శాఖ తెలిపింది. కాగా, 4.68 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నుల్లో రూ.కోటికి పైగా వార్షికాదాయాన్ని వెల్లడించారు. అందులో 43,004 మంది వార్షిక రాబడి రూ.10 కోట్ల పైమాటే.

వార్షికాదాయం	పన్ను చెల్లింపుదారులు
రూ.1-5 కోట్లు	3,89,380
రూ.5-10 కోట్లు	36,274
రూ.10 కోట్లకు పైగా	43,004
మొత్తం	4,68,658

బంగారం మరో రికార్డు

ఒక్కరోజే రూ.1,300 అప్, తులం రూ.90,750



న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం, వెండి ధరలు సరికొత్త జీవనకాల రికార్డు గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.1,300 పెరుగుదలతో రూ.90,750కి చేరింది. 99.5 స్వచ్ఛత లోహం రేటు సైతం అదే స్థాయిలో పెరిగి రూ.90,350కి చేరుకుంది. పసిడి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. కిలో వెండి కూడా రూ.1,300 పెరుగుదలతో రూ.1,02,500 ధర పలికింది. ట్రంప్ సుంకాల వడ్డన కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వచ్చే సమీక్షలో ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలతో ఇంటర్నేషనల్ మార్కెట్లో వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం. గత శుక్రవారం ట్రేడింగ్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 3,000 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,017 డాలర్లకు ఎగబాకింది. కాగా, మళ్లీ కాస్త తగ్గి 2,995 డాలర్లకు పరిమితమైంది. సిల్వర్ 34.06 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఈ ఏడాదిలో రూ.11,000 అప్ : ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధర రూ.11,360 (14.31 శాతం) పెరిగింది. ఈ జనవరి 1న రూ.79,390 పలికిన తులం బంగారం.. ప్రస్తుతం రూ.90,750కి ఎగబాకింది. వాణిజ్య అనిశ్చితులు మరింత పెరిగితే, మున్ముందు పసిడి మరింత పుంజుకోవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. అదే గనక జరిగితే, దేశీయంగా తులం బంగారం రూ.లక్ష దాటడం ఖాయం.

బజాజ్‌కు అలియాన్జ్ గుడ్‌బై

లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో అలియాన్జ్ వాటాను కొనుగోలు చేయనున్న బజాజ్

న్యూఢిల్లీ: దేశీయ ఆర్థిక సేవల రంగానికి చెందిన బజాజ్ గ్రూప్, జర్మనీ బీమా దిగ్గజం అలియాన్జ్ ఎస్ఈ తమ 24 ఏళ్ల భాగస్వామ్యానికి ముగింపు పలికాయి. ఇరువర్గాలు కలిసి బజాజ్ అలియాన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ(బీఏఎల్ఐసీ), బజాజ్ అలియాన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ(బీఏజీఐసీ) పేరిట రెండు బీమా సంస్థలను నిర్వహిస్తున్నాయి. ఈ రెండింటిలో అలియాన్జ్ ఎస్ఈ కలిగి ఉన్న 26 శాతం చొప్పున వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు బజాజ్ గ్రూప్ సోమవారం వెల్లడించింది. బీఏఎల్ఐసీలోని 26 శాతం వాటాను రూ.10,400 కోట్లకు, బీఏజీఐసీలోని 26 శాతం వాటాను రూ.13,780 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపింది. అంటే, రెండు కంపెనీల్లోని అలియాన్జ్ వాటాలకు బజాజ్ మొత్తం రూ.24,180 కోట్లు చెల్లించనుందన్నమాట. ఈ కొనుగోలు పూర్తయిన అనంతరం రెండు కంపెనీల్లో బజాజ్ 100 శాతం వాటాదారుగా మారనుంది. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సహా పలు నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ ఒప్పందం పూర్తి కానుంది.

నాలుగో నెలా ఎగుమతులు డీలా..

- గతనెలలో రూ.3.21 లక్షల కోట్లకు పరిమితం
- 42 నెలల కనిష్ఠ స్థాయికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: భారత ఎగుమతులు వరుసగా నాలుగో నెలలోనూ క్షీణించాయి. గత నెలలో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన గణనీయంగా తగ్గి 3,691 కోట్ల డాలర్లకు (సుమారు రూ.3.21 లక్షల కోట్లు) పడిపోయాయి. పెట్రోలియం ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులతో పాటు ట్రంప్ సుంకా ల ప్రభావంతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరగడం ఇందుకు కారణం. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ముడిచమురు, విలువైన లోహాల ధరల్లో గణనీయ మార్పుల కారణంగా గతనెలలో భారత్‌లోకి దిగుమతులు సైతం 5,096 కోట్ల డాలర్లకు (రూ.4.43 లక్షల కోట్లు) తగ్గాయి. దాంతో వాణిజ్య లోటు కూడా 1,405 కోట్ల డాలర్లకు (రూ.1.22 లక్షల కోట్లు) పరిమితమైంది. ఇది 42 నెలల (2021 ఆగస్టు తర్వాత) కనిష్ఠ స్థాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరితో గడిచిన 11 నెలల్లో భారత వస్తు, సేవల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 6.24 శాతం వృద్ధితో 75,053 కోట్ల డాలర్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వస్తు, సేవల ఎగుమతులు 70,643 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, వస్తు ఎగుమతులు ఈ జనవరిలో 3,643 కోట్ల డాలర్లు, గత డిసెంబరులో 3,801 కోట్ల డాలర్లు, నవంబరులో 3,211 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.

మారుతి, టాటా వాహన ధరలు పెంపు

న్యూఢిల్లీ: వాహన ధరలు ఏప్రిల్ నుంచి పెంచుతున్నట్లు మారుతి సుజుకీ, టాటా మోటార్స్ ప్రకటించాయి. పెరిగిన ముడిసరకు వ్యయాల భారం కొంతమేరకైనా తగ్గించుకునేందుకు ఈ చర్య తీసుకున్నట్లు రెండు కంపెనీలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. తమ కార్ల ధరలు 4 శాతం మేరకు పెంచుతున్నట్లు మారుతి ప్రకటించగా తమ వాణిజ్య వాహనాల ధరలు 2 శాతం పెంచుతున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది.

స్పైస్‌జెట్‌లో రూ.90 కోట్ల వాటా విక్రయించిన అజయ్ సింగ్

న్యూఢిల్లీ: చౌక విమానయాన సేవల సంస్థ స్పైస్‌జెట్ ప్రమోటర్ అజయ్‌సింగ్ సోమవారంనాడు ఎయిర్‌లైన్స్‌లో 1.62 శాతం వాటాకు సమానమైన దాదాపు 2 కోట్ల షేర్లను రూ.90 కోట్లకు విక్రయించారు. ఓపెన్ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరిగింది. గతవారంలోనూ అజయ్ సింగ్ ఎయిర్‌లైన్స్‌లో దాదాపు ఒక శాతం వాటాను రూ.52 కోట్లకు విక్రయించారు. కాగా, ప్రమోటర్ గ్రూప్ కంపెనీ ద్వారా స్పైస్‌జెట్‌కు రూ.294 కోట్ల మూలధన నిధులు సమకూర్చనున్నట్లు సింగ్ వెల్లడించారు.



మార్కెట్లోకి రూ.4.2 కోట్ల బెంజ్ కారు

ఉదయ్‌పూర్: జర్మనీ లగ్జరీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ తాజాగా మేబాక్ ఎస్ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్ కారును భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 4.0 లీటర్ వీ8 టర్బో ఇంజన్‌తో కూడిన ఈ కారు ధర రూ.4.2 కోట్లు. గరిష్ఠంగా గంటకు 260 కి.మీ వేగంతో ప్రయాణించగలదు. వచ్చే ఏడాది తొలినాళ్లలో ఈ కార్ల డెలివరీ ప్రారంభం కావచ్చని కంపెనీ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	430
వరంగల్	407	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 60	

బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు

341 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ మార్కెట్ ఐదు రోజుల నష్టాలకు తెరదించింది. ప్రపంచ మార్కెట్లలో ఏర్పడిన ర్యాలీకి తోడు బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌ను లాభాల్లో నిలిపింది. ఇంట్రాడేలో 547.44 పాయింట్లు లాభపడి 74,376.35ని తాకిన సెన్సెక్స్ చివరికి 341.04 పాయింట్ల లాభంతో 74,169.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 111.55 పాయింట్ల లాభంతో 22,508.75 వద్ద క్లోజయింది. మార్కెట్లో కన్సాలిడేషన్ కొనసాగుతున్నదని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ పరిశోధనా విభాగం వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 24 పైసలు పుంజుకుని 86.81 వద్ద ముగిసింది.

ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం డౌన్

ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్‌పై దివాలా చర్యలు ప్రారంభించాలంటూ కంపెనీకి ఆపరేషనల్ క్రెడిటర్ అయిన రోజ్‌మెర్టా డిజిటల్ సర్వీసెస్ కంపెనీ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేర్లు 7 శాతం మేరకు నష్టపోయాయి. ఈ షేరు బీఎస్ఈలో 7.18% నష్టంతో రూ.46.91 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 7.22% నష్టంతో రూ.46.86 వద్ద ముగిసింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రరూ.1601.13 కోట్ల మేరకు తగ్గి రూ.20,691.20 కోట్ల వద్ద స్థిరపడింది.

డెట్ ఫండ్ల నుంచి రూ.6525 కోట్లు ఉపసంహరణ

ఫిబ్రవరిలో డెట్ మ్యూచువల్ ఫండ్ల నుంచి ఇన్వెస్టర్లు రూ.6525 కోట్లు ఉపసంహరించారు. స్వల్పకాలిక నిధుల నుంచి ఉపసంహరణలు ఇందుకు దోహదపడ్డాయి. 16 డెట్ ఎంఎఫ్ విభాగాల్లో పదింటిలో నికర ఉపసంహరణలు నమోదయ్యాయని భారత మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (ఆంఫి) తెలియచేసింది. ఫిబ్రవరి చివరి నాటికి డెట్ ఎంఎఫ్‌ల నిర్వహణలోని నిధుల పరిమాణం స్వల్పంగా పెరిగి రూ.17.08 లక్షల కోట్లకు చేరింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	86	విజయవాడ	90
వరంగల్	86	గుంటూరు	92
కరీంనగర్	86	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	86	చిత్తూరు	94
కర్నూలు	86	నెల్లూరు	99
విశాఖపట్నం	84	అనంతపురం	99
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,560 ▼	82,100 ▼	1,11,900 ▼
విజయవాడ	90,700 ▲	86,000 ▲	1,02,500 ▼
విశాఖపట్నం	88,240 ▼	80,890 ▼	1,00,410 ▼
రాజమండ్రి	89,560 ▼	82,100 ▼	1,02,700 ▼
ప్రొద్దుటూరు	88,850 ▼	82,280 ▼	1,00,400 ▼
ముంబై	88,100 ▲	80,700 ▲	99,770 ▲

స్పోర్ట్స్



చాంపియన్స్ ట్రోఫీతో రూ.737 కోట్ల నష్టం

పీసీబీ కుదేలు

లాహోర్: అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు చాంపియన్స్ ట్రోఫీ భారీ నష్టాలను మిగిల్చింది. 29 ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ టోర్నీని నిర్వహించే అవకాశం రావడంతో పాక్ బోర్డు లాహోర్, కరాచీ, రావల్పిండి స్టేడియాలను ఆధునీకరించేందుకు రూ.503 కోట్లు (భారత కరెన్సీలో) ఖర్చు చేసింది. ఇది వారు అంచనా వేసిన బడ్జెట్‌కన్నా 50 శాతం ఎక్కువ కావడం గమనార్హం. అలాగే ఈవెంట్ నిర్వహణ కోసం మరో రూ.347 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇంతా చేస్తే ఐసీసీ నుంచి ఆతిథ్య ఫీజు, టిక్కెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్స్ ద్వారా పీసీబీకి వచ్చింది రూ.52 కోట్లు మాత్రమే. పేరుకే ఆతిథ్య దేశం..కానీ పాక్ జట్టు స్వదేశంలో ఆడింది ఒక్క మ్యాచ్ మాత్రమే. న్యూజిలాండ్‌తో ఆడిన ఆ మ్యాచ్‌లో ఓడింది. భారత్‌తో మ్యాచ్‌ని దుబాయ్‌లో ఆడింది. బంగ్లాతో స్వదేశంలో ఆడాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో మొత్తంగా పాక్ బోర్డు ఈ టోర్నీ నిర్వహణ ద్వారా రూ.737 కోట్ల నష్టాలను చవిచూసింది. ఈ భారీ మొత్తాన్ని పూడ్చుకునేందుకు ఇప్పుడు పీసీబీ పొదుపు చర్యలకు దిగింది. జాతీయ టీ20 చాంపియన్‌షిప్ ఆడే ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రూ.40 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించినట్టు పాక్ మీడియా పేర్కొంది. అంతేకాదు.. స్టార్ హోటళ్లలో కాకుండా ఎకానమీ హోటళ్లలో సర్దుకుపోవాలని ఆటగాళ్లకు చెపినట్టు సమాచారం. అయితే పీసీబీ చైర్మన్ నఖ్వీ సూచనల మేరకు మ్యాచ్ ఫీజును రూ.30 వేలుగా ఖరారు చేయవచ్చని బోర్డు అధికారి ఒకరు తెలిపారు.



ఫామ్‌లోకి వస్తారా..?

- మెరుగైన ప్రదర్శనపై సింధు, సేన్ దృష్టి
- క్వాలిఫయర్స్ బరిలో కిడాంబి

నేటి నుంచి స్విస్ ఓపెన్

బాసెల్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన ఏస్ షట్లర్ పీవీ సింధు, క్వార్టర్స్‌లో వెనుదిరిగిన లక్ష్య సేన్ మళ్లీ బలంగా పుంజుకోవాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే స్విస్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. భారత ప్లేయర్లు ఎక్కువ మంది ఉండడంతో ఆరంభ రౌండ్లలోనే టాప్ షట్లర్లు ఒకరితో ఒకరు పోటీపడాల్సి పరిస్థితి. తొలి రౌండ్‌లో మాళవిక బన్సోడ్‌తో ఏడో సీడ్ సింధు తలపడనుంది. ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత శ్రీ కూడా బరిలో నిలవనున్నారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లోనే హెచ్ఎస్ ప్రణయ్‌తో లక్ష్య సేన్ పోటీపడనున్నాడు. కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, శ్రుతి మిశ్రా-ప్రియ, ఆర్తి సారా-వర్షిణి విశ్వనాథ్ బరిలో నిలవనున్నారు. కాగా, 2015 చాంపియన్ కిడాంబి శ్రీకాంత్‌తోపాటు ఆయుష్ శెట్టి, తరుణ్ మానేపల్లి, సతీష్ కుమార్, శంకర్ ముత్తుస్వామి క్వాలిఫయర్స్ ఆడనున్నారు.



లక్ష్య సేన్

రాజస్థాన్.. కొత్త కొత్తగా

ఐపీఎల్ మరో 4 రోజుల్లో

జట్టులో భారీ మార్పులు.. కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను తీసుకోవడంతో ఈ సీజన్‌లో మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ సరికొత్త జోష్‌తో కనిపిస్తోంది. 2008 ఆరంభ లీగ్‌లో విజేతగా నిలిచిన రాజస్థాన్.. సుదీర్ఘ విరామం తర్వాత 2022లో ఫైనల్‌కు చేరినా కప్‌ను ముద్దాడలేక పోయింది. అయితే, ఈసారి నిలకడైన ప్రదర్శనతో టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో ఉంది. సంజూ శాంసన్ మరోసారి జట్టును నడిపించనుండగా.. ద్రవిడ్ సూచనలు వారికి అదనపు బలం కానున్నాయి. శాంసన్‌తోపాటు యశస్వీ జైస్వాల్, హెట్‌మయర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ కోర్ టీమ్. జోష్ బట్లర్, అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌ను వదిలేసుకొన్న రాయల్స్.. ఆశ్చర్యకర రీతిలో జోఫ్రా ఆర్చర్, నితీశ్ రాణాను వేలంలో కొనుగోలు చేసింది. ఓవరాల్‌గా చూస్తే జట్టులో సమతుల్యం కనిపిస్తోంది. హసరంగ, మహీష్ తీక్షణ స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకొన్నా.. అతడు ఈ సీజన్‌లో ఆడడం కష్టమే. కానీ, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యువరక్తం ఎక్కించడానికి ఫ్రాంచైజీ ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు అర్థమవుతోంది. రాయల్స్ ప్రధాన బలం టాపార్డర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అనుభవం, దూకుడైన ఆటతో జైస్వాల్, సంజూ ఓపెనర్లుగా రాణిస్తుండగా.. రాణా వన్‌డౌన్‌లో ఆడే అవకాశం ఉంది. ఇక, మిడిలార్డర్‌లో పరాగ్, హెట్‌మయర్, జురెల్, శుభమ్ దూబే కీలకం కానున్నారు. గత సీజన్‌లో పరుగుల వరద పారించిన పరాగ్.. మరోసారి అదే తరహా జోరు కొనసాగించాలని ఫ్రాంచైజీ కోరుకొంటోంది. రాజస్థాన్ బౌలింగ్ విభాగం కూడా బలంగా కనిపిస్తోంది. ఆర్చర్, సందీప్ శర్మ, ఫజల్ ఫరూకీ ఏదశలోనైనా వికెట్లు పడగొట్టగల సమర్థులు. అయితే, వీరు డెత్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయలేక పోవడం ఆందోళన కలిగించే అంశం.



రాజస్థాన్ రాయల్స్

బ్యాటర్లు: జైస్వాల్, హెట్‌మయర్, రియాన్ పరాగ్, శుభమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ.
వికెట్ కీపర్లు: శాంసన్ (కెప్టెన్), జురెల్, కునాల్ సింగ్ రాథోడ్;
ఆల్‌రౌండర్లు: రాణా, హసరంగ, యుద్ధ్‌వీర్ సింగ్;
బౌలర్లు: సందీప్ శర్మ, ఆర్చర్, ఫజల్, క్వేనా మఫాక, మహీశ్ తీక్షణ, కుమార్ కార్తికేయ, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్ మధ్వాల్, అశోక్ శర్మ.



బెంగళూరు కల నెరవేరేనా?

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు విరాట్ కోహ్లీ ప్రధాన ఆకర్షణ. బ్యాటింగ్‌లో ఎంతో బలంగా కనిపించే బెంగళూరు గత 17 సీజన్లలో ఒక్కసారి కూడా విజేతగా నిలవలేదు. కప్ మనదే అంటూ దిగడం.. నిరాశగా వెనుదిరగడం షరా మామూలుగా మారింది. అయితే, ఈసారి మాత్రం తలరాతను మార్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గతేడాది వరుస విజయాలతో పేఆఫ్స్‌కు చేరినా.. నాకౌట్‌లో తడబడింది. కాగా, గత సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన డుప్లెసీని వదిలేయడంతో.. ఈసారి అనూహ్యంగా రజత్ పటీదార్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. బ్యాటింగ్‌లో కోహ్లీతో పాటు పటీదార్, ఫిల్ సాల్ట్, దేవ్‌దత్ పడిక్కల్ కీలకం. జితేష్, టిమ్ డేవిడ్ ఫినిషర్ల పాత్ర పోషించనున్నారు. భువనేశ్వర్, హాజెల్‌వుడ్ పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నారు. అయితే, స్పిన్ విభాగం కొంత బలహీనంగా కనిపిస్తోంది. ఆల్‌రౌండర్లు లివింగ్‌స్టోన్, క్రునాల్ పాండ్యాతోపాటు సుయాష్ శర్మ, మోహిత్ రాఠే స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. బెంచ్ బలం పెద్దగా లేకపోవడం కూడా లోటుగానే పరిగణించాలి. గత సీజన్‌లో ఆశలు లేని స్థితి నుంచి ప్లేఆఫ్స్‌కు చేరిన ఆర్‌సీబీ ఈసారి కూడా మెరుగైన ప్రదర్శన చేయాలనుకొంటోంది.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

బ్యాటర్లు: రజత్ పటీదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్, స్వస్తిక్ చికార; **వికెట్ కీపర్లు:** జితేష్ శర్మ, ఫిల్ సాల్ట్; **ఆల్‌రౌండర్లు:** లియామ్ లివింగ్‌స్టోన్, క్రునాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, మనోజ్, జాకబ్ బెథల్; **బౌలర్లు:** భువనేశ్వర్, హాజెల్‌వుడ్, రసిక్ దార్, సుయాష్, నువాన్ తుషార, లుంగీ ఎన్‌గిడి, అభినందన్ సింగ్, మోహిత్ రాఠే, యష్ దయాళ్.



రికార్డులు తిరగరాసిన ఆండ్రీవా

ఇండియన్ వెల్స్ టైటిల్ కైవసం

ఇండియన్ వెల్స్ (యూఎస్): రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా సంచలనం సృష్టించింది. వరల్డ్ నెం:1 అరియానా సబలెంక (బెలారస్)ను 2-6, 6-4, 6-3తో ఓడించి ఇండియన్ వెల్స్ టైటిల్‌ను సొంతం చేసుకొంది. ఈ క్రమంలో 1999లో సెరెనా విలియమ్స్ తర్వాత ఈ టోర్నీ నెగ్గిన పిన్నవయస్కురాలిగా 17 ఏళ్ల ఆండ్రీవా రికార్డులకెక్కింది. అంతేకాకుండా డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో వరల్డ్ నెం:1, 2 ప్లేయర్లను ఓడించిన రెండో అండర్-18 ప్లేయర్‌గా కూడా మిర్రా నిలిచింది. 1999 యూఎస్ ఓపెన్‌లో డావెన్‌పోర్ట్, మార్టినా హింగిస్‌లను సెరెనా ఓడించింది. 2005లో మరియా షరపోవా తర్వాత డబ్ల్యూటీఏ ట్రోఫీ ఫైనల్లో టాప్ ర్యాంకర్‌ను ఓడించిన చిన్న వయసు ప్లేయర్‌గానే కాకుండా.. 1997లో హింగిస్ తర్వాత వరుసగా రెండో డబ్ల్యూటీఏ 1000 టైటిల్ సాధించిన క్రీడాకారిణిగా కూడా ఆండ్రీవా చరిత్ర సృష్టించింది.

వచ్చే ఒలింపిక్స్‌లో బాక్సింగ్ చోటు పదిలం

లాసాన్నె: మూడేళ్ల తర్వాత జరిగే లాస్‌ఏంజెల్స్ (2028) ఒలింపిక్స్‌లో బాక్సింగ్ క్రీడ యథాతథంగా కొనసాగనుంది. ముందుగా 2022లో ప్రకటించిన లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్ ప్రోగ్రామ్‌లో బాక్సింగ్‌ను చేర్చలేదు. అయితే గత నెలలో వరల్డ్ బాక్సింగ్‌కు తాత్కాలిక గుర్తింపు నివ్వడంతో ఇందుకు మార్గం సుగమమైంది. ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించిన ఈ తీర్మానంపై ఈనెల 18-21న జరిగే ఐఓసీ సెషన్‌లో అధికారికంగా తుది నిర్ణయం తీసుకుంటారు. గతంలో పాలనాపరమైన లోపాలు, నిధుల దుర్వినియోగం కారణంగా 2019లో అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)పై ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నిషేధం విధించింది.

ఐపీఎల్ ముచ్చట్లు

దిశా ఆట.. శ్రేయా పాట!

ఆరంభ కార్యక్రమం



కోల్‌కతా: ఐపీఎల్ ఆరంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తోంది. ఈడెన్ గార్డెన్స్‌లో ఈనెల 22న సాయంత్రం 6.30 నుంచి 25 నిమిషాలపాటు ఈ కార్యక్రమం జరుగనుంది. కేకేఆర్-ఆర్‌సీబీ మధ్య జరిగే ప్రారంభ మ్యాచ్‌కు ముందు జరిగే ఈ ఈవెంట్‌లో సుప్రసిద్ధ నేపథ్య గాయని శ్రేయా ఘోశాల్, పంజాబీ పాప్ సింగర్ కరణ్ ఔజ్లా తమ గాన మాధుర్యంలో అలరించేందుకు సిద్ధం కానుండగా, నటి దిశా పటాని డ్యాన్స్‌తో ఉర్రూతలూగించనుంది. అయితే అధికారికంగా బోర్డు ఇంకా ఎవరి పేరునూ ప్రకటించలేదు.

20న కెప్టెన్ల సమావేశం

ఐపీఎల్‌కు చెందిన పది ఫ్రాంచైజీల కెప్టెన్ల సమావేశం ఈనెల 20న ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో జరుగనుంది. లీగ్‌కు సంబంధించి ముఖ్య నిబంధనల గురించి ఇందులో చర్చిస్తారు. అనంతరం ట్రోఫీతో కెప్టెన్ల ఫొటోషూట్ ఉంటుంది. పదిమందిలో ఈసారి అక్షర్ (ఢిల్లీ), పటీదార్ (బెంగళూరు) కొత్త కెప్టెన్లు కానున్నారు.

ఢిల్లీ వైస్‌కెప్టెన్‌గా డుప్లెసీ



ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్ పటేల్‌కు డిప్యూటీగా ఫాఫ్ డుప్లెసీ వ్యవహరించనున్నాడు. 40 ఏళ్ల ఈ దక్షిణాఫ్రికా మాజీ సారథి గత మూడు సీజన్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు కెప్టెన్‌గా కొనసాగాడు. అయితే వేలంలో ఆ జట్టు అతడిని వదిలేయడంతో కనీస ధర రూ. 2 కోట్లకు డీసీ తీసుకుంది.

విశాఖ చేరిన ఢిల్లీ ఆటగాళ్లు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో తాము ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌గా చేసుకున్న అక్షర్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఈనెల 24న సూపర్ జెయింట్స్‌తో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. కులదీప్ యాదవ్, కేఎల్ రాహుల్ మంగళవారం నగరానికి చేరుకోనున్నారు.



విశాఖ చేరిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్-2025

విశాఖపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించడానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ప్రారంభించిన సైక్లోథాన్-2025 సోమవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకుంది. వీరికి ఆర్కే బీచ్‌లో విశాఖపట్నం పోర్టు అధికారులు స్వాగతం పలికారు. సీఐఎస్ఎఫ్ 56వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సైక్లోథాన్‌ని ఈ నెల 7వ తేదీన తమిళనాడు అరక్కోణంలో ప్రారంభించారు. ఇది ఈ నెల 31న కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ముగుస్తుంది.

ఢిల్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల

» 68 వేల కోట్ల కొత్త అప్పులకు కేంద్రం అనుమతి కోసం యత్నాలు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త అప్పులకు అనుమతి కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో కేంద్రం ఇప్పటి వరకు రూ.71 వేల కోట్ల రుణాలకు అనుమతించింది. రాష్ట్రప్రభుత్వం అప్పుల పరిమితిని పూర్తిగా వాడేసింది. ఇప్పుడు కొత్తగా రూ.68 వేల కోట్ల అప్పులకు అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరింది. ప్రతి మంగళవారం ఆర్‌బీఐ నిర్వహించే వేలంలో రాష్ట్రప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి రాష్ట్రాలు అప్పులు తెచ్చుకుంటాయి. వేలం నిర్వహించే మంగళవారానికి ముందు శుక్రవారమే ఆర్‌బీఐకి సమాచారం ఇస్తాయి. కేంద్రం అనుమతిచ్చిన అప్పులను పూర్తిగా తీసుకున్న రాష్ట్రప్రభుత్వం ఆర్‌బీఐకి సమాచారం ఇవ్వలేదు. దీంతో కేంద్రం నుంచి ఎలాగైనా అనుమతి తెచ్చుకుని ఆర్‌బీఐకి తెలియజేసి.. మంగళవారం వేలంలో పాల్గొని అప్పు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

కోకో పంట నాణ్యత పెంచేలా చర్యలు

» ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోకో పంట సాగులో నాణ్యమైన దిగుబడులు వచ్చేలా రైతులను ప్రోత్సహించి, వారికి మంచి ధర లభించేలా చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరులో కోకో రైతు ప్రతినిధులు, ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతేడాది మంచి ధర రావడంతో అధిక కౌలుతో తోటలు తీసుకున్నామని, ప్రస్తుతం కోకో తాజా గింజలు కిలో రూ.600లోపే ధర పలుకుతోందని, ఆఫ్ సీజన్‌లో రూ.250మించడం లేదని రైతులు వాపోయారు. దీనిపై డైరెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది పంట రైతుల వద్ద ఏ మేరకు నిల్వ ఉందో మూడు రోజుల్లో తెలియజేస్తే.. సంబంధిత కంపెనీలతో చర్చిస్తామని చెప్పారు.

రైతులకు సమర్థవంతమైన కిసాన్ డ్రోన్లు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రైతులకు సమర్థవంతమైన కిసాన్ డ్రోన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ రాజశేఖర్ చెప్పారు. కస్టమ్ హైరింగ్ కేంద్రాలకు కిసాన్ డ్రోన్లు సరఫరా చేసేందుకు 17రకాల నమూనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని ఆ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. వీటిలో విద్యుత్ స్తంభాలు, వృక్షాలు, గాలి వేగం వంటి అడ్డంకులను అధిగమించే సమర్థ డ్రోన్లను ఎంపిక చేసి రైతులకు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.



గాజుల్లంక రీచ్‌లో రాత్రి వేళకూడా నదిలోనే ఎక్స్‌కవేటర్‌తో లారీల్లోకి ఇసుక నింపుతున్న చిత్రం



బాపట్ల జిల్లా గాజుల్లంక ఇసుక రీచ్‌లో పట్టపగలే నదిలో భారీ యంత్రాలతో లారీల్లోకి ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

ఆగని ఇసుక దందా

(మొదటి పేజీ తరువాయి)

గుంతలు పడేలా రాత్రీ పగలూ తవ్వకాలు జరుపుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలని కృష్ణా నదీ తీర లంక గ్రామాల ప్రజలు.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొరపెట్టుకున్నా వారి వేదనలు అరణ్య రోదనలే అయ్యాయి. దీనికి కారణం.. ఇసుక రీచ్‌లలో ఉన్నది సామాన్యులు కాదు. దయాదాక్షిణ్యాలు లేని ఆనాటి ఇసుక రాబందులే. ఇటు ప్రభుత్వానికి ఆదాయం రాక.. అటు వినియోగదారుడికి రేట్లు తగ్గింపు లేక అడ్డగోలుగా దోచుకుతింటున్నారు.

మధు ఇన్‌ఫ్రాకాన్‌పై ప్రత్యేక ప్రేమ

'ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడచుకోను.. ఎటువంటి ఉల్లంఘనలు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతానని హామీ ఇస్తున్నా'- ఇసుక తవ్వకం కాంట్రాక్ట్ దక్కించుకోవటానికి కాంట్రాక్టర్ కాగితాల్లో ఇచ్చిన హామీ ఇది. బాపట్ల జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఈ హామీ మేరకు కేవలం నామినేషన్ పద్ధతిపై మధు ఇన్‌ఫ్రాకాన్ అనే సంస్థకు గాజుల్లంక-2 రీచ్‌ను 6 నెలల కాలపరిమితితో అనుమతులిచ్చేసింది. కూలీలతో ఇసుక తవ్వించి ట్రాక్టర్ల సాయంతో డంపింగ్ యార్డ్‌కు తరలించి, తిరిగి దానిని లారీలకు లోడ్ చేయడానికి టన్ను ఇసుకకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.146. ఈ మొత్తంతోనే ఈ పనులన్నీ చేయటం కష్టం. అయితే కాంట్రాక్టర్ అంతకంటే తక్కువ మొత్తానికే తవ్వకం, లోడింగ్ చేస్తానని రూ.115 చొప్పున కోట్ చేశారు. కూలీలు తవ్వాల్సిన స్థానంలో భారీ ఎక్స్‌కవేటర్‌లు పెట్టి మరీ ఇసుకను నేరుగా నదిలోనే లోడ్ చేస్తున్నారు. 10, 12 చక్రాల పెద్ద లారీలను సైతం నదిలోకే దింపి, నదిలో 10 నుంచి 18 అడుగుల లోతులో ఇసుక తవ్వేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి వేసవి రాకముందే తాగు, సాగు నీరుకు ఇక్కట్లు మొదలయ్యాయని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తవ్వకాలు జరిపేలా చూడాలని, లేకుంటే ఆపించాలని ఇటీవల బాపట్ల జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మైనింగ్ శాఖ అధికారులు రీచ్‌ను పరిశీలించారు. తవ్వకాలు తమ పరిధిలో జరగటం లేదని, కృష్ణా జిల్లా పరిధిలో జరుగుతున్నాయని, ఆ జిల్లా అధికారులే జోక్యం చేసుకోవాలంటూ దాటవేత ధోరణిలో వ్యవహరించారు. ఏ రీచ్‌లోనూ సాయంత్రం 6 గంటల తర్వాత నదిలో ఇసుక తవ్వకాలు జరపటానికి వీలులేదు. అయినా ఇక్కడ నిత్యం తవ్వేస్తున్నారు. పగలు కంటే రాత్రే భారీ సంఖ్యలో లారీల్లో లోడ్ చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నప్పుడే...

గత నెల 6నే ఇసుక తవ్వకం అనుమతుల గడువు ముగియడంతో కనీసం 20 రోజుల ముందు టెండర్ ప్రక్రియ పూర్తి కావాలి. అయితే అధికారులు ఫిబ్రవరి 15వ తేదీతో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. గాజుల్లంక-2, ఓలేరు రీచ్‌లకు టెండర్ పిలిచారు. దీనికి 12 రోజుల ముందే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 3 నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో ఉన్న సమయంలో పాతవాటి కొనసాగింపు మినహా కొత్తగా టెండర్‌లు పిలవటం, పనులు అప్పగించటం చేయరాదు. అయితే బాపట్ల జిల్లా స్థాయి ఇసుక కమిటీ పేరుతో ప్రముఖ పత్రికల్లో టెండర్ ప్రకటన వెలువడింది. కానీ టెండర్ రద్దు చేస్తూ, వెంటనే ఆగమేఘాల మీద నామినేషన్ పద్ధతిన గాజుల్లంక-2 రీచ్ అప్పగించేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నామినేషన్ పద్ధతిలో ఆ సంస్థకు రీచ్‌ను అప్పగించినట్టు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర రీచ్‌ల్లో తవ్వకాల కోసం ఇతర సంస్థల నుంచి దరఖాస్తులు వచ్చినా అనుమతి ఇవ్వలేదు. మధు ఇన్‌ఫ్రాకాన్‌కు మాత్రం అనుమతి ఇవ్వడం అనేక అనుమానాలకు తెరతీస్తోంది.

అనుమతి ఒకచోట.. తవ్వకం మరోచోట

విచ్చలవిడి ర్యాంప్‌లతో కరకట్ట దెబ్బతినకుండా ఉండేందుకు నదీ పరివాహక పరిరక్షణ చట్టం ప్రకారం నదిలో ప్రతి రీచ్‌కు మధ్య దూరం కనీసం 5 కిలోమీటర్లు ఉండాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న రీచ్‌కు పక్కనే మరో కొత్త రీచ్ ఇవ్వకుండా, దానికే అదనంగా 1, 2, 3 నంబర్‌లు చేర్చి అనుమతులిచ్చే కొత్త దోపిడీ విధానాన్ని తీసుకొచ్చారు. ఇప్పుడు కూడా అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. గాజుల్లంక-1.. గాజుల్లంక-కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం మధ్య ఉంటుంది. గాజుల్లంక రీచ్-2 పెదలంక అరవింద వారధి సమీపంలో వస్తుంది. టెండర్ నోటిఫికేషన్‌లో ఇచ్చిన జియో కోఆర్డినేట్స్ కూడా పెదలంక దగ్గరే లొకేషన్ చూపిస్తోంది. అయితే అనుమతిచ్చిన గాజుల్లంక రీచ్-2 వద్ద కాకుండా నిన్నటి వరకు తవ్వన గాజుల్లంక-1 రీచ్‌లోనే తవ్వేస్తున్నారు.

ఎవరిదీ మధు ఇన్‌ఫ్రాకాన్?

మధు ఇన్‌ఫ్రాకాన్ సంస్థపై స్థానిక టీడీపీ నాయకులే తీవ్ర విమర్శలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జేపీ వెంచర్స్ తర్వాత జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలు ఇసుక మైనింగ్ అనుమతులు పొందినప్పుడు వారి కింద పనిచేసిన వ్యక్తులే ఇప్పుడు కొత్త అవతారమెత్తి కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతున్నారని మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో కృష్ణారెడ్డి పేరుతో చెలామణి అయిన వ్యక్తే ఇప్పుడు ఈ సంస్థ పేరుతో రంగంలో దిగారని వేమూరు, రేపల్లె నియోజకవర్గాల టీడీపీ నేతలు చెబుతున్నారు. ఆయన అసలు పేరు ప్రణీత్ కృష్ణా అని, మధు ఇన్‌ఫ్రాకాన్‌కు గనుల శాఖ ఇచ్చిన అనుమతి పత్రంలో ఉంది. కూటమి ప్రభుత్వంలోని కొందరు పెద్దలకు భారీ వాటాలు ఆశ చూపి ఇసుక దందాను కొనసాగిస్తున్నారని టీడీపీ నేతలు చెబుతున్నారు. జిల్లా స్థాయి అధికారులకు, నాయకులకు రూ.లక్షల్లో వాటాలున్నాయంటున్నారు.

యంత్రాలతో తవ్వటం లేదు

జిల్లాలో అన్ని ఇసుక రీచ్‌లు మూతపడి ఉండటంతో గాజుల్లంక-2 రీచ్‌ను నామినేషన్ పద్ధతిపై ఇవ్వాల్సి వచ్చింది. యంత్రాలతో తవ్వకాలు కానీ, లారీలు నదిలోకి వెళ్లి లోడ్ చేయటం వంటివి కానీ లేవు. కూలీలతోనే తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు రైతులు, లంక గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో మా అధికారులు పరిశీలించారు. జిల్లా సరిహద్దుల్లో అక్రమ తవ్వకాలు లేవు. పక్కన కృష్ణా జిల్లా సరిహద్దుల్లో జరుగుతున్నాయి. - **రాజేష్, ఏడీ, భూగర్భ గనుల శాఖ, బాపట్ల జిల్లా**

బుగ్గమఠం భూముల ఆక్రమణపై నేడు కలెక్టర్ సమీక్ష

» ప్రభుత్వ చర్యలు ప్రారంభమైనట్లేనా..!

తిరుపతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా పలువురి ఆక్రమణల్లో ఉన్న బుగ్గమఠం భూములపై మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. సమావేశానికి రెవెన్యూ, దేవదాయ శాఖ, బుగ్గమఠం అధికారులు హాజరుకానున్నారు. 'ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకుగానూ బుగ్గమఠం అధికారులు మాజీ మంత్రి పెద్దిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అందులో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది.' ఈ విషయాలన్నీ తెలిసినవే. అయితే... ప్రభుత్వం మారినా బుగ్గమఠం భూములను సర్వే చేయలేని పరిస్థితులు నెలకొన్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. మఠం భూముల రికార్డులతో సమీక్షకు హాజరు కావాలని దేవదాయ శాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్, జిల్లా దేవదాయ శాఖ అధికారి, తిరుపతి ఆర్డీవో, బుగ్గమఠం ఈవో, తిరుపతి అర్బన్ తహసిల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చర్యలు ప్రారంభమయినట్లేనని యంత్రాంగం అనుకుంటోంది.

వేమన వర్సిటీ వీసీ రాజీనామా ఆమోదం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.ప్రకాశ్‌బాబు రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రకాశ్‌బాబును వీసీగా ఇటీవలే నియమించగా, జాతీయ విద్యా సంస్థల్లో అవకాశం రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావును నియమించింది. అలాగే కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలను రాయలసీమ వర్సిటీ వీసీ వి.వెంకట బసవరావుకు అప్పగించింది.

డీవైఈవో పరీక్ష హాల్ టికెట్లు విడుదల

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మెయిన్ పరీక్ష హాల్ టికెట్లు మంగళవారం నుంచి ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 26, 27 తేదీల్లో మెయిన్ పరీక్షలు జరగనున్నాయి. ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో గ్రేడ్-2 ఎనలిస్ట్ మెయిన్ పరీక్ష హాల్ టికెట్లు కూడా నేటి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.

ప్రథమ భాష పరీక్షకు 98.27% హాజరు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రథమ భాష పరీక్షకు 6,27,277 మంది విద్యార్థులకు గాను 6,16,451 (98.27శాతం)మంది హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 3,450 పరీక్ష కేంద్రాల్లో 1,545 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో ఇద్దరు విద్యార్థులు కాపీయింగ్ పాల్పడగా డీబార్ చేసినట్లు తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965



ఆత్మలు అందరికీ ఎందుకు కనిపించవు?

అల్లరి నరేశ్ మరో కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నాని కాసరగడ్డ దర్శకత్వంలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. పొలిమేర, పొలిమేర-2 చిత్రాలతో పేరొందిన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి '12ఏ రైల్వే కాలనీ' అని టైటిల్ పెట్టి టీజర్ రిలీజ్ చేశారు. అల్లరి నరేశ్ ఒక కిటికీ దగ్గర నిలబడి ఆలోచనలో, ధ్యాన ముద్రలో కనిపించడంతో టీజర్ మొదలవుతుంది. వైవా హర్ష వాయిస్ ఓవర్‌లో 'ఆత్మలు అందరికీ ఎందుకు కనపడవు' అని ప్రశ్నిస్తుంది. ఈ చిత్రంలో పొలిమేర సిరీస్ ఫేమ్ డాక్టర్ కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటించారు. సినిమాను ఈ వేసవిలో విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది.





సికందర్ నుంచి చాలా నేర్చుకోవచ్చు

రష్మిక

ఇటీవలె విడుదలైన 'ఛావా' సినిమాతో సూపర్ హిట్ కొట్టారు హీరోయిన్ రష్మిక మందన్న. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ టైటిల్‌రోల్‌లో మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సికందర్'లో హీరోయిన్‌గా నటించారు. రంజాన్ సందర్భంగా సినిమా విడుదలవుతోంది. ఇటీవలె ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'భం భం భోలే'ను విడుదల చేశారు మేకర్స్. తాజాగా, ఈ పాట బీటీఎస్ (బిహైండ్ ద సీన్స్) వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు రష్మిక. ఇందులో సల్మాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సల్మాన్ ఖాన్ ఓ నడిచే లైబ్రరీ లాంటివారని.. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చని తెలిపారు. సెట్‌లో ఆయన ఎనర్జీ లెవెల్స్ అద్భుతంగా ఉంటాయని పేర్కొన్నారు.

అదే పౌరుషం.. అదే రోషం..!



నందమూరి కల్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం లాంచ్ చేశారు. ఐపీఎస్ ఆఫీసర్‌గా విజయశాంతి శక్తిమంతమైన పాత్రను పోషించారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత యాక్షన్ చేశాను. ఎలా చేస్తానో అని యూనిట్‌లో కొంత మంది టెన్షన్ పడ్డారు. చాలా సహజంగా నటించాను. ఇలా చేయగలుగుతానని వాళ్లు ఊహించలేదు. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ విజయశాంతినే. అదే పౌరుషం.. అదే రోషం.. తగ్గేదేలే. ఎంత వయసొచ్చినా ఇంతే స్ట్రాంగ్‌గా ఉంటా' అని అన్నారు. హీరో నందమూరి కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ సినిమా మెయిన్ పిల్లర్ అమ్మ(విజయశాంతి). ఈ వయసులో కూడా ఎలాంటి డూప్ లేకుండా అద్భుతమైన స్టంట్స్ చేశారు. మరో 20 ఏళ్ల పాటు ఈ సినిమా గుర్తుండిపోతుంది' అని అన్నారు. దర్శకుడు ప్రదీప్, నిర్మాత సునీల్ బలుసు, రచయిత శ్రీకాంత్ విస్సా తదితరులు మాట్లాడారు.

ఆది కెరీర్‌ను మలుపు తిప్పుతుంది

ఎంపీ రఘునందన్ రావు



ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా షణ్ముగం సాప్పని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌ను షణ్ముగం సాప్పని, తులసీరామ్ సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మించారు. ఈ నెల 21న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌లోనే ఏదో ప్రత్యేకత ఉంది. సినిమా ఆది కెరీర్‌ను మలుపు తిప్పుతుంది. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ఈ సినిమా అందరి కష్టం. అవికా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. క్లైమాక్స్ అద్భుతంగా వచ్చింది" అని హీరో ఆది చెప్పారు. "ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మంచి కథతో తెరకెక్కిన ఈ సినిమా అందరి మనసులను గెలుచుకుంటుంది" అని దర్శకుడు షణ్ముగ సాప్పని తెలిపారు. "ఈ సినిమాలో ఆది నటనకు అందరూ ఫిదా అవుతారు" అని హీరోయిన్ అవికా గోర్ చెప్పారు.

మా స్కూటర్‌కి అన్నీ తెలుసు

డైరెక్టర్ సుప్రీత్ కృష్ణ



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రల్లో సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మాతలు. ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుప్రీత్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ 'క్రికెట్ యాడ్‌లో ఓ వాహనాన్ని చూసినప్పుడు కలిగిన ఆలోచనే ఈ చిత్రం. వాహనానికి లైఫ్ ఉంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి వచ్చిన కథ ఇది. పిల్లల దగ్గరికి టుక్ టుక్ ఎలా వచ్చింది? ఆ వాహనం వెనుక కథ ఏమిటి అనేది ఆసక్తికరంగా చెప్పాం. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. చిత్తూరు నేపథ్యంలో 90 నుంచి 20వ దశకం మధ్య జరిగే స్టోరీ ఇది. గతం, వర్తమానం, భవిష్యత్ అన్నీ తెలిసిన స్కూటర్ కథ. మనం ఏదైనా ప్రశ్న అడిగితే దానికి తనదైన శైలిలో సమాధానం చెబుతుంది. సినిమాలో కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా బాగా కుదిరాయి' అని తెలిపారు.

వినోదాలు పంచేందుకు సిద్ధం



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 18న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ "వేసవిలో వినోదాలు పంచేందుకు మా చిత్రం సిద్ధమైంది. ఇంటిల్లిపాదీ కడుపుబ్బా నవ్వుకుంటారు" అని చెప్పారు. తనికెళ్ల భరణి, నరేశ్ విజయకృష్ణ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: పీజీ.విందా, సంగీతం: వివేక్‌సాగర్.

ఏం బతుకురా నాది..



రాజ్‌తరుణ్, రాశిసింగ్ జంటగా నటించిన చిత్రం 'పాంచ్ మినార్'. ఈ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను రాజ్ కుడుముల దర్శకత్వంలో మాధవి, ఎమ్ఎస్ఎమ్.రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల చేశారు. 'ఏం బతుకురా నాది.. బయటపడే దారేది, నా ఫేటే ఎట్లా మారేది' అంటూ సాగే ఈ మిడిల్ క్లాస్ యాంథమ్‌ను అనంత్ శ్రీరామ్ రచించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించగా, దినేష్ రుద్ర ఆలపించారు. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీఓపీ: ఆదిత్య జవ్వాది.

విభిన్న తరహా ప్రేమకథ



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ కాన్సెప్ట్స్, అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. విభిన్న తరహా ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలోనే తెలుగు, తమిళ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.

చేనేతలకు చేయూత

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
పవర్‌లూంలకు 500 యూనిట్ల వరకు
రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పవర్‌లూం యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాల వల్ల 93 వేల చేనేత కార్మికుల కుటుంబాలకు, 10,534 పవర్‌లూం యూనిట్లకు లబ్ధి చేకూరనుంది. ఎన్నికల సమయంలో ఈ రెండు హామీలూ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని నెరవేర్చారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సోమవారం అమరావతి సచివాలయంలో 4 గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని అమరావతిలో వివిధ పనులను ఆయా సంస్థలకు అప్పగించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. రాష్ట్ర ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్టం 2025ను ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది.

మరిన్ని మంత్రివర్గ నిర్ణయాలివీ..

- సీఆర్‌డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై సమీక్షించి మంత్రుల బృందం చేసిన సిఫారసులను ఆమోదించడానికి.. అమరావతి భూ కేటాయింపు నియమ, నిబంధనలు-2017 ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవడానికి సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి.
- రాజధాని ప్రాంతంలో.. ఏపీ ట్రాన్స్‌కో 400 కేవీ డీసీలైన్, పీజీసీఐఎల్ 400 కేవీ డీసీ లైన్ల రీరూటింగ్, బ్యాలెన్స్ పనుల కోసం రూ.390.06 కోట్లతో పిలిచిన టెండర్లను 8.99 శాతం ఎక్సెస్‌కు మెస్సర్స్ పీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, కె.రామచంద్రరావు ట్రాన్స్‌మిషన్, ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించేందుకు ఆమోదం. అలాగే రాజధాని ప్రాంతంలో ఎన్10 నుంచి ఎన్13-ఈ1 జంక్షన్ వరకు యూజీ కేబుల్స్ ద్వారా 220 కేవీ లైన్ల రీరూటింగ్, బ్యాలెన్స్ పనులకు రూ.1,082.44 కోట్లతో పిలిచిన టెండర్లను 8.98 శాతం ఎక్సెస్‌కు బెంగళూరుకు చెందిన బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌కు అప్పగించేందుకు అంగీకారం.
- రాజధాని ప్రాంతంలో రూ.834.46 కోట్లతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణం, వరద నీటి కాల్వ, జాతీయరహదారి-16 వరకు ఈ13 రోడ్డు విస్తరణకు ఏకమొత్తంగా రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌తో పరిపాలనా అనుమతి కోసం ఏపీడీసీఎల్ ప్రతిపాదనకు ఆమోదం. రూ.307.59 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, వరదనీటి కాల్వ, పాత జాతీయరహదారి మంగళగిరి వరకు ఈ15 రోడ్డు విస్తరణకు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీతో పరిపాలనా అనుమతికి ఆమోదం
- రాజధాని ప్రాంతంలో రూ.22,607.11 కోట్ల విలువైన 22 పనులకు ఎల్1 బిడ్లను ఆమోదించడానికి సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చే ప్రతిపాదనకు, ఎల్1 బిడ్డర్లకు ఈ పనులను అప్పగించడానికి ఎల్‌వోఏలు జారీ చేసే అధికారం అప్పగించేందుకు ఆమోదం.
- ప్రపంచబ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకుంటున్న అప్పుతో చేపట్టే రూ.15,095.02 కోట్ల విలువైన 37 పనుల ప్యాకేజీకి సంబంధించి ఇటీవల సీఆర్‌డీఏ అథారిటీ తీసుకున్న నిర్ణయం అమలుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారం.
- ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు వద్ద బుడమేరు డైవర్షన్ రెగ్యులేటర్ మెకానికల్, ఎలక్ట్రికల్ వస్తువుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.18 కోట్లు కేటాయించేందుకు నిర్ణయం. బుడమేరు డైవర్షన్ చానల్ 3.840 కిలోమీటరు నుంచి 4.340 కిమీ వరకు కుడి, ఎడమ వరద నివారణ రక్షణ గోడల నిర్మాణానికి అనుమతి.
- వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం. వైఎస్సార్ తాడిగడప పేరులో వైఎస్సార్ తొలగించి.. తాడిగడప మున్సిపాలిటీగా మార్పు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 205 ద్వారా లభించిన అధికారానికి లోబడి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తదుపరి ఖర్చుల కోసం గ్రాంట్లు.. డిమాండ్ల అనుబంధ ప్రకటనకు ఆమోదం.
- గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులో బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీ కింద వాసిరెడ్డి వెంకాద్రి ప్రైవేటు యూనివర్సిటీ స్థాపనకు అనుమతి.
- ఏపీ ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ (2024-29) ప్రకారం స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించడానికి ఐటీఈ, సీ విభాగానికి అనుమతి.
- రాష్ట్రంలో ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసులకు ఆమోదం.
- ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 4,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులను మెస్సర్స్ ఏపీ ఎన్‌జీఈఎల్ హరిత్ అమృత్ లిమిటెడ్ ఏర్పాటు చేయడానికి ఆమోదం.
- అన్నమయ్య, కడప జిల్లాల్లో 1800 మెగావాట్ల ఆఫ్ స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు మెస్సర్స్ ఆస్ట్రా గ్రీన్ ఎనర్జీకి అటవీ పరిరక్షణ నిమిత్తం 350 హెక్టార్ల భూమి కేటాయింపు.
- కొత్త పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, ఇతర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌పీసీతో ఒప్పందాన్ని ఆమోదించాలని జెన్‌కో ఎండీ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.
- గత ఏడాది కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సంభవించిన వరదలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో అత్యవసర ప్రాతిపదికన రూ.63.73 కోట్లతో నామినేషన్ పద్ధతిలో చేపట్టిన పనులకు అనుమతులు.

చేనేతలకు ఉచిత విద్యుత్‌కు 126 కోట్లు

చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు 96.76 కోట్లు. పవర్‌లూమ్ యూనిట్లకు ఉచిత కరెంటుకు 28.16 కోట్లు.. మొత్తంగా రూ.126.92 కోట్లు వ్యయమవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తుంది.

అది వైసీపీ కంపెనీ!
షిర్డీ సాయి సంస్థపై కేబినెట్‌లో ఆసక్తికర చర్చ

షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థకు రామాయపట్నం వద్ద సోలార్ ప్లేట్ల తయారీకి 8,365 ఎకరాలు కేటాయించడంపై కేబినెట్ భేటీలో ఆసక్తికర చర్చ జరిగింది. దీనికి వైసీపీ అనుకూల సంస్థగా పేరుందని, అలాంటి సంస్థకు పెద్ద ఎత్తున భూకేటాయింపులు చేయడం సరికాదని పలువురు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని.. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థల విషయంలో పార్టీలను చూడడం సరికాదని.. నిబంధనల ప్రకారం నడచుకుంటున్నారా.. కేటాయించిన భూమిని నిర్దేశిత అవసరాలకే వినియోగిస్తున్నారా అన్నవే చూడాలని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

వర్గీకరణతో ఎస్సీలకు సువర్ణాధ్యాయం

» సీఎంకు దళిత ఎమ్మెల్యేల ధన్యవాదాలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రి మండలి ఆమోదం తెలపడంపై దళిత ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా దళిత జాతికి సువర్ణ అధ్యాయం ప్రారంభమౌతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపినందుకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును టీడీపీ దళిత ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెస్ రాజు, కొలికపూడి శ్రీనివాస్, బూర్ల రామాంజనేయులు, నెలవల విజయశ్రీ తదితరులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 'ఎస్సీ వర్గీకరణపై మంత్రివర్గ నిర్ణయాన్ని అందరం స్వాగతిస్తున్నాం. భవిష్యత్‌లో దళితుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు మా ఉంటుంది. కూటమి ప్రభుత్వంలోనే ఎస్సీల్లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది' అని ఆనందరావు అన్నారు. '30 ఏళ్ల పోరాటం ఫలించింది. వర్గీకరణపై ఏకసభ్య కమిషన్.. మాలమాదిగ ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను కేబినెట్ ఆమోదించింది. దళితులకు రాజ్యాధికారంలో గౌరవం ఇస్తూ టీడీపీ ముందుకొచ్చింది' అని ఎమ్మెస్ రాజు అన్నారు. 'అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణతో రాష్ట్రంలో అన్ని షెడ్యూల్ కులాలకు సామాజిక న్యాయం జరుగుతుంది' అని కొలికపూడి శ్రీనివాస్ చెప్పారు. చంద్రబాబు విజన్‌తోనే ఎస్సీల అభివృద్ధి సాధ్యమని రామాంజనేయులు చెప్పారు. ఎస్సీ మహిళగా వర్గీకరణను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని నెలవల విజయశ్రీ అన్నారు.



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, సీఎస్ విజయానంద్, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడు

ఎస్సీ వర్గీకరణకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీలను గ్రూప్-1, 2, 3లుగా విభజించింది. గత ఏడాది నవంబరు 15న ఏకసభ్య కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం 2 నెలల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్రంలోని ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఎస్సీ సంఘాలు, మేధావులు, ఉద్యోగుల నుంచి వినతులు తీసుకున్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల నేతలు, ఉద్యోగ సంఘాలతో చర్చించారు. కొన్నిచోట్ల వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు వినతిపత్రాలు అందించారు. ఎస్సీల్లో ఏయే వర్గాలు ప్రభుత్వ ప్రయోజనాలను సమానంగా పొందలేక పోయాయన్న విషయంపై కమిషన్ దృష్టి సారించింది. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించి, ఎస్సీ ఉపకులాల జనాభాపై కూడా దృష్టి పెట్టింది. 2024 జనవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం కులగణన చేపట్టింది. ఆ గణాంకాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. ఎస్సీల్లో ఆయా వర్గాలు ప్రభుత్వ రంగంలో అవకాశాలు పొందలేకపోవడంపై దృష్టి పెట్టింది. ఎస్సీల్లో మాదిగలు ప్రభుత్వ ఉద్యోగాల్లో అతి తక్కువ భాగస్వామ్యం కలిగి ఉన్నారని గుర్తించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా ఉద్యోగాల్లో ఎస్సీల్లోని ఏ ఉపకులం వారు ఎంతమంది ఉన్నారన్న గణాంకాలు తెలుసుకుంది.

అందరి అభిప్రాయాలు తీసుకుని..

గత ఏడాది నవంబరు 7న సచివాలయంలో 23 మంది కూటమి దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతోపాటు ఎన్నికల హామీపై కూడా వారితో చర్చించారు. జనాభా దామాషా పద్ధతిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ అమలు చేస్తామన్నారు. వర్గీకరణ అమలుపై కమిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యేలకు వివరించారు. అప్పటి నుంచి అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకసభ్య కమిషన్‌ను నియమించారు. చంద్రబాబుతో సమావేశానికి ముందే కూటమి దళిత ఎమ్మెల్యేలు సమావేశమై దళితుల సమస్యలను చర్చించారు. టీడీపీ మేనిఫెస్టోలో ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన చేపడతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ ఏ, బీ, సీ, డీలుగా కాకుండా ఏ, బీ, సీలు వర్గీకరించాలని సూచించారు. గత ప్రభుత్వం కూడా కార్పొరేషన్లను మూడు కులాలకు మాత్రమే ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మాదిగ, మాల, రెల్లి, ఇతర వర్గాలుగా విభజించాలని కోరారు. ఎస్సీ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లను 16 నుంచి 18 శాతానికి పెంచాలని ఎమ్మెల్యేలు కోరారు.

నివేదికపై అభ్యంతరాలు ఇవీ...

- ఏకసభ్య కమిషన్.. గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా చేపట్టిన గణనను ప్రాతిపదికగా చేసుకుంది. అయితే, ఆ సర్వే లోపభూయిష్టంగా ఉందన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సదరు సర్వేను పునఃసమీక్షించాలని ఎస్సీ మాల సామాజిక వర్గ నేతలు కోరుతున్నారు.
- గతంలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగ నియామక దరఖాస్తుల్లో ఎస్సీ ఉపకులాలను పేర్కొనలేదని, జాబితాల్లోనూ తప్పులున్నాయని చెబుతున్నారు.
- కొత్తగా పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని కులగణన చేపట్టాలని, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సర్వేను పరిగణనలోకి తీసుకోవద్దని కోరుతున్నారు.
- వైసీపీ హయాం నాటి సర్వే ఆధారంగా నిర్ణయించే వర్గీకరణ.. అన్ని వర్గాలకు న్యాయం చేయదని అంటున్నారు.
- రాష్ట్రంలో 26 జిల్లాలు ఉంటే కమిషన్ ఉమ్మడి 13 జిల్లాల్లోనే పర్యటించిందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ ఉపకులాల నివాసిత ప్రాంతాల్లో కమిషన్ పర్యటించలేదని అంటున్నారు.
- 100 రోజుల్లో నివేదిక అనేది చాలా తక్కువ సమయమని, కేవలం డీఎస్సీలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు హడావుడి చేశారని ఆరోపిస్తున్నారు.
- జస్టిస్ రామచంద్ర కమిషన్‌ను 1996లో నియమిస్తే.. నివేదిక 1997లో ఇచ్చిందని, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్‌ను 2006లో నియమిస్తే 2007లో నివేదిక ఇచ్చారని.. ప్రస్తుత అధ్యయనం అతి తక్కువ సమయంలో పూర్తి చేశారని పేర్కొంటున్నారు.
- ఆయా శాఖలపై అనుభవం లేని రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించడమెందుకని, రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి ఉంటే బాగుండేదని చెబుతున్నారు.


తెలంగాణలో బీసీ బిల్లులకు జై!
అసెంబ్లీకి చేరిన ఎస్సీ వర్గీకరణ

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. తొలుత.. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ (స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం అమలవుతున్న 29 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బిల్లులో స్పష్టం చేసింది. కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు తదితర పదవులన్నిటిలోనూ బీసీలకు 42 శాతం కోటా ఉండాలని పొందుపర్చింది. ఇక, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం శుభం కార్డు వేయనుంది. రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు 'తెలంగాణ షెడ్యూల్డు కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు-2025'ను మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై మంగళవారం చర్చించి.. ఆమోదం తెలపనున్నారు. బిల్లును సభ లో ప్రవేశ పెట్టిన సందర్భంగా వర్గీకరణ ఆవశ్యకతను అందులో పేర్కొంది. దీనిని రాజ్యాంగంలోని 200వ ఆర్టికల్ కింద గవర్నర్ ఆమోదానికి పంపనున్నట్టు తెలిపింది.

వర్గీకరణకు బాబే ఆద్యుడు

» 1997లోనే ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి అమలు చేసిన బాబు
» 24,500 మంది ఎస్సీలకు లబ్ధి
» చంద్రబాబు పాలనాకాలంలోనే దళిత నేతలకు సముచిత స్థానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఎస్సీ సామాజిక వర్గాల్లో అసమానతలు లేకుండా ఆయా వర్గాల్లో మరింత వెనుకబడిన వారికి న్యాయం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని భావించి ఆ దిశగా తొలి అడుగులు వేసిన నాయకుడు చంద్రబాబు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన మాదిగల ఉద్యమాన్ని ఆదరించి ఎస్సీ వర్గీకరణకు మొట్టమొదట మద్దతు ఇచ్చింది కూడా చంద్రబాబే. 2014-19లో మాదిగలకు అన్యాయం జరగకూడదని భావించి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాభా దామాషా ప్రాతిపదికన అందించి వర్గీకరణ స్ఫూర్తిని పరిరక్షించారు. ఎస్సీ సామాజిక వర్గాలకు ఆది నుంచి టీడీపీ అండగా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో నాడు దళితుల పట్ల వివక్షను నిర్మూలించేందుకు అప్పటి సీఎంగా చంద్రబాబు జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించారు. రెండు గ్లాసుల సిద్ధాంతానికీ ముగింపు పలికారు. దళితుల్లో మాల కులానికి చెందిన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతిని శాసనసభకు స్పీకర్‌గా చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కింది.

గతంలోనే..

స్వాతంత్ర్య ఫలాలు జనాభా ప్రాతిపదికన అందరికీ సమానంగా లభించి పేదరికం నిర్మూలించాలన్న ఉద్దేశంతో 1997, జూన్ 6న సీఎం చంద్రబాబు నేతృత్వంలోని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1999, నవంబరు 30న రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో వర్గీకరణ అమల్లోకి వచ్చింది. 2000 నుంచి 2004 మధ్య వర్గీకరణ అమలు చేయగా నాలుగేళ్లలో మాదిగలకు, ఉపకులాలకు 24,500 ఉద్యోగాలు లభించాయి. ఇదే కొనసాగిఉంటే సమన్యాయం లభించేది. వర్గీకరణపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో వర్గీకరణ చేసే అధికారం పార్లమెంటుకే ఉందని పేర్కొంటూ 2004, నవంబరు 5న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ కోసం ఉషా మెహ్రా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ నివేదిక.. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగ ఉపకులాలకు సముచిత స్థానం లభించలేదని తేల్చింది. వర్గీకరణ అమలైన 2000-2004 మధ్య మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొంది. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లుపెట్టి రాజ్యాంగ సవరణ చేయాలని 2012, అక్టోబరు 10న ప్రధాన మంత్రికి టీడీపీ లేఖ రాసింది. గత ఏడాది ఆగస్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

ఇప్పుడు సైతం!

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై సిఫారసులను అందించడానికి గత ఏడాది నవంబరు 15, 2024న సాంఘిక సంక్షేమశాఖ జీవో 86 విడుదల చేసింది. ఏకసభ్య కమిషన్ గత ఏడాది నవంబరు 27న బాధ్యతలు చేపట్టింది. కమిషన్ మొత్తం 3,820 వినతులను స్వీకరించింది. 2011 జనాభా లెక్కల జాబితాతోపాటు, వివిధ అధ్యయనాల అనంతరం.. ఈ నెల 10న కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.



అల్పాహార విందుకు హాజరైన ఎంపీలకు నమస్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఎంపీలకు రాష్ట్రపతి అల్పాహార విందు

» హాజరైన టీడీపీ, బీజేపీ, జనసేన ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎంపీలకు సోమవారం అల్పాహార విందు ఇచ్చారు. స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మనోహర్ లాల్ ఖట్టర్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్పాహార విందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, హరియాణాకు చెందిన ఎంపీలను రాష్ట్రపతి ఆహ్వానించారు. విందు సందర్భంగా ఎంపీలను పలకరించిన రాష్ట్రపతి వారి పార్లమెంట్ నియోజకవర్గ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, పుట్టా మహేశ్, టి కృష్ణప్రసాద్, బైరెడ్డి శబరి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంబికా లక్ష్మీనారాయణ, శ్రీభరత్, కేశినేని చిన్ని, జీఎం హరీష్, బీజేపీ ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేశ్, జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కూచిపూడి'ని యునెస్కో వారసత్వ ప్రదేశంగా తీర్చిదిద్దండి: పురందేశ్వరి

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శాస్త్రీయ నృత్యరూపకం కూచిపూడి పుట్టినిల్లైన ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి గ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో మాట్లాడిన ఆమె.. కూచిపూడి గ్రామంలో ప్రస్తుతం తగిన మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. ఇక్కడ అత్యాధునిక ప్రదర్శన కళా కేంద్రాలు, మ్యూజియం, రికార్డింగ్ స్టూడియోలు, సందర్శకులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆలయాలకు స్వతంత్రత మా దృష్టికి రాలేదు

» లోక్‌సభలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలతో సహా 3,698 చారిత్రక కట్టడాలు, పురాతన నిర్మాణాలను జాతీయ ప్రాధాన్యం కలిగిన వాటిగా వర్గీకరించామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. హిందూ ఆలయాలపై ప్రభుత్వాల నియంత్రణ, ఆలయాలకు స్వతంత్రత కోరుతూ మత సంస్థల నుంచి డిమాండ్లు ఏమైనా వచ్చాయా? అని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సోమవారం లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.అలాంటి డిమాండ్ ఏదీ తమదృష్టికి రాలేదని చెప్పారు.

ఏపీ ఆర్థిక వృద్ధిలో అమరావతి రైల్వే లైన్ కీలకం

» లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా చిన్ని మాట్లాడారు. విజయవాడ సమీపంలో మల్టీ-మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. ఏపీ రాజధానిని ప్రధాన నగరాలు, ఓడరేవులతో అనుసంధానించడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడంలో అమరావతి రైల్వే లైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విజయవాడలోని గుణదల-బెజవాడ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వంతో జాయింట్ సర్వే పూర్తయిందన్నారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉందని, దాన్ని వెంటనే ఆమోదించాలని కేశినేని చిన్ని కోరారు.

ఏపీకి బాసటగా గేట్స్ ఫౌండేషన్

ఐదు కీలక రంగాల్లో సహకారం

» రేపు ఢిల్లీలో బిల్ గేట్స్, చంద్రబాబు సమక్షంలో ఎంఓయూలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విశ్వవ్యాప్తంగా కొత్త శకానికి నాందిపలికిన బిల్ గేట్స్.. ఇప్పుడు కృత్రిమ మేధతో కీలకరంగాల్లో ప్రభుత్వాలకు సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. గేట్స్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్యం, విద్య, డిజిటల్ పాలన, వ్యవసాయం, ఏఐ టెక్నాలజీతో ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యం వంటి రంగాల్లో ప్రభుత్వాలకు తామందించే సహకారాన్ని గురించి వివరించేందుకు బిల్ గేట్స్ న్యూఢిల్లీకి వస్తున్నారు. ఈ సమాచారాన్ని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేశారు. గేట్స్ ఫౌండేషన్ సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ సీఎం చంద్రబాబు కూడా తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. దీంతో.. ఐదు కీలక రంగాల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారాన్ని తీసుకునేందుకు ఢిల్లీలో బుధవారం బిల్ గేట్స్, చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను చేసుకోనుంది. ఈ ఒప్పందాల ద్వారా ఆరోగ్యం, విద్యారంగం, పరిపాలన, వ్యవసాయం, ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం అందించనుంది. వీటితో పాటు మరిన్ని అంశాల్లోనూ, కీలక రంగాల్లోనూ సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఫౌండేషన్ పేర్కొంది.

హెల్త్ కేర్: డిజిటల్ హెల్త్ కమాండ్ అండ్ కో ఆర్డినేషన్ సెంటర్ ద్వారా కేంద్రీకృత, సమీకృత హెల్త్ డేటా ప్లాట్‌ఫాంను, కృత్రిమమేధ ఆధారిత చికిత్సలను, సమర్థవంతమైన వ్యక్తిగత ఆరోగ్య చరిత్రను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) ద్వారా అందిస్తారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ ఇప్పటిదాకా సేకరించిన వ్యక్తిగత ఆరోగ్య డేటాతో క్రోడీకరిస్తారు. డిజిటల్ అమలు వ్యూహాలను వినియోగిస్తారు. ఏపీ మెడ్‌టెక్ జోన్‌తో కలసి టెలీ మెడిసిన్ వేదికలను మరింత సమర్థవంతంగా అందించేందుకు బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకరిస్తుంది. ఇందుకు అవసరమయ్యే సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. క్షయవ్యాధి వంటివాటి నివారణకు ప్రత్యేక సాంకేతిక, వైద్య సహకారాన్ని ఫౌండేషన్ సమకూరుస్తుంది.


విద్యారంగం: నేర్చుకునే తత్వాన్ని, పాఠ్యాంశాల్లో కుతూహలాన్ని విద్యార్థుల్లో పెంచేలా సాంకేతికపరమైన సహకారాన్ని అందించేందుకు బిల్ గేట్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. రాష్ట్రానికి సంబంధించి అత్యున్నత విద్యావిధానాలు, బోధనాంశాలను కృత్రిమ మేధ సహకారంతో బిల్ గేట్స్ ఫౌండేషన్ అందిస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో విద్యను నేర్చుకునే విధానాలు, బోధనా అంశాలను సమకూర్చుతుంది.

పరిపాలన: రాష్ట్ర వ్యాప్తంగా డేటా లేక్ అభివృద్ధి కోసం సాంకేతిక సహకారాన్ని బిల్ గేట్స్ ఫౌండేషన్ అందిస్తుంది. రాష్ట్రంలో కుటుంబాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వ సంక్షేమాన్ని అందించే అత్యాధునిక విధానాలు అమలు చేస్తుంది.



వ్యవసాయం, గ్రామీణ జీవన వైవిధ్యం: వ్యవసాయం, గ్రామీణ జీవన వైవిధ్యంలోనూ బిల్‌గేట్స్ ఫౌండేషన్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. వ్యవసాయంలో డిజిటల్ విధానాలు, కృత్రిమ మేధ సహకారాన్ని అందిస్తుంది. సాంకేతిక నైపుణ్యాలపై రైతులు అవగాహన పెంచుకుని వ్యవసాయంలో అభివృద్ధిని సాధించేలా చూస్తుంది. అత్యధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతులను సూచిస్తుంది. ఉపగ్రహ ఆధారిత వ్యవసాయ విధానాల కోసం ఏపీ స్పేస్ అప్లికేషన్స్ శాటిలైట్ సిస్టమ్స్‌ను ప్రారంభిస్తామని బిల్‌గేట్స్ ఫౌండేషన్ వెల్లడించింది.

ఉద్యోగ కల్పన.. ఏఐ టెక్నాలజీ: మెరుగైన సేవలు అందించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించేలా ప్రభుత్వ ఉద్యోగులకు బిల్ గేట్స్ ఫౌండేషన్ అవగాహన కల్పిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది.



అధ్యక్షా... సభలో నెట్ బ్యాండ్ విడ్త్ బాలేదు: చంద్రబాబు

» సీఎంగారూ... ఇది మీరిచ్చిన నెట్‌వర్కే: రఘురామరాజు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఇంటర్నెట్ పనితీరుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మధ్య ఆసక్తికరమైన సంవాదం నడిచింది. సోమవారం 'విజన్-2047'పై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉండడంతో సమస్యలు తలెత్తాయి. దీనిపై సీఎం స్పందిస్తూ 'అధ్యక్షా! సభలో ఇంటర్నెట్ బ్యాండ్ విడ్త్ బాలేదు' అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ... 'ఇది మీరిచ్చిన నెట్‌వర్కే... ఆ సెక్యూర్డ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఉంది కాబట్టి మీ ప్రజెంటేషన్ సందర్భంగా అంతరాయం ఏర్పడింది. ఇది మావల్ల జరగలేదు' అన్నారు. దీంతో సీఎం నవ్వి ఊరుకున్నారు.

ఐటీలో సంచలనాలు చూస్తారు

» శాసన మండలిలో ప్రకటించిన మంత్రి లోకేశ్

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనలో పలు ప్రతిష్ఠాత్మక ఐటీ కంపెనీల ప్రతినిధులతో చర్చించాం, వారంతా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించారు.. అని విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాబోయే రోజుల్లో ఐటీలో సంచలన నిర్ణయాలు చూస్తారని అన్నారు. ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన భూములు, కంపెనీల వివరాలు, ఉద్యోగ నియామకాలపై మండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానం చెప్పారు. రాష్ట్రంలో విశాఖపట్నంలో ఐటీ పార్కుల్లో ఏపీఐఐసీ ద్వారా 54 కంపెనీలకు 295.68 ఎకరాలు కేటాయించామన్నారు. నిబంధనలకు అనుగుణంగా భూముల కేటాయింపు, వినియోగం ఉంటాయన్నారు. టాప్-100 డెవలపర్స్, ఐటీ కంపెనీలు, బీపీవోస్‌తో సంప్రదింపులు చేస్తున్నామని, ఫార్చ్యూన్-2500 కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. 'జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఐటీ రంగం తిరోగమనంలో ఉంది. పీపీఏలను రద్దు చేశారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఒక ఫార్చ్యూన్-500 కంపెనీ యజమానిపై వైసీపీ ఎంపీలు పార్లమెంట్ సాక్షిగా ఆరోపణలు చేశారు. దీంతో ఆ కంపెనీ ఇబ్బందిపడి, వైజాగ్ వదిలిపోయింది. ఇప్పుడు 54 కంపెనీల్లో 41 కంపెనీలు కార్యాకలాపాలు కొనసాగిస్తున్నాయి. 11,496 మంది పని చేస్తున్నారని లోకేశ్ చెప్పారు.

ప్రైవేట్ యూనివర్శిటీల చట్టాన్ని సమీక్షిస్తాం


ప్రైవేటు యూనివర్శిటీస్ యాక్ట్‌ను సవరించాల్సి ఉందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ప్రస్తుత చట్టం యూజీసీ రెగ్యులైజేషన్స్‌కు విరుద్ధంగా ఉందన్నారు. దీనివల్ల మనకు ప్రైవేటు యూనివర్శిటీలు రావడం లేదన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు యూనిఫైడ్ యాక్ట్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. టోని బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి గుడ్ గవర్నెన్స్ కోసం ప్రపంచస్థాయి శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందన్నారు. ఏఐ హ్యూమనాయిడ్స్, డీప్ టెక్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలో డీప్ టెక్ సంస్థను నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలో ఏఐ యూనివర్శిటీని నెలకొల్పుతామన్నారు.

ఫీజు బకాయిలన్నీ చెల్లిస్తాం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రులు లోకేశ్, డోలా బాల వీరాంజనేయస్వామి సమాధానం ఇచ్చారు. వైసీపీ హయాంలో రూ.4,200 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. 2019లో ఆనాటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను 16 నెలల తర్వాత వైసీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలే అయ్యిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ కచ్చితంగా చెల్లిస్తామని లోకేశ్ చెప్పారు. ఐదేళ్లు అధికారంలో ఉండి విద్యార్థులకు బకాయిలు పెట్టిన వాళ్లే ధర్నాలు చేయడం విడ్డూరమని మంత్రి డోలా అన్నారు.

నియోజకవర్గానికో విజన్ ప్లాన్

"ప్రజలే పెట్టుబడి అనేది మన నినాదం. మనం ప్రజలకు రోజుకో చేపను ఇస్తూ, ఒకరోజు ఇవ్వడం ఆపేస్తే ఏం చేయలేకుండా మిగిలిపోతారు. అందువల్ల వారికి చేపలు ఎలా పట్టాలో నేర్పించాలి. ఇందుకోసమే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ (పీ-4) విధానం తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో 35లక్షల మంది పేదలున్నారు. తొలి విడతలో 20లక్షల మందిని రెండో విడతలో 15లక్షల మందిని పేదరికం నుంచి దూరం చేస్తాం. వారిని ఎవరైనా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తే ఏటా ఉగాది రోజున అవార్డులిస్తాం."



(మొదటి పేజీ తరువాయి)

స్వర్ణాంధ్ర-2047లో నిర్దేశించాం. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా కొంత వ్యత్యాసం ఉంటుంది. కానీ రాష్ట్రస్థాయిలో విజన్ ప్లాన్ లక్ష్యాలు చేరుకోవాలి" అని ఆకాంక్షించారు. ఒకప్పుడు యూదు జాతి గొప్ప జాతిగా ఉండేదని, 2047 నాటికి ఆ స్థానంలో తెలుగు జాతి ఉంటుందని ఆకాంక్షించారు. ఇప్పటికే కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ ప్రణాళికలు తయారయ్యాయని తెలిపారు. "ఇకపై ప్రతి నియోజకవర్గానికీ అక్కడి అవసరాలు, భౌగోళిక, సామాజిక అంశాల ఆధారంగా విజన్ ప్లాన్ తయారు చేస్తాం. నియోజకవర్గ పర్యవేక్షణకు నియోజకవర్గ ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉంటారు. ఒక స్పెషల్ ఆఫీసర్, ఐదుగురు సచివాలయాల ఉద్యోగులు, ఒక యంగ్ ప్రొఫెషనల్ అందులో ఉంటారు. జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ప్రతి మూడు నెలలకు పురోగతిని సమీక్షిస్తాం. వచ్చే కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్లాన్‌లు ఆవిష్కరిస్తాం." అని చంద్రబాబు తెలిపారు. పీ-4 కార్యక్రమాన్ని ఉగాదికి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించాలని సూచించారు. ఇంకా ఏమన్నారంటే..

రూ.55 లక్షల తలసరి ఆదాయం లక్ష్యం

"నియోజకవర్గ స్థాయి విజన్ ప్లాన్ అమలుకు, పేదరిక నిర్మూలనకు ఎమ్మెల్యేలదే బాధ్యత. మీ నియోజకవర్గాల్లో ఉన్న అవసరాలకు అనుగుణంగా దీనిని అమలు చేయండి. నా నియోజకవర్గాన్ని చూసుకుంటూనే, రాష్ట్ర స్థాయిలో లక్ష్యాలు చూసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.2,98,058. అది వచ్చే ఏడాదికి రూ.3,47,871, 2028-29 నాటికి రూ.5,42,985కు చేరాలి. 2047 నాటికి అది రూ.54,60,748 కావడం మన లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్ర జీఎస్‌డీపీ 15.93 లక్షలు ఉండగా, 2047 నాటికి రూ.308 లక్షల కోట్లు కావాలి. ఇకపై వృద్ధి రేటు 15శాతం కావాలి. 2014-19 మధ్య వృద్ధి రేటు 13.5 శాతంగా ఉంది. అది 1.5శాతం పెరగాలి. అయితే రానున్న ఆర్థిక సంవత్సరంలో 17 శాతం వృద్ధి రేటు అవసరం."

అసాధ్యం అనుకోకూడదు

"చాలా మంది ఇవి సాధ్యమా అనుకుంటారు. కానీ అసాధ్యమైన లక్ష్యాలతోనే ముందుకు సాగాలి. ప్రస్తుతం రాష్ట్ర జనాభా 5.3కోట్లుగా ఉంది. 2047 నాటికి 5.8కోట్లకు పెరగాలి. అక్షరాస్యత రేటు 72శాతం నుంచి వంద శాతం కావాలి. మనుషుల జీవితకాలం 70.6 ఏళ్ల నుంచి 85 ఏళ్లకు పెరగాలి. పనిచేసే మహిళల శాతం 45.8 శాతం నుంచి 80 శాతం దాటాలి. ప్రస్తుతం రాష్ట్రంలో పట్టణ జనాభా 36 శాతంగా మాత్రమే ఉంది. అది 60శాతం కావాలి. నిరుద్యోగిత రేటు 4.1శాతం నుంచి 2లోపునకు చేరాలి. ఎగుమతుల విలువ రూ.1.68లక్షల కోట్ల నుంచి రూ.39.12లక్షల కోట్లకు పెరగాలి."

లక్ష్యసాధనకు పది సూత్రాలు

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు పది సూత్రాలు ప్రతిపాదిస్తున్నాం. పేదరిక రహిత రాష్ట్రం, జనాభా నిర్వహణ, నైపుణ్య శిక్షణ-ఉపాధి, నీటి భద్రత, వ్యవసాయంలో టెక్నాలజీ తదితర అంశాల ఇందులో ప్రధానంగా ఉన్నాయి. వీటి అమలు కోసం జిల్లా, నియోజకవర్గంతో పాటు మండలం, మున్సిపాలిటీ స్థాయిల్లోనూ విజన్ ప్లాన్ అమలుచేస్తాం. అనంతరం పంచాయతీలు, వార్డులకు స్థానికంగా ప్లాన్‌లు రూపొందించుకుంటారు."

చంద్రబాబుతో పవన్ భేటీ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం మంత్రి మండలి భేటీ అనంతరం సుమారు అరగంటపాటు వీరిద్దరూ సీఎం చాంబర్‌లో సమావేశమయ్యారు. పవన్ సోదరుడు నాగబాబును మంత్రిమండలిలోకి తీసుకునే అంశంతో పాటు పిఠాపురం జయకేతనం సభలో తన ప్రసంగంపైనా, నాగబాబు వ్యాఖ్యలపైనా సామాజికమాధ్యమాల్లో చెలరేగుతున్న దుమారంవీరి భేటీలో చర్చకు వచ్చినట్లు సమాచారం.

నా ఓటమికి నేనే కారణం

» 2004,2019 ఓటమిపై చంద్రబాబు వ్యాఖ్యలు

"నా ఓటమికి నేను కారణం. నన్ను ఎవరూ ఓడించలేరు. ఎప్పుడూ పని పని పని అని పరిగెత్తుతూ ఉండేవాడిని. అందులో మునిగిపోయి ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయంలో అప్పట్లో కొంత అంతరం వచ్చింది. ప్రతి పనిలోనూ ప్రజల్ని భాగస్వామ్యం చేస్తే ఎప్పుడూ గెలుపు మనతోనే ఉంటుంది. ప్రజలు కూడా ఒక్కోసారి తాత్కాలికమైన వాటికోసం చూస్తే ఇబ్బంది పడే పరిస్థితులు వస్తాయి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని ఇంతలా అభివృద్ధి చేసినా 2004, 2019లో ఓడిపోవడానికి కారణాలు ఏంటని సోమవారం అసెంబ్లీలో తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు చంద్రబాబు ఇలా స్పందించారు.

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు

"వచ్చే ఐదేళ్లలో ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ఉండటం లక్ష్యం. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తాం. ఒకప్పుడు ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యులు దాటితే రేషన్ బియ్యం ఐదుగురికే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. అందుకే కుటుంబంలో ఎంత మంది ఉన్నా పరిమితి లేకుండా బియ్యం ఇస్తాం. అలాగే ఎక్కువ మంది సభ్యులుండే కుటుంబాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆలోచన చేస్తున్నాం."

భాషపై రాజకీయాలు

"భాషను ద్వేషించకూడదు. మనది తెలుగు. జాతీయ భాష హిందీ. అంతర్జాతీయ భాష ఇంగ్లీష్ నేర్చుకుంటున్నాం. అవసరమైతే జపనీస్, జర్మన్ కూడా మన పిల్లలకు నేర్పిస్తాం. భాషపై లేనిపోని రాజకీయాలు వద్దు. విద్యార్థులకు యునిక్ స్కిల్ పాస్‌పోర్టులు ఇస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం."

భూగర్భ జలాలు పెరగాలి

"కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులో నీటి సమస్య ఉంది. కానీ ఏపీలో ఏటా గోదావరి నుంచి రెండువేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా వెళ్తున్నాయి. అందుకే వాటిని వినియోగించుకునేందుకు పోలవరం-బనకచర్ల, పోలవరం-వంశధార పేరుతో నదుల అనుసంధానం చేస్తున్నాం. పీ-4కు డ్యాష్‌బోర్డు తయారుచేసి ప్రతి నియోజకవర్గంలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటాం. మే నెలలో తల్లికి వందనం, ఆ తర్వాత రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తాం." అని చంద్రబాబు అన్నారు.





ల్యాండ్, శాండ్, మైన్, వైన్
అన్నింటా స్కాములే!

» గత ప్రభుత్వ కుంభకోణాలపై విచారణ చేయిస్తాం

» శాసన మండలిలో మంత్రులు అనగాని, కొల్లు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో ల్యాండ్, శాండ్, మైన్స్, వైన్.. ఇలా అన్ని రంగాల్లోనూ అవినీతే. వైసీపీ నేతలు చేసిన ప్రతి స్కాంపై దర్యాప్తు చేయిస్తాం. అవినీతిని నిగ్గు తేలుస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర సోమవారం శాసన మండలిలో ప్రకటించారు. వైసీపీ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై మండలిలో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి అనగాని సమాధానమిచ్చారు. 'సీఎం జగన్ రెడ్డి రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. పురాణాల్లో ఒక్క బకాసురుడే ఉండేవాడు. కానీ జగన్‌రెడ్డి పాలనలో ఊరికి ఒకరిద్దరు భూబకాసురులు తయారయ్యారు. వీరి ఆకలికి ప్రభుత్వ భూములు సరిపోలేదు. అటవీ భూములు ఆగలేదు. ప్రవాసాంధ్రుల భూములు పత్తాలేకుండా పోయాయి. చివరికి పేదల భూములను కూడా వదల్లేదు. చిత్తూరు జిల్లాలో వైసీపీలో పెద్ద నాయకుడు అటవీ భూములను కబ్జా చేశాడు. అటవీ భూముల్లో 104 ఎకరాలను కబ్జా చేసి విలాసవంతమైన భవంతి నిర్మించుకున్నారు. వారి బినామీల చెరలో దాదాపు 238 ఎకరాలు ఉన్నట్లు తేలింది. తిరుపతి నడిబొడ్డున రూ.100 కోట్లకుపైగా విలువైన బుగ్గమఠం భూముల్ని ఆక్రమించి, చుట్టూ ప్రహరీ గోడ కట్టేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లిలో 982 ఎకరాల ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మార్చేశారు. ఇందులో 600 ఎకరాలను పెద్ద నేత అనుచరులు రాయించుకున్నారు. ఆ గుట్టు బయటపడుతుందని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను తగులబెట్టించారు. 55 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములను ఓ ప్రభుత్వ సలహాదారు ఆక్రమించారు. కడప జిల్లాలో జగన్‌రెడ్డి బంధువులు యానాదులకు చెందిన 470 ఎకరాలను రాయించుకున్నారు. విశాఖలో జగన్‌రెడ్డి అండతో రెచ్చిపోయిన విజయసాయిరెడ్డి పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించేశారు. విశాఖపట్నంలో 8 వేల కోట్ల పైచిలుకు భూములు కబ్జాకు గురయ్యాయి. వైసీపీ నేతలు చేసిన ప్రతి స్కాంపై దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి చెప్పారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ శాఖలో జరిగిన కుంభకోణాలపైనా విచారణ చేయిస్తామని చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు ఐదేళ్లలో రూపాయైనా ఇవ్వలేదు

» పునరావాస కాలనీల్లో అరబస్తా సిమెంటు పనులూ చేయలేదు: నిమ్మల



అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదని.. పునరావాస కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంటు పనులు కూడా చేయలేదని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గత ఐదేళ్లలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు కనీసం తాగడానికి మంచి నీళ్ల ప్యాకెట్లు కూడా ఇవ్వలేదని, ఒక్క నాయకుడు కూడా వెళ్లి పరామర్శించలేదని.. దీనివల్లే బాధితులు తమను తెలంగాణలో కలిపేయాలని రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారని చెప్పారు. 2019 ఎన్నికల ముందు.. పోలవరం ప్రాజెక్టులో ఫేజ్-1 ఫేజ్-2 అని గానీ, 41.15 మీటర్లు, 45.72 మీటర్లు అని గానీ జగన్ ఎక్కడా ప్రస్తావించలేదని.. అధికారంలోకి వచ్చాక 2022లోనే మొట్టమొదటిసారి ఫేజ్-1 అని, 41.15 మీటర్లు అని.. 45,72 మీటర్లు, ఫేజ్-2 అని తెరపైకి తెచ్చారని, దీనిని వైసీపీ సభ్యులు గుర్తించాలని అన్నారు. జగన్ ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ, కూటమి ప్రభుత్వం 41.15 మీటర్ల కాంటూరులో ఫేజ్-1 కింద 2026 జూన్ నాటికి సహాయ, పునరావాసం, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-2లో 45.72 మీటర్ల ఎత్తున ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన అంచనాలను కూడా సిద్ధం చేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. కొత్తగా రాడార్ సర్వే చేయడం ద్వారా 49 గ్రామాలు ముంపు పరిధిలోకి వచ్చాయని.. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వారికి మూడు ఆప్షన్లు ఇస్తున్నామని తెలిపారు. నిర్వాసితుల నుంచి దరఖాస్తులు తీసుకుని ఈ నెలలోనే గ్రామ సభలు పూర్తి చేసి, ఏప్రిల్ నెలాఖరులోగా నిర్వాసితులు కోరుకున్న విధంగా ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన కాలనీలు గుర్తిస్తామని.. తర్వాత 90 రోజుల్లోనే ఆగస్టులోపు భూసేకరణ పూర్తి చేయాలని నిర్ణయించామని వివరించారు.

గ్యాప్-1, 2 డిజైన్లు త్వరగా పంపండి: పీపీఏ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్‌ను సకాలంలో పూర్తిచేసేందుకు వీలుగా గ్యాప్-1, గ్యాప్-2, క్లే టెక్నాలజీ ట్రీట్‌మెంట్‌పై డిజైన్లను తమ ఆమోదం కోసం త్వరగా పంపాలని రాష్ట్ర జల వనరుల శాఖను పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) కోరింది. సోమవారం హైదరాబాద్ జలసౌధలోని పీపీఏ కార్యాలయంలో సీఈవో-చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

సొసైటీల్లో భారీ దోపిడీ

» అవినీతిపరుల్ని వదిలిపెట్టం: అసెంబ్లీలో మంత్రి అచ్చెన్న

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'చరిత్రలో ఎన్నడూ చూడనివిధంగా వైసీపీ పాలనలో వ్యవసాయ సహకార సంఘాలను దోచేశారు.. పీఏసీఎస్‌ల నుంచి డీసీసీబీ వరకూ ఎక్కడా వదిలి పెట్టలేదు.. సిగరెట్ పెట్టె ముక్కపై సొసైటీ సెక్రటరీ చీటి రాసి పంపితే ఊరు, పేరూ లేనివారికి లోన్లు ఇచ్చేశారు. చర్యలకు ఉపక్రమించగానే కోర్టుకు వెళ్లి స్టే తెస్తున్నారు. దీంతో చేతులు కట్టేసినట్లు అవుతోంది' అని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో చెప్పారు. సహకార బ్యాంకుల్లో అవినీతిపై ఎమ్మెల్యేలు బూర్ల రామాంజినేయులు, కూన రవికుమార్, యార్లగడ్డ వెంకట్రావు, దూళిపాళ్ల నరేంద్ర అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఇప్పటి వరకూ 13 డీసీసీబీలపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపించి ఆరుగురిపై చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు. ఎవరినీ వదిలిపెట్టబోమని సభ్యులకు హామీ ఇచ్చారు.

రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలం

» ఆనాడు విజన్-2020ను వెటకారం చేశారు

» అదే నేటి హైదరాబాద్ అభివృద్ధికి కారణం

» 'విజన్-2047'తో 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ' ఏపీ

» పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు: ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అపారమైన రాజకీయ అనుభవం, ముందుచూపుతో వ్యవహరించే సీఎం చంద్రబాబు విజన్ అమలుతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్-2047'పై సోమవారం అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 'చంద్రబాబు ఆనాడు విజన్-2020 గురించి చెబితే అందరూ వెటకారం చేశారు. కంప్యూటర్‌లో అన్నం పెడతారా? అంటూ ఎద్దేవా చేసిన వాళ్లు ఉన్నారు. హైదరాబాద్‌లోని కొండలు, గుట్టల్లో తొండలు కూడా గుడ్లు పెట్టవు. అలాంటి ప్రాంతం సైబరాబాద్‌గా అభివృద్ధి చెందుతుందా? అని ప్రశ్నించారు. కానీ చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించి హైదరాబాదు.. సైబరాబాద్‌గా రూపాంతరం చెందుతుందని, దేశంలోనే ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అదే నేడు నిజమైంది' అని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు రూపొందించిన విజన్-2047కు ప్రజలందరూ సహకరిస్తే.. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ' ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని, 2047 నాటికి రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలబడాలనే లక్ష్యం తప్పనిసరిగా సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

చంద్రబాబుపై నమ్మకమే కారణం: విష్ణుకుమార్‌రాజు

బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 'చంద్రబాబు విజన్-2020లో పేర్కొన్న ప్రతి అంశం అమలైందని, ఒక విజనరీ నాయకుడు అధికారంలో ఉంటే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఎంత ఉజ్వలంగా ఉంటుందనేది దానికి ఇదే నిదర్శనం' అన్నారు. కానీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం సర్వనాశనమైందని విమర్శించారు. విజన్-2047పై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, ఇది అమలు కావాలంటే ఆయనే అధికారంలో ఉండాలని పేర్కొన్నారు.


అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..

10 సూత్రాలతో రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ అమలుతో ఏపీ అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. విజన్ డాక్యుమెంట్‌పై పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. 'ఆశతో ఉన్న వారికి అధికారమిస్తే జగన్ లాగా దోచుకుంటారు. ఆశయంతో ఉన్న వారికి అధికారమిస్తే చంద్రబాబులా అభివృద్ధికి బాటలు వేస్తారు' అని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. అభివృద్ధికి కొత్త దారులు సృష్టిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం పీ4 విధానంలో ప్రతి జిల్లాలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీని నెలకొల్పాలని కోరారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గతంలో విజన్-2020ని రూపొందించినప్పుడు వెటకారంగా మాట్లాడారని, అప్పట్లో హైదరాబాదులో రూ.2 లక్షలు పలికిన ఎకరం భూమి ఇప్పుడు రూ.50 కోట్లు.. 100 కోట్లు కూడా పలుకుతోందని చెప్పారు. ఈ మార్పునకు చంద్రబాబు విజనే కారణమని చెప్పారు.

గాడి తప్పిన వ్యవస్థ పట్టాలపైకి..

ఎమ్మెల్యే గోండు శంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన విజన్-2047 ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ 'నాటి విజన్-2020తో తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ వెలుగులు విరజిమ్ముతున్నాయి. నేటి విజన్-2047తో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గాడి తప్పిన వ్యవస్థలను మళ్లీ పట్టాల మీదకు తెచ్చి ముందుకు సాగుతున్నాం.' అని పేర్కొన్నారు.

'ఉపాధి'లో వైసీపీ భారీ అవినీతి!



» ఆడిట్‌తో వెలుగులోకి రూ.250 కోట్ల అక్రమాలు

» పనులు చేయకుండా మస్టర్లు.. కుమ్మక్కై దోపిడీ

» బాధ్యుల్ని వదిలేది లేదు: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో భారీఎత్తున అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అక్రమాలపై దృష్టి పెట్టి, ఆడిట్ చేయించామని, ప్రస్తుతానికి రూ.250 కోట్ల మేర అవినీతి వెలుగులోకి వచ్చిందని, అందులో రూ.71 కోట్లు రికవరీ చేసేందుకు ఆధారాలు లభించాయని సోమవారం అసెంబ్లీలో తెలిపారు. క్షేత్రస్థాయిలో పనులు చెయ్యకుండానే మస్టర్లు వేశారని, స్థానికంగా కుమ్మక్కై నిధులు స్వాహా చేశారని, అవినీతిని నిలువరించాల్సిన వ్యక్తే అందులో భాగమయ్యారని పేర్కొన్నారు. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి అడిగిన ప్రశ్నకు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలెన్స్, సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను బలోపేతం చేసి, అక్రమాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. ఆడిట్ అధికారులే కుమ్మక్కవడంతో రికవరీ కష్టంగా మారిందన్నారు. పని చెయ్యకుండా మస్టర్లు వేయడం, జేసీబీలతో చేయించిన పనికి బిల్లులు డ్రా చేసుకోవడం వంటి అక్రమాలు చాలా ఉన్నాయని వివరించారు. 520 మంది అక్రమార్కులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కేటాయింపులో అన్యాయం: డిప్యూటీ స్పీకర్ రఘురామ

ఉపాధి నిధుల కేటాయింపులో వ్యత్యాసాలను సరిచేయాలని పవన్ కు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చేసిన వినతి సభ్యుల మధ్య భిన్న వాదనకు దారితీసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ఒకే జడ్పీ ఉన్నా.. కొన్ని నియోజకవర్గాలకు రూ.16-17 కోట్లు కేటాయిస్తూ.. కొన్నింటికి నాలుగైదు కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. దీంతో పలువురు మెట్ట ప్రాంత ఎమ్మెల్యేలు ఈ వ్యాఖ్యలతో విభేదించారు.

పీహెచ్‌సీల నిర్మాణాలు పూర్తి చేస్తాం: సత్యకుమార్

గత వైసీపీ ప్రభుత్వం చాలా చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను అర్థంతరంగా వదిలేసిందని, వాటిని పూర్తి చేస్తామని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికవాడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఆపేసిన స్కీములను పునరుద్ధరిస్తామని, 80 కోట్లతో 42 వేల మందికి యంత్రాలు అందిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఆరోపణలు చేసి పారిపోతున్నారు

» సమాధానానికి సమయం ఇవ్వడం లేదు

» మార్షల్స్‌తో వారిని సభలోకి తీసుకొని రావాలి

» శాసన మండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై మంత్రి లోకేశ్





అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు ఆ అంశంపై చర్చలో పాల్గొనకుండా ఆరోపణలు చేసి పారిపోతున్నారు' అని మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం శాసనమండలిలో 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి స్పందించారు. 'బీఏసీ అజెండాను నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ సభ్యులూ అంగీకరించారు. 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై చర్చకు అనుమతిస్తూ మండలి చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014-19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయం ఇవ్వరు. ఇది మొదటిసారి కాదు. పదే పదే చేస్తున్నారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలో మార్షల్స్‌ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి. ఇప్పుడూ మార్షల్స్‌ను పెట్టి సభ బయట ఉన్న సభ్యులను సభకు తీసుకురావాలి' అని మంత్రి లోకేశ్, చైర్మన్ మోషేన్ రాజును కోరారు. ఈ సందర్భంగా 2019-24 మధ్య టీడీపీ నేతలు పలువురిపై పెట్టిన అక్రమ కేసులను ఆయన ప్రస్తావించారు.

విచారణ చేయకుండా ఆరోపణలు చేస్తున్నారు: బొత్స

ఇదే అంశంపై వైసీపీ నేత బొత్స సత్యన్నారాయణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'మండలిలో ఉద్యోగుల సమస్యలపై చర్చిద్దామని అడిగాం. దానిని పక్కన పెట్టి 2019-24 మధ్య స్కాములు జరిగాయంటూ ఆరోపణలు చేశారు. 2014-24 మధ్య జరిగిన వాటిపై చర్చకు అంగీకరిస్తే మేం సిద్ధమని చెప్పాం. విచారణ చేయకుండా ఆరోపణలు చేస్తున్నారు. గతంలో కోర్టులో ఉన్న కేసుల్ని ఈ ప్రభుత్వం విత్ డ్రా చేసుకుంటోంది' అని బొత్స ఆరోపించారు.

ఏం సార్... వాకౌట్ మేం చేస్తే మీరు వెళ్లిపోతున్నారు?

» మంత్రి లోకేశ్‌తో బొత్స.. మేం మాట్లాడుతుంటే మీరు పారిపోతున్నారుగా?

» నవ్వుతూ సమాధానమిచ్చిన మంత్రి

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో సోమవారం అవినీతి, అక్రమాలపై చర్చ నేపథ్యంలో వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. బొత్స నేతృత్వంలో వారంతా మీడియా పాయింట్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో అటుగా వస్తున్న మంత్రి లోకేశ్‌ని చూసిన బొత్స... 'ఏం సార్... శాసన మండలి నుంచి మేం వాకౌట్ చేస్తే మీరెందుకు వెళ్లిపోతున్నారు?' అంటూ లోకేశ్‌ను బొత్స ప్రశ్నించారు. 'మేం మాట్లాడుతుంటే మీరు పారిపోతున్నారుగా' అంటూ లోకేశ్ నవ్వుతూనే బొత్సకు సమాధానం ఇస్తూ తన చాంబర్ వైపునకు వెళ్లిపోయారు.

ఆయుర్వేద, హోమియోపతి డాక్టర్ల రిజిస్ట్రేషన్ సవరణ బిల్లుకు ఆమోదం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద, హోమియోపతి వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ (సవరణ) బిల్లుకు శాసనసభ ఆమోదం లభించింది. మంత్రి సత్యకుమార్ సోమవారం శాసనసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ లేకుండానే సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

చిట్టూరి మృతికి శాసనసభ సంతాపం


తణుకు మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు మృతి పట్ల శాసనసభ సంతాపం ప్రకటించింది. చిట్టూరి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ సభ 2 నిమిషాలు మౌనం పాటించింది. సోమవారం శాసనసభ డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు ఈ సంతాప ప్రతిపాదనను ప్రవేశపెట్టారు.

చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడదాం

- కేంద్ర మంత్రులిద్దరూ అనుమతులు తేవాలి
- తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై శాసనసభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వివరణ
- నేచర్ క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు పెడుతున్నాం

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీగా నామకరణం చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఒక వ్యక్తి కోసమో, కులం కోసమో, ఒక కుటుంబం కోసమో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుతో యూనివర్సిటీని కొనసాగించడం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని, గందరగోళం తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సమస్యల్లేకుండా చేసేందుకు వర్సిటీ పేరును మార్చాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అయితే ఇది పొట్టి శ్రీరాములుపై తమకు గౌరవం లేకపోవడం కాదని, ఆయనపై అపారమైన గౌరవం ఉన్నాయని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు, మాజీ ముఖ్యమంత్రి రోశయ్యతోపాటు ఆర్యవైశ్య సమాజం పట్ల తమ ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాల్సిందిగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు లేఖ రాస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వారే అనుమతులు తీసుకురావాలన్నారు. ఇక బల్కంపేట నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరును పెట్టాలని నిర్ణయించామని ప్రకటించారు.





సోమవారం ఉదయం విజయవాడలోని ప్రధాన రోడ్లన్నీ దట్టంగా కురుస్తున్న పొగ మంచులో మునిగిపోయాయి. ఉదయం సమయం ఎనిమిది గంటలు దాటినా మంచు వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక, పగలు ఎండ సెగలు పుట్టించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

- భార్య, ఇద్దరు కొడుకులు, తల్లితో కలిసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కారులో వెళ్తుండగా ప్రమాదం
- భార్య, కొడుకు, తల్లి అక్కడికక్కడే మృతి



ప్రగతిరెడ్డి అర్విన్ సునీత

షాద్‌నగర్, చౌదరిగూడ 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం తెలంగాణకు చెందిన ఓ కుటుంబంలో విషాదం నింపింది. ఐదుగురు కుటుంబ సభ్యులు కలిసి ప్రయాణిస్తున్న కారును ఓ కంటెయినర్ ఢీకొనడంతో.. అందులోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బక్రి చెప్యాలకు చెందిన రోహిత్‌రెడ్డి (38) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆయన భార్య ప్రగతిరెడ్డి (36) అమెరికాలోని ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు. రోహిత్‌రెడ్డి తల్లి సునీత (56) కూడా వారితోనే ఉంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో రోహిత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో పిక్నిక్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న ఓ భారీ కంటెయినర్ వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. వెనుక సీట్లో కూర్చున రోహిత్‌రెడ్డి తల్లి సునీత, భార్య, పెద్ద కుమారుడు అర్విన్(6) అక్కడిక్కడే మృతి చెందారు. ముందు సీట్లో కూర్చుని కారు డ్రైవింగ్ చేస్తున్న రోహిత్‌రెడ్డి, ఆయన చిన్న కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోహిత్‌రెడ్డి 12 ఏళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి కూతురు ప్రగతిరెడ్డిని వివాహం చేసుకున్నారు. అనంతరం వారు అమెరికాలో స్థిరపడ్డారు. ప్రగతిరెడ్డి తల్లితండ్రులు మంగళవారం సాయంత్రం అమెరికాకు బయలుదేరుతారు. ఫ్లోరిడాలోనే మృతులకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం.

పునుగు పిల్లుల సంరక్షణకు ప్రత్యేక నిర్మాణాలు

- 1.97 కోట్ల టీటీడీ నిధుల వ్యయానికి ప్రభుత్వం అంగీకారం
- ఎస్వీ జూలో ఎన్‌క్లోజర్ అభివృద్ధి
- పునుగు పిల్లుల ప్రత్యేకత తెలిపేలా బోర్డులు

తిరుమల, మార్చి17(ఆంధ్రజ్యోతి): అరుదైన పునుగుపిల్లుల జాతి సంరక్షణ, వాటి విశిష్టత వ్యాప్తి కోసం టీటీడీ ఖర్చుపెట్టనున్న నిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు దేవదాయశాఖ సెక్రటరీ వినయ్‌చంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమలేశుడికి నిర్వహించే సేవల్లో అత్యంత పవిత్రమైన అభిషేక సేవలో వినియోగించే పునుగుపిల్లి తైలం కోసం ఆ జాతి సంరక్షణ చర్యలు మరింత పకడ్బందీగా చేయాలని టీటీడీ ఆలోచన చేసింది. గతంలో శ్రీవారి కైంకర్యంలో వాడే పునుగుపిల్లుల తైలాన్ని సేకరించేందుకు వీటిని అర్చకులే తమ నివాసాల్లో పెంచేవారు. కాలం మారేకొద్దీ వాటి సంరక్షణ కష్టతరంగా మారిపోవడంతో తిరుపతి ఎస్వీ గోశాలకు వాటిని తరలించారు. అక్కడ కూడా వాటి సంఖ్య తగ్గిపోవడాన్ని గుర్తించి వాటి సంరక్షణ బాధ్యతలను ఎస్వీ జూకు అప్పగించారు. ప్రస్తుతం వాటి సంరక్షణ మరింత మెరుగ్గా నిర్వహించాలని టీటీడీ భావించింది. దీని కోసం కొన్ని ప్రత్యేక నిర్మాణాలను చేపట్టేందుకు గతేడాది డిసెంబరులో ధర్మకర్తల మండలి తీర్మానించింది. జూలో పునుగు పిల్లులను ఉంచిన ప్రదేశాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అవి ఇష్టపడే, సౌకర్యవంతంగా జీవించే గుహలు వంటి నిర్మాణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే పునుగు పిల్లుల విశిష్టతను ప్రతి ఒక్కరికి తెలిపేలా బోర్డులు, వాటి బొమ్మలతో కూడిన ఫ్లెక్సీలు, పునుగు పిల్లుల పెరుగుదలకు ఆటంకం కలిగించే గబ్బిలాల నుంచి రక్షించే గబ్బిలం ట్రాప్‌బోన్లు, బయటి వాతావరణం నుంచి రక్షణ కల్పించేలా అద్దాల నిర్మాణాల వంటి వాటిని ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీనికోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే సెంట్రల్ జూ అథారిటీ నుంచి కూడా అనుమతులు పొందారు. ఈ ప్రత్యేక నిర్మాణాల కోసం చెన్నైకు చెందిన హెచ్‌పీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రూ. 1.97 కోట్లతో కొటేషన్ వేసింది. దీనికి ఆమోదం కోసం టీటీడీ ప్రభుత్వానికి లేఖ పంపింది. ఈక్రమంలోనే నిధుల వ్యయానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి.

తిండికి మించి తాగుడు!

- సగటున ఆహారానికి రూ.80
- తాగుడుకు రూ.158 ఖర్చు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో సగటున రోజుకు ఒక వ్యక్తి ఆహారానికి చేసే ఖర్చు రూ.80. అదే మద్యం తాగడానికి రూ.158 ఖర్చు చేస్తున్నారు. అంటే మనిషి బతకడానికి అవసరమైన ఆహారం కంటే.. మత్తులో ముంచెత్తే మద్యానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. రోజంతా కష్టపడే దినసరి కూలీలు, రిక్షావాలాలు, ఇతరత్రా సాదాసీదా పనులు చేసుకునేవారే ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. కాస్త సంపాదన ఎక్కువ ఉన్నవారు ఎంత వెచ్చించి తాగినా అది వారి ఆర్థిక పరిస్థితిపై పెద్దగా ప్రతికూల ప్రభావం చూపదు. కానీ దినసరి కూలీలు తమ ఆదాయంలో మూడోవంతును మందుకే పోస్తున్నారు. రోజుకు 2-3 క్వార్టర్లు తాగేవారైతే ఒక్క రూపాయి కూడా ఇంటికి తీసుకెళ్లడం లేదు. రోజంతా కష్టపడి సంపాదించిందంతా మందు కోసం ఖర్చుచేసి ఉత్తచేతులతో ఇంటికెళ్లేవారూ ఉన్నారు. కాగా ఒక రోజుకు సగటున రాష్ట్రంలో రూ.85 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. జాతీయ గణాంకాల కార్యాలయం అంచనా ప్రకారం 2021లో దేశంలో భోజనం కోసం చేస్తున్న ఖర్చు.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.43, పట్టణ ప్రాంతాల్లో రూ.91గా ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సగటు ఖర్చు రూ.80. ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి చేసే ఖర్చు ఇది.

మద్యం అమ్మకాలు... పైపైకి!

సంవత్సరం	లిక్కర్	బీరు
2020-21	1,87,59,131	57,00,653
2021-22	2,63,72,713	81,53,607
2022-23	3,35,90,000	1,16,70,000
2023-24	3,46,69,000	1,17,08,000
2024-25 ఫిబ్రవరి వరకు	3,34,13,592	1,14,18,587

బాటిళ్లు ఖాళీ!

రాష్ట్రంలో రోజుకు సగటున 1,01,253 కేసుల లిక్కర్ విక్రయాలు జరుగుతున్నాయి. కేసుకు 48 సీసాల చొప్పున మొత్తం 48,60,158 సీసాలు ఉంటాయి. రోజుకు 34,601 కేసుల బీరు అమ్ముడవుతోంది. కేసుకు 12 సీసాల చొప్పున అవి 4,15,221 సీసాలు ఉంటాయి. రాష్ట్ర జనాభా 5 కోట్లు కాగా దీనిలో మహిళలు, పిల్లలు కాకుండా పురుషుల సంఖ్య 2 కోట్లకు పైనే ఉంది. మొదటి నుంచీ రాష్ట్రంలో ఉన్న ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎక్కువ మంది రోజుకు క్వార్టర్ తాగుతున్నారు. ఆ లెక్కన రాష్ట్రంలోని పురుషుల్లో ప్రతి నలుగురిలో ఒకరు మందు తాగుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో చేసిన ఓ సర్వే ప్రకారం రాష్ట్రంలో 30 లక్షల మందికి మద్యపానం అలవాటు ఉందని తేలింది. ఇప్పుడది 50 లక్షలు దాటింది.

డీఎడిక్షన్ కీలకం!

మద్యం తాగేవారిలో అనేక రకాల మంది ఉన్నారు. మద్యానికి బానిసై తాగకపోతే ఉండలేనివారు కొందరైతే, రోజూ ఎంతో కొంత పుచ్చుకునే అలవాటు ఉన్నవారు మరికొందరు. అయితే దినసరి కూలీల్లో మద్యం అలవాటు ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో వీరి ఆదాయం మద్యానికి కరిగిపోతోంది. ఫలితంగా కుటుంబాలు నడవడం కష్టసాధ్యంగా మారి.. అప్పుల బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత వేగంగా మద్యం అలవాటును తప్పించేందుకు డీఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సామాజిక ఉద్యమకారులు సూచిస్తున్నారు.

మందుబాబులు..!

ఒకప్పుడు మద్యపానాన్ని సమాజం దురలవాటుగా చూసేది. అందులోనూ ఎక్కువగా పెద్దవారికే మద్యం అలవాటు ఉండేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా యువకులు సైతం మద్యం మత్తుకు బానిసలవుతున్నారు. 30 ఏళ్లలోపు వారిలోనూ మద్యం తాగేవారి సంఖ్య పెరిగిందనే అంచనాలు ఉన్నాయి. ఈ పరిణామంతో మద్యం సాధారణ నిత్యావసర సరుకులా మారిందని ఎక్సైజ్ అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఓవైపు మద్యం తాగేవారి సంఖ్య పెరుగుతుంటే మత్తులో మునిగి తేలే మార్గాలూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలో గంజాయి వినియోగం పెరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీని అస్తవ్యస్తం చేసిన నేపథ్యంలో గంజాయి వినియోగం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా గంజాయి వినియోగం కనిపిస్తూనే ఉంది. ఎవరే మద్యం తాగుతారనే దానిపై విక్రయదారుల్లోనూ స్పష్టత ఉంది. అప్పుడప్పుడే మందు అలవాటైన వారిలో ఎక్కువ మంది బీరు తాగుతున్నారు. ఎప్పటినుంచో అలవాటు ఉన్నవారు లిక్కర్ లాగించేస్తున్నారు. కాలాలను బట్టి కూడా వినియోగం మారుతూ ఉంటుంది. వేసవిలో బీరు అమ్మకాలు భారీగా పెరుగుతాయి. శీతాకాలంలో లిక్కర్ అమ్మకాలు ఎక్కువ.

అమెరికాలో టోర్నడోల బీభత్సం

- అన్నదమ్ముల దుర్మరణం



అమెరికాలో టోర్నడో ప్రమాదంలో మరణించిన సాధు, జోషా అష్‌విల్లీ

తెనాలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అమెరికాలో టోర్నడో(సుడిగాలి తుఫాను)లు బీభత్సం సృష్టించాయి. తీవ్రమైన టోర్నడోల ధాటికి తెనాలి, అమెరికాకు చెందిన దంపతుల ఇద్దరు కుమారులూ దుర్మరణం చెందారు. దీంతో తెనాలిలోనూ వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన దివంగత గడ్డం థామస్ కుమార్తె షారోన్‌కు, అమెరికాకు చెందిన నథానియేల్ లివిస్కాకు గతంలో తెనాలిలోనే వివాహం జరిగింది. వారు అమెరికాలోని మిస్సిస్సిపీ రాష్ట్రంలో స్థిరపడ్డారు. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. కుమారులు సాధు(15), జొషా అష్‌విల్లీ(16) ఆదివారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా, తెల్లవారు జామున టోర్నడో ధాటికి పెద్ద చెట్టు విరిగి ఇంటిపై పడడంతో వారు అక్కడిక్కడే మరణించారు. మరో గదిలో నిద్రిస్తున్న తమ కుమార్తె షారోన్, అల్లుడు, మనుమరాలు మాత్రం క్షేమంగా ఉన్నారని షారోన్ తల్లి మేరీగ్రేస్ థామస్, సోదరుడు జూనియర్ థామస్ విలేకరులకు తెలిపారు. ఇద్దరు మనవళ్లూ నిద్రలోనే మరణించటంపై వారు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలియడంతో పుట్టెడు దుఃఖంతో మేరీగ్రేస్, జూనియర్ థామస్ సోమవారం అమెరికా బయలుదేరి వెళ్లారు. షారోన్ తండ్రి గడ్డం థామస్ తన చివరి రోజుల వరకు తెలుగుదేశం పార్టీ నాయకుడిగానే ఉన్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మద్యం స్కాం కేసులో.. హైకోర్టుకు మిథున్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ ఇవ్వాలని వినతి



అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో వైసీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి విథున్‌రెడ్డి సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. గత ఏడాది సెప్టెంబరు 23న సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. 'ఈ కేసులో నన్ను నిందితుడిగా చేర్చినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక అధికారిగా చేసిన సత్యప్రసాద్ మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌ను సైతం పత్రికల్లో ప్రచురించారు. కొన్ని మద్యం కంపెనీలకు అనుచిత లబ్ధి, మరికొన్నింటికి నష్టం జరిగేలా లావాదేవీలన్నింటినీ నేనే పర్యవేక్షించినట్లు అందులో ఆరోపించారు. రాజకీయ ప్రతీకారంతో దర్యాప్తు సంస్థ దురుద్దేశపూర్వకంగా నన్ను నిందితుడిగా చేర్చింది. ఏక్షణంలోనైనా అరెస్టు చేస్తారని ఆందోళనగా ఉంది. ఎఫ్ఐఆర్‌లో సీఐడీ నాపై పెట్టిన సెక్షన్లు చెల్లుబాటు కావు. దర్యాప్తునకు సహకరిస్తాను. ఏప్రిల్ 4వరకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఉన్నాయి. లోక్‌సభకు హాజరు కావాలి. ముందస్తు బెయిల్ ఇవ్వండి' అని కోరారు.

డాక్టర్ ప్రభావతి 'బెయిల్'పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో గుంటూరు జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీగా ఉన్న తనను సీఐడీ కస్టడీలో తీవ్రంగా వేధించారంటూ గుంటూరులోని నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. ఆ కేసులో నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ఏ-5గా ఉన్నారు. ముందస్తు బెయిల్ కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం కొట్టివేసింది. ఈ తీర్పును ఆమె జనవరి 22న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. పోలీసుల విచారణకు సహకరించాలని ప్రభావతిని ఆదేశించింది. అలాగే నాలుగు వారాల వరకు ఆమెను అరెస్టు చేయొద్దని స్పష్టంచేసింది. ఆమె పిటిషన్ సోమవారం మళ్లీ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరఫున వర్చువల్‌గా హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా.. విచారణను వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. గత విచారణ సందర్భంగా తామిచ్చిన ఆదేశాలు అప్పటి వరకు అమల్లో ఉంటాయని తెలిపింది.

తప్పుడు కేసుల నుంచి విముక్తి కల్పించండి

- విద్యాసాగర్, సజ్జన్ జిందాల్ వేధిస్తున్నారు: నటి జెత్వానీ

విజయవాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై నమోదు చేసిన తప్పుడు కేసుల నుంచి విముక్తి కల్పించాలని ముంబై నటి/మోడల్ కాదంబరి జెత్వానీ ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న పది సెల్‌ఫోన్లను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల విద్యాసాగర్, సజ్జన్ జిందాల్ కలిసి ఢిల్లీ కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌తో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం విజయవాడలో మహిళా సంఘాల సమాఖ్య ప్రతినిధులు సుంకర పద్మశ్రీ, బొల్లినేని కీర్తి, రమాదేవి, దుర్గాభవానీలతో కలిసి జెత్వానీ విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత తనకు న్యాయం చేయాలని.. తప్పుడు కేసుల కారణంగా తన కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించినా పురోగతి లేదని, ఇప్పటి వరకు ఫోరెన్సిక్ నివేదిక రాలేదని.. తనను వేధించిన నిందితులపై చర్యలు తీసుకోలేదని.. తనపై తప్పుడు కేసులు పెట్టడానికి కారకుడైన విద్యాసాగర్ మాత్రం బెయిల్‌పై యథేచ్ఛగా తిరుగుతున్నాడని.. అతడిని వెనుక నుంచి సజ్జనే నడిపిస్తున్నాడని ఆరోపించారు.

వంశీకి బెయిలిస్తే విదేశాలకు పారిపోతారు!

- బయటికొస్తే సాక్షులను బెదిరిస్తారు
- ఎస్సీ, ఎస్టీ కోర్టులో ప్రాసిక్యూషన్ వాదనలు
- గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే రిమాండ్ 28 దాకా పొడిగింపు



విజయవాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉంది. ఆయనకు ఈబీ5 వీసా ఉంది. ఆయన విదేశాల్లో రూ.20 కోట్ల వరకు వివిధ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టారు' అని ప్రాసిక్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ కోర్టుకు వివరించారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్న వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది. రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. హైదరాబాద్ గచ్చిబౌలిలో వంశీ నివాసం ఉంటున్న మైహోం భూజా అపార్టుమెంట్ నుంచి సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకోవని ఉందని తెలిపారు. అక్కడి నుంచే సత్యవర్ధన్‌ను కారులో విశాఖపట్నం తరలించారని, అక్కడ ఆయన్ను బంధించిన గెస్ట్‌హౌస్ నుంచి కూడా సీసీ ఫుటేజీలను తీసుకోవాలని వివరించారు. వంశీకి బెయిల్ ఇస్తే దర్యాప్తు ముందుకు సాగదని.. ఆయన బయటకు వస్తే సాక్షులను బెదిరిస్తారని, ఆయనకు నేరచరిత్ర ఉందని.. ఈబీ5 వీసాను ఉపయోగించుకుని ఆయన పారిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. న్యాయాధికారి హిమబిందు తదుపరి విచారణను గురువారాని(20వ తేదీ)కి వాయిదా వేశారు. ఇంకోవైపు.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ రిమాండ్‌ను 28వ తేదీ వరకు సీఐడీ కోర్టు పొడిగించింది. ఆయన్ను ప్రశ్నించేందుకు ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సీఐడీ పిటిషన్ వేసింది. ఇదే కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై బుధవారంలోపు కౌంటర్ వేయాలని న్యాయాధికారి ప్రాసిక్యూషన్‌ను ఆదేశించారు.

జగన్, అమిత్‌షా సలహా తీసుకున్నాడేమో!

- వివేకా హత్య కేసులో సాక్షులు చనిపోతున్నారు: నారాయణ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు చనిపోతున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై పెట్టిన కేసుల్లో కూడా లాయర్, 12 మంది సాక్షులను చంపేశారు' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్.. అమిత్‌షాను కలిసి సలహా తీసుకుని ఉంటాడనిపిస్తోంది. సాక్షులను మాయం చేసినంత మాత్రాన నేరస్థులు కారా? టెక్నికల్‌గా తప్పించుకున్నా... ఆచరణ రీత్యా ముద్దాయే. తాను పవిత్రుడినని మోదీ అనుకుంటే సరిపోదు" అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, రాజధానికి కేంద్రం సహకారం ఉందో లేదో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు.

అరాచక శక్తుల్ని అణచేయండి

- డీజీపీ గుప్తాకు సీఎం చంద్రబాబు ఆదేశం
- టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్యపై సీరియస్
- రాజకీయ ప్రత్యర్థులపై పోలీసు నిఘా.. కట్టడికి కార్యాచరణ ప్రణాళిక



అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'పట్టపగలు, వేట కొడవళ్లతో నరికి చంపుతున్నారు.. ముందుగా చెప్పి మరీ పీకలు కోస్తున్నారు.. ఇటువంటి అరాచక శక్తులు బయట ఉండటానికి వీల్లేదు.. ఉక్కుపాదంతో అణచి వేయండి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో ఈ నెల 15న వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరుడు వెంకటరమణ చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ మృతి అధికార పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం శాసనసభ, మండలి లాబీల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును డీజీపీ కలిసి రాష్ట్రంలో శాంతి భద్రతలపై వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ హత్యపై సీరియస్ అయిన చంద్రబాబు 'వైసీపీ వాళ్ల నుంచి తన ప్రాణానికి ముప్పుందని వీడియో ద్వారా వేడుకున్న కార్యకర్తను కాపాడుకోలేక పోవడం చాలా బాధగా ఉంది' అన్నట్లు తెలిసింది. పోలీసుల వైఫల్యంపైనా పెదవి విరిచినట్లు సమాచారం. అక్కడి సీఐతో పాటు స్థానిక పోలీసులపైనా వేటు వేశామని, ఐదుగురు నిందితుల్లో ఏ1 సహా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని డీజీపీ వివరణ ఇచ్చారు.

ఎస్పీలతో డీజీపీ టెలి కాన్ఫరెన్స్

సీఎం ఆదేశాలతో వెంటనే కార్యాచరణ మొదలు పెట్టిన డీజీపీ గుప్తా జిల్లాల ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'మీ జిల్లాలో రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టండి. వారి కదలికల్ని గమనిస్తూ అనుమానం వచ్చిన వెంటనే రంగంలోకి దిగండి. ఎక్కడికక్కడ బైండోవర్లు చేయండి. ఎవరైనా ప్రాణహాని ఉందని పోలీసు స్టేషన్‌కు వస్తే భద్రత కల్పించండి' అంటూ కీలక ఆదేశాలు జారీ చేశారు.

నేతల నిట్టూర్పు..

తనకు ప్రాణహాని ఉందన్న కార్యకర్తను అధికారంలో ఉన్నప్పుడు కూడా కాపాడుకోలేక పోవడం చేతగాని తనమేనంటూ చిత్తూరు జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేతో పాటు పలువురు నేతలు మంత్రి లోకేశ్ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'అప్పట్లో అంగళ్లలో మన నాయకుడిపై దాడి చేశారు.. ఇప్పుడు పుంగనూరులో మన కార్యకర్తను నరికి చంపారు.. ప్రభుత్వం మారినా ఏమీ తేడా లేదు' అంటూ నేతలు నిట్టూర్చారు. ఈ హత్యను సీరియస్‌గా తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.

20న తిరుమలకు చంద్రబాబు

తిరుపతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు 20న తిరుమల రానున్నారు. 21న శ్రీవారిని దర్శించుకుని టీటీడీ పరిపాలనా వ్యవహారాలపై దేవస్థానం, జిల్లా యంత్రాంగాలతో సమీక్షించనున్నారు. 21న మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులతో వస్తున్నట్టు సమాచారం. ఏటా దేవాన్ష్ జన్మదినాన తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని, నిత్యాన్నదాన పథకానికి విరాళమిచ్చి, అక్కడే భక్తులకు వడ్డించి, తామూ అన్న ప్రసాదాలు స్వీకరించడం బాబు కుటుంబం పాటిస్తున్న ఆనవాయితీ. అందులో భాగంగా 20న రాత్రికి కుటుంబసభ్యులతో కలిసి తిరుమల రానున్నారు.

అయ్యో అమరజీవి!

(మొదటి పేజీ తరువాయి)

వెసులుబాటును బట్టి ఖర్చులు భరిస్తున్నారు. వాస్తవానికి 2015కు ముందు వరకూ అమరజీవి శిష్యుని కుమారుడు వైఎస్ రామకృష్ణ నేతృత్వంలోని కొంతమంది ప్రముఖులు ఈ భవనం ఆలనాపాలనా చూశారు. అప్పట్లో ఏపీ ప్రభుత్వం నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో అప్పటివరకూ చూసిన వారు నిమ్మకుండిపోయారు. కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం నిర్వహణ నిధుల సంగతి మరిచింది. భవనానికి వినియోగించే విద్యుత్, నీరు, పన్నులు తదితరాలతో పాటు నిర్వహణ చూసే ఇద్దరు సిబ్బంది జీతభత్యాలు కూడా చూడాల్సి ఉంది. ఇక అమరజీవి జయంతి, వర్ధంతుల సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించడం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి భవన సందర్శన సమయంలో కొంత ఖర్చవుతోంది. ఈ ఖర్చులన్నింటినీ కమిటీ నిర్వాహకులే ఎవరి శక్తి మేరకు వారు వేసి చెల్లిస్తూ వచ్చారు. 2019లో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు టీడీపీ ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఆ మొత్తం బకాయిల చెల్లింపునకే సరిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కమిటీలో కొన్ని మార్పులు చేసింది. కానీ ఐదేళ్లపాటు నిధుల గురించి పట్టించుకోకుండా 2024లో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రూ.4.5 లక్షలు విడుదల చేసి చేతులు దులుపుకుంది. ఆ నగదు సభ్యుల బకాయిలకు కూడా సరిపోలేదు. మళ్లీ నాటి నుంచి నేటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా రాలేదు. చెన్నైలో అమరజీవి భవనం ఒకటి ఉందని, అది రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి అన్న ఎరుక ప్రభుత్వానికి ఉన్నట్లు లేదు. కొత్త కమిటీ రాకుండా రాజీనామా చేస్తే 'స్మారకం' అనాథ అవుతుందన్న వేదనతో అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీనే కొనసాగుతోంది. అక్కడ సిబ్బందికి ఏడాదిగా జీతభత్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. భవనం కప్పు పెచ్చు లూడుతోంది. గోడల్లో పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. పై అంతస్తులో వున్న గ్రంథాల సంగతి చెప్పాల్సిన పనే లేదు. వాటిని కాపాడడానికి నిర్వహణ కమిటీ చేడుతున్న చర్యలు సరిపోవడం లేదు. దీని నిర్వహణకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గతంలో రూ.5 లక్షలు ఇస్తానంటూ ప్రకటన చేశారు కానీ తర్వాత ఆయన ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మరింత శోచనీయమైన అంశం ఏమిటంటే... ఈ భవనం ఏపీ ప్రభుత్వానికి చెందినదన్న విషయం కొంతమంది ఉన్నతాధికారులకీ తెలియకపోవడం. అమరజీవికి అమరావతిలో 58 అడుగుల విగ్రహాన్ని నిర్మిస్తానని ప్రకటించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు... చెన్నై వైపు తన దృష్టి సారిస్తే స్మారక భవనం బాగుబాడుతుంది. అది ఠీవిగా నిలబడినంత కాలం చరిత్రను చాటిచెపుతూనే ఉంటుంది. ఆ దిశగా ఆలోచన చేసి రాష్ట్ర ప్రభుత్వం నిధుల విషయంలో ఒక శాశ్వత ప్రతిపాదన చేసి అమలు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



పొట్టి శ్రీరాములు స్మారక భవనం

కోట్లు అక్కర్లేదు!

ఈ భవనం నిర్వహణకు రూ.కోట్లు అవసరం లేదు. రూ.నాలుగైదు లక్షలు వ్యయం చేస్తే భవనం మరమ్మతులు పూర్తవుతాయి. ఇక్కడ అమూల్యమైన గ్రంథాలున్నాయి. సరైన ఆలనాపాలనా లేకుంటే అవి పాడైపోయే అవకాశముంది. కొంతమంది ప్రముఖులు దీని బాగోగులు చూసేందుకు ముందుకు రావాలనుకున్నా, ప్రభుత్వ నిబంధనలతో వారు దూరంగానే ఉండిపోవాల్సివస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.